F.A. Text for 1895 & B. A. Text for 1901.

VENISAMHARA NATAKAM.

TRANSLATED INTO TELUGU

From Bhattanarayana's Sanskrit Play

BY

VADDATHI SUBBARAYADU,

Telugu Pandit Government 1st grade Training College, Rajahmundry.

THIRD EDITION COPIES 2000

Rajahmundry:

PRINTED AT THE CHINTAMANI PRESS.

1905.

Price Rs 0-14-6. Exclusive of Postage.

శ్రీ

వేణీసంహారనాటకము.

1895వ సం. ప్రథమశాస్త్రపరీక్షకును, 1901వ సం. పట్టపరీక్షకును

బఠనీయముగా నిర్ణయింపఁబడినది.

ఇది

భట్టనారాయణకవికృతమైనసంస్కృతనాటకమునుండి

రాజమహేంద్రవరమునందలిదొరతనమువారి

మొదటితరగతిబోధనాభ్యసనసర్వకళాశాలయందు

నాంధ్రోపాధ్యాయుఁడగు

వడ్డాది - సుబ్బారాయఁడు

తెలిఁగించినది.

మూడవకూర్పు ప్రతులు 2000.

రాజమహేంద్రవరము:

శ్రీ చింతామణీ ముద్రాక్షరశాలయందు

ముద్రింపఁబడినది.

1905.

దీనివెల అంచెకూలిగాక ౦-౧౪-౬.

సరససంగీతసాహిత్యభరతనిరతుఁ
డర్థిజనకల్పవల్లి రంగాంబయల్లుఁ
డఖిలవిద్యానిధిస్థాన మైనరాజ్మ
హేంద్రపురి వచ్చి నన్ను వీక్షింప వచ్చి. ౬.

వ. సముచితసత్కారంబు లంగీకరించి మదీయమనోగతం బెఱింగించిన సంతసించి

ఉ. చిన్నటనాఁటనుండి మనచేసెడు నెయ్యము దోసమో, నిజం
బున్నదొ యిందు నే నెఱుఁగ నో ప్రియమిత్రుఁడ! సుబ్బరాయ! నీ
వున్నతిఁ జేయు కావ్యము లనూనసుధాలహరీసమంబు లై
చున్నవి నామనంబునకు; నొప్పులకుప్పలు నీదుకబ్బముల్. ౭.

శా. మాతో డల్లుఁడు సుందరాహ్వయుఁడు యుష్మన్మేఘసందేశముం
జేతోమోద మెలర్ప ముద్రితముగాఁ జేసెం గదా ముం ; భవ
చ్చాతుర్యంబున నిష్ఠానర్వఁగలదృశ్యంపుంబ్రబంధం బెటన్
ద్యోతింపం బనిపూని హెచ్చరిక నచ్చొత్తింతు నే మిత్రమా. ౮.

తే.గీ. మఱియు దీనిప్రయోగంబు తెఱఁగుఁ జూడ
నాకు వేడుక పొడముచున్నది వయస్య!
త్వరగ రచియింపు దానికి వలయు తెరలు
మొదలుగా సిద్ధపఱుచు చుండెదను నేను. ౯.

తే.గీ. కొంచెమైనను నాకుఁ దెల్గునను గావ్య
పరిచయముకల్గి నీశిక్షపటిమఁ గాదె?
బంధుగురుమిత్రభావముల్ పాదుకొన్న
వసతి నీ విట నానెన రసదె సఖుఁడ! ౧౦.

వ. అని యనేకప్రకారంబుల నపారస్నేహాపారవశ్యంబు నౌదార్యంబు
నౌత్సుక్యంబునుం దేటపడం బలికి వేగిరించిన.

ఆ.వె. అదన గురియువాన కారంభమట్లు, నా
యనుఁగువచనములకు నంతరంగ
మందుఁ గోర్కి పొదల, నానందమునఁ దేలి
గ్రంథరచన కేను గడఁగినాఁడ. ౧౧.

౧వ ఆగష్టు ౧౮౯౯వ సం.
రాజమహేంద్రవరము.

వడ్డాది- సుబ్బారాయఁడు.

వేణీసంహారనాటకము.

ఇష్టదేవతాప్రశంసనాదికము.

శ్రీలీలాపరతంత్రుఁడై గ్రహవిరాజివ్వ్యోమమున్ కాచదీ
పాళీదీప్తవితానమొప్పఁగ విశ్వాగారరంగంబునన్
హేలిం జంగమపాత్రవర్గములు నానావేషనానారసో
ద్వేలస్ఫూర్తి నటింప హేతు వగు నేవేల్పాతనిం గొల్చెదన్.

ఉ. భౌతికమైనయట్టిక్షణభంగురకాయము హేయ మంచు సం
ప్రీతిని వాఙ్మయాక్షరశరీరముతోడ నశేషదేశముల్
ఖ్యాతిఁ జరించుచున్ వివిధకల్పనలన్ హితబోధ సేయుచున్
నీతికి మూలమై వసుధ నిల్చినసత్కవికులం దలంచెదన్. ౨.

చ. వినియెడువారికే కనెడువేడ్క యొనర్చెడుభారతార్థముల్
గనుఁగొన నబ్బెనేని మదిఁ గల్గెడుప్రీతికి మేర యున్నదే?
యని తలపోసి తచ్చరిత మచ్చుపడంగను నాటకంబుగాఁ
బొనరిచి నేఁ గృతార్థతను బొందెదఁ గాకని యున్నయత్తఱిన్. ౩.

వ. మదీయసహకారుం డగుచేవలిసోమయార్యుం డేగుదెంచి.

ఉ. భారత మన్న నీకుఁ గడుపక్షము; మున్వచనంపుఁగావ్యముం
గా రచియించినాఁడ వది క్రమ్మఱ నిప్పుడు నాటకంబుగాఁ
గూరుతు నంటి మే లయినఁ, గ్రొత్తగఁ జేయుటకంటె వేణిసం
హారము తెల్గుసేయు మది నైకరసాస్పద మేఁ బఠించితిన్. ౪.

క. అనుటయు నాజతనంబున
కనుకూలమె యిది యటంచు నాగ్రంథంబుం
దెలిఁగింపఁ దలఁచి యుండం
గను నాకస్మికము రాజకార్యమువీఁదన్. ౫.

సీ. శ్రీమహాలక్ష్మీపరిగ్రహపక్షుండు వాడ్రేవుకులపయోవార్ధివిష్ణుఁ
డమలకస్తూరివంశాంబోధిచంద్రుండు దర్పితపరచక్రతాపకరుఁడు
పటుతరాజ్ఞారూఢిభాస్కరతనయుండు పరనిజకార్యనిర్వహణధుర్యుఁ
డాశ్రితపోషణాయత్తచిత్తాబ్జుండు ప్రాంచితనారసింహాహ్వయుండు

పీఠిక.

వేణీసంహార మనునీనాటకము భారతకథ ననుసరించి భట్ట నారాయణుఁ
డనుకవి గీర్వాణ భాషయందు రచియించినాఁడు. ఇది రౌద్రరసప్రధానం బైనను
అష్టరసాశ్రయం బని చెప్పఁదగి యున్నది. దీనికిఁ గథానాయకుఁడు పార్థమధ్య
ముఁడు భీమసేనుఁడు. ఆదిపంచక యుద్ధపంచకములకథ యీనాటకమందలి
యాఱంకములలోను సంగ్రహముగాఁ దెలియవచ్చును. భారతకథా పరిచయము
కొంచె మయిన నుండకపోయిన దీనియందలికథాసందర్భములు చక్కఁగా బోధ
పడవు. ధృతరాష్ట్రుఁడుఁ బాండురాజు నని యిద్ద ఱన్నదమ్ములు. వీరిలోఁ బ్రథముఁ
డంధుఁడు. అతనికి గాంధారి యనుభార్యయందు నూర్వురు కొమరులు నొక
కొమార్తయుఁ గలిగిరి. అందగ్రజుఁడు దుర్యోధనుఁడు; ద్వితీయుఁడు దుశ్శాస
నుఁడు; కొమార్త దుస్సల. పాండురాజునకుఁ గుంతియు మాద్రియు నని యిరు
వురు భార్యలు. యుధిష్ఠిరుఁడు భీముఁడు నర్జునుఁడు నని కుంతికి మువ్వురును,
నకులుఁడు సహదేవుఁడు నని మాద్రికి నిద్దఱును గుమారులు. వీ రేవురును దేవ
తాంశసంభూతులు. ఇందుఁ గనిష్ఠు లిరువురును గవలు.

ఒక కాలమునఁ బాండురాజు వేటకుఁ బోయి యయ్యడవిలో లేడులయి
క్రీడించెడు మునిదంపతుల, నెఱుంగక తనయులుంగునకుం గుఱి యొనర్చుటం జేసి
యసులు దొఱఁగుచు నందు ఋషి యొసంగిన శాపంబున మరల నింటికి రాక
యక్కడనే వానప్రస్థుం డయి యుండి కొండొకకాలంబునకు మరణించినఁ జిన్న
భార్య యగుమాద్రి యాతనితో సహగమనముఁ జేసెను. అనంతరము కుంతిని
గుమారుల నేవురను నచ్చటిమునిశ్రేష్ఠులు హస్తిపురంబునకుఁ దీసికొని వచ్చి
ధృతరాష్ట్రున కప్పగించి పోయిరి. ఆధృతరాష్ట్రుండును దన కరణ్యంబునుండి
నూడిద దెచ్చినసింహడింభకంబులుం బోలె నున్నతనతమ్మునిబిడ్డల నత్యాదరం
బునం బోషించుచుండ దుష్టుం డగుదుర్యోధనుం డోర్వలేక రాజ్యలోభంబున
వారి నెట్లయిన రహస్యంబుగాఁ జంప వలయు నని బహువిధంబులఁ బ్రయ
త్నించి యాప్రయత్నము లేవియుఁ గొన సాగ నందున ధృతరాష్ట్రునిచే యావ
రాజ్యాభిషిక్తుం డయి రాజసూయయాగంబుఁ జేసి యింద్రప్రస్థపురంబున
నింద్రభోగంబుతో సుఖం బున్నధర్మరాజు ననుజసహితు నుపాయాంతరంబునఁ

జేయవలయు నని తనతండ్రిచే హస్తిపురంబునకుఁ బిలిపించి యాతనిం దనతోఁ జూదమాడం బురికొలిపి తనమేనమామ శకుని గొనితెచ్చిన మాయపాచికలతోఁ దదీయ సర్వస్వంబు నోడుచుకొనుటయె కాక పాండవపత్ని యగు ద్రౌపదిని తనతమ్ముఁ డయినదుశ్శాసనునిచే నీడ్పించి కొలువులోనికి రప్పించి యచ్చో నామెకట్టుబట్టను విప్పించెను.

ఇట్టు లవమానకరముగాఁ బాండవులను వారిసర్వధనములతోడను గెలుచుకొని యంతతో నయినఁ దృప్తి నొందక దుర్యోధనుఁడు ధర్మరాజున కింకను జూదంబునం దాశ పుట్టునట్టు లన్నా! మన మింకొకపందెము వేయుదము. అది నీవు గెలిచితివేని నే నీవఱలో గెలుచుకొన్న దంతయు నీకు వదలి వేసెదను. ఓడితివేని ద్రౌపదితోడను దమ్ములతోడను నీవు పండ్రెండేడులు వనవాసంబు నొక్కయేఁ డజ్ఞాతవాసంబుఁ జేయవలయు. అని చెప్పి యొప్పించి మాయజూదమున నాపందెమును దాను గెలుచుకొని పాండవుల నేవురను భార్యాసహితంబుగాఁ బురంబు వెడల నడిచెను. అమాయికు లగునప్పాండవులును బలుబాములను లోనయి దైవసాహాయ్యమునఁ దత్సమయంబును నిర్వహించి మరల వచ్చిరి.

ప్రథమాంకములోఁ “కౌరవులు స్వస్థు లయ్యెదు” మని సూత్రధారుఁడు పలికినప్పుడును, “అన్నయ్యా! మీరీలాగునఁ దీండ్రపడుచుండిన మనయన్నగారు ఖేదపడుదురు గదా!” యని సహదేవుఁడు తన్ననునయించునప్పుడును, వరుసగా భీమసేనుఁడు చదివెడునీక్రింది రెండుపద్యములవలనను బూర్వోక్త మగు దుర్యోధన దౌర్జన్య మంతయు వెల్లడి యగును.

చ. ఖలు లయి నాఁడు లక్కయిలు గాల్చి విషాన్నము పెట్టి జూదపుం
గొలువు ప్రవేశపెట్టి మముఁ గ్రూరత జీవధనంబులందుఁ బే
దల నొనరించి చాల కడి ద్రౌపదిఁ గొప్పును బట్టి యీడ్చి చీ
రలు సభ నొల్చినట్టిధృతరాష్ట్రజు లేఁ గలుగంగ స్వస్థులే? ౮.

చ. అలసభ నట్టు లైనద్రుపదాత్మజఁ గాంచి యరణ్యమందు వ
ల్కలధరు లౌకిరాతులబలంగముతోఁ జిరకాల ముండి యు
వ్వల నతిహీనతన్ విరటుపాల వసించియు నేఁ గృశింపఁగాఁ
గలుగను ఖేద మాయనకుఁ గౌరవు లన్నను గల్గు నిప్పుడున్. ౧౧.

ద్రౌపదిని దుశ్శాసనుఁడు సభ కీడ్చుకొని వచ్చినప్పు డామె కొప్పంతయు విడిపోయి నందునఁ ద న్నట్టు లవమానపఱిచినఖలులు గడ తేఱువఱకును

దాను మరలఁ గొప్పు వెట్టుకో నని యామానిని ప్రతిజ్ఞ పట్టెను. సభలోఁ దన కన్నులయెదుర ద్రౌపదికి మానభంగము గావించిన దుశ్శాసనుని వానిబంధువులు చూచుచుండ గుండెలు వ్రీల్చి నెత్తురు ద్రావెద ననియు, నాసమయమున విలాసముగాఁ గరతలంబున నూరువు సఱచుకొనుచు నాయవమానమునను సంతసించిన సుయోధనునిఁ దనగద చే నూరువుల విఱుగఁ గొట్టి గిట్టించెద ననియు మఱియుఁ దులువ లగు సుయోధనసోదరుల నెల్ల యుద్ధములోఁ దా నొక్క-రుండ సంహరించెదననియు నప్పటికోపావేశంబున భీమసేనుండు ప్రతిజ్ఞ చేసెను.

ఈసంగతి యిట్లుండఁగా నట్లుపదుమూఁడేఁడులును సమయపరిపాలనము చేసి వచ్చినయుధిష్ఠిరుండు గ్రాసవాసోదైన్యంబు రాకుండునట్లు తమసోదరు లేవురకు నేనూళు లిమ్మని శ్రీకృష్ణునిచే దుర్యోధను నడిగించెను. కాని యీసంధి మాట భీమసేనునికిఁ గేవల మనసమ్మతము. ఈక్రింది భీమునిపద్యమువలన నయ్యంశము స్పష్టపడుచున్నది.

ఉ. తల్లడ మందఁ గౌరవశతంబును బట్టి యనిన్ మథింపనా?
ప్రల్లదు దుస్ససేనురుధిరంబు నురంబును వ్రచ్చి త్రావనా?
పెల్లు మనన్ సుయోధనుని పెందొడలుం గద నుగ్గు సేయనా?
యూళ్ళయిదింటితో నృపతి యొప్పుగఁ జేసెడుగాక సంధులన్. ౧౫.

కృష్ణునిరాయబారము జరుగుదినములలో నొకనాఁడు దుర్యోధనపత్ని యయినభానుమతి ద్రౌపదిని జూచి యోసీ! నీమగ లయిదుగురు నయిదూళ్ళు తమ కిమ్మని మమ్మడుగుకొనుచున్నారు. నీ వీపాటికిఁ గొప్పు వెట్టుకో వచ్చు నని మహాగర్వమున నుల్లస మాడెను. ఆమాట తనకు హృదయశల్య మయి బాధించినందున దుఃఖించుచుఁ బాంచాలి భీమసేనున కాసంగతి నెఱింగించిన నతండు మండిపడి నీవు సంధి యగు నని బెంగవెట్టుకోకుము. సుయోధనుని వధించి వానిరక్తమునఁ దడిసినచేతులతో నీకురులు ముడిచి కొప్పువెట్టెద నని ప్రతిజ్ఞాపూర్వకముగ ద్రౌపది నాశ్వాసించెను. దానం జేసియే దీనికి వేణీసంహార మని పేరు గలిగినది. ఈపేరికి జడ ముడుచుట యని యర్థము. అట్లు ద్రౌపది నాశ్వాసించినభీమసేనుండు, తనప్రతినకుఁ దోడు కృష్ణుండు సుయోధనునిచేఁ దిరస్కృతుం డయి చక్కవచ్చె నని తెలియవచ్చినంతన, బుజాలు మూఁడుగాఁ బొంగి సంగరరంగంబునకుఁ బోవ ద్రోవదిని వీడుకొనియెను.

ఇట్లు పాండవులు యుద్ధసన్నద్ధు లయినట్లు మొదటియంకములోఁ దెలిపి రెండవయంకమున ముఖ్యముగా దుర్యోధనపరాజయసూచకము లగుదుర్నిమిత్తములను గవి వర్ణించినాఁడు. ఆదుర్నిమిత్తములలో మొట్టమొదటిది భానుమతిస్వప్నము. నూఱుపాముల నొకముంగిస సంహరించినట్లు కలలో నామె చూచినందున భీముని ప్రతిజ్ఞ స్మరణకు వచ్చి యక్కీడు పరిహరించుకొనుటకు నుదయకాలమున భానుమతి భాస్కరాదిదేవతల నారాధించుచుండ దుర్యోధనుండు కామాతురుం డయి వచ్చి బలవంతముగా నామెనియమమునకు భంగము గలిగించినాఁడు. ఈపట్టునఁ బరిహాసాస్పదము లగుసుయోధనునయోగ్యగుణములు గూడఁ దేటపడి వాఁ డికరాజ్యలక్ష్మీకటాక్షవీక్షణమునకు లేశమును బాత్రుఁడు కాఁ డనునంశము దృఢపఱుచును. అనంతర మొకమహావాయువు వీచినందున దానిబాధకుఁ దప్పుకొన దుర్యోధనుఁడు భార్యాసహితముగా నొక దారుపర్వతప్రాసాదము నారోహించి యక్కడ ననాస్తరణ మైనకటికఱాతి నేలను గూరుచుండఁ బోవుభానుమతితో మహానురాగమున నిట్లు పలికెను.

తే. జిలుఁగుఁబుట్టంబు గాలికిఁ జెదర నాకుఁ।గనులపండువు సేయు నీఘనజఘనము*
వలవ దేగారవింపనావలువ యెగయ।సుదతి! నీచూపుఁదనుపునాయూరుయుగము§?

అనుచున్నప్పు డాకస్మికముగా నొకకంచుకి వచ్చి పైమాటతోఁ గలిసిపోవునట్లుగా—దేవా! భగ్న మైనది. భగ్న మైనది యని వచియించెను. ఆకంచుకి యప్పుడు వీచిన పెనుగాలిచే రథధ్వజము భగ్న మైన దని సుయోధనుతోఁ జెప్ప వచ్చినవాఁడు. అయినను నీవాక్యసందర్భమున నూరుయుగము భగ్న మయినది యను నొకయమంగళార్థము శ్రోతలకు స్ఫురించుచున్నది. మేలుగాని కీడుగాని రాఁబోవునప్పుడు మానవులకు దైవికముగా నిన్ని విధములఁ దత్తత్సూచన మగు ననుటయే యిందలియాశయము. అట్లుతఁడు దారుపర్వతప్రాసాదమున నుండఁగా దుస్సలయును దానియత్తయును రోదనము సేయుచు వచ్చి కురునాథా! రక్షింపుము రక్షింపు మని వానికాళ్ళమీఁదఁ బడిరి. తాను దగ్గఱ లేనప్పుడు తన పుత్రుఁ డభిమన్యుఁడు ద్రోణాచార్యులు పన్నిన పద్మవ్యూహములో సాహసంబునం బ్రవేశింప వానికి సహాయులుగాఁ బోయెడుభీమాదుల సేనాముఖంబున నాఁగి తన్మూలముగా నాతనిమృతికి హేతు వైన సైంధవుని నెల్లి ప్రొద్దు గ్రుంకకమున్న సంహరించెద నని నాఁటిరేయి యర్జునుఁడు పట్టిన బెట్టిదపుఁ బ్రతినవలన వారి కట్టియార్తి పుట్టినది. ఈసింధురాజు దుస్సలకుఁ బెనిమిటి కాఁబట్టి సోదరీమాంగల్యసంరక్షణార్థము భానుమతిని వీడుకొని సుయోధనుఁ డాయోధనంబునకుఁ బోయెను. ఇంతటితో ద్వితీయాంకము ముగిసెను.

---

* ఇది కర్తృపదము. § ఇది కర్మపదము.

మూఁడవది యశ్వత్థామాంకము. ఇందు ముందుగాఁ బ్రవేశించెడు శాకునదంపతులసంభాషణమువలన యుద్ధములో నంతకుముందు చనిపోయిన రాజులపేరులును రణరంగముబీభత్సస్థితియును దెలియవచ్చును. తరువాత సేనలోఁ బొడమినమహాకలకలమునకుఁ గారణ మారయుచు నశ్వత్థామ యీయాహవమునఁ బ్రవేశించును, అతనితండ్రియు నప్పటికౌరవసేనానియు నగుద్రోణుం డశ్వత్థామ చచ్చె నేనుఁ గని కారణాంతరమున యుధిష్ఠిరుఁడు పలికినమాటలో నేనుఁ గన్నది వినక శేషవాక్యశ్రవణమువలనఁ దనకుమారుఁడు చచ్చె నని భావించి పుత్రవాత్సల్యమున నస్త్రపరిత్యాగముఁ జేసి ప్రాయోపవేశమున దేహంబుఁ జాలించువాఁడై యుండఁ బాండవసేనాధిపతి యగుధృష్టద్యుమ్నుండు జుట్టుఁ బట్టుకొని యవమానకరముగాఁ దదీయకంఠనాళలుంటనంబు గావించెను. ముందు నుడివినసేనాక్షోభమున కిదియె కారణము. ఈసమాచార మామూలాగ్రముగాఁ దనతండ్రిగారిసూతునివలనను దనమేనమామ యగుకృపాచార్యులవలనను గ్రమక్రమముగాఁ దెలిసికొని బహువిధముల విలపించి యనేకము లగు ప్రతాపోక్తులు పలికి, తుదకు మాతులప్రార్థనంబున, సేనాధిపత్యమును బొంది పగదీర్చుకొందు నని, కృపసహితముగా దుర్యోధను సన్నిధికి బయలుదేఱెను. అప్పు డారాజుతోఁ బ్రియమిత్రుఁ డగు కర్ణుఁడు లేనిపోనిమాటలు కల్పించి చెప్పి యాతనిమదిలోని ద్రోణపక్షపాతమును బోఁగొట్టుచుండెను. ఈ సమయములో నశ్వత్థామయుఁ గలసికొని యప్పుడు పొసంగినప్రసంగమును బట్టి రాధేయునితోఁ దనకు మహాకలహము సంభవించినందున వాఁడు చచ్చువఱకును యుద్ధము చేయకుండునట్లు శపథముచేసి యతఁ డస్త్రంబును బరిత్యజించెను. ఇట్లస్త్రపరిత్యాగము భీష్మునిమీఁదికోపమునఁ గర్ణుఁడు గావించినట్లు మహాభారతమున నున్నది. కౌరవయోధుల నైకమత్యాభావము సూచించుట ముఖ్యోద్దేశముగాఁ బ్రస్తుతకథకు సందర్భపడఁ గవి దాని నిట్లు మార్చినాఁడు. మొదటియంకములోని భానుమతీపరిహాసోక్తియు రెండవయంకములోని భానుమతీస్వప్నదర్శనాది వృత్తాంతంబును గేవలము కవికల్పితములు. మూలగ్రంథమున లేకపోయినను రసపుష్టిని గలిగించుటకు నాటకమున నిట్టికల్పనలు సేయఁ గవులకు నిరంకుశాధికారము గలదు. అనంతరము దుశ్శాసనుఁడు తన చేతికి దొరకెనని వృకోదరుఁ డఱమఁగా సోదరప్రాణరక్షణపరాయణత్వంబున మిత్రసహితుఁ డయి సుయోధనుఁ డనికిఁ బోయెను. ఈయంకము మిక్కిలి రసవంతము.

నాలవయంకములో—భీమునికి సాయము సేయ వచ్చి సవ్యసాచి యేసిన సాయకంబులు నాటి తేరిమీఁద మూర్ఛపోయినతన్నుం బాలికలనికిఁ దోలఁ

గించి యాదురవస్థం దలంచి శోకించుచు సూతుండు గావించిన శీతలోపచారంబులచేఁ దెప్పిఱిలి దుశ్శాసనమరణంబు విని విలపించెడుతనకడకు యుద్ధములోనుండి కర్ణసేవకుండు వచ్చి వానిప్రభుపుత్రుఁ డగువృషసేనునిమరణప్రకారం బభివర్ణింప నందుకుఁ బరిదేవనంబు చేసి, యాసేవకుఁ డిచ్చిన కర్ణునిజాబుఁ జదువుకొని మరలఁ గర్ణునకుఁ దాను జెప్పవలసినమాటలు వానికిం జెప్పి పుచ్చి నిరుత్సాహుఁ డయి కుందుచున్నతన్నుఁ బరామర్శింపఁ దనతల్లిదండ్రులు యుద్ధభూమికి రాఁగా వారిని గారవింప రారాజు వోయె ననుకథ చెప్పంబడియె. దుర్యోధనుఁడు జీవించి యుండఁగా గాంధారీధృతరాష్ట్రులు యుద్ధభూమికి వచ్చినట్లు భారతమునఁ గనఁబడదు. తదనంతరము వచ్చినట్లు స్త్రీపర్వములో నున్నది. ద్రోణపర్వములో నభిమన్యునిపరాక్రమము వర్ణింపఁబడినట్లు లిందువృషసేనుని పరాక్రమము వర్ణింపఁబడినది.

పంచమాంకములో—గాంధారీధృతరాష్ట్రులు యుద్ధము మాను మని సుయోధనుని బతిమాలుటయు, నతఁ డందున కంగీకరింపమియుఁ, గర్ణునిమరణంబు విని సుయోధనుఁడు విలపించుటయు, నట్టిదురవస్థలో భీముఁ డుల్లసమాడుచు నర్జునసహితుఁ డయి యతనిఁ జూడ వచ్చుటయు, నచ్చో వారికి నతనికి వాక్కలహము సంభవించుటయు, నందుమీఁద మహాకోపమున నెల్లి తప్పక సుయోధనుఁ జంపుదు నని భీముండు ప్రతిన నట్టుటయు, నాసమయమున నస్త్రధరుఁ డయి సుయోధనుకడకు నశ్వత్థామ వచ్చుటయుఁ, గర్ణపక్షపాతిమానసంబున సుయోధనుఁ డతనిసాహాయ్యము నిరాకరించుటయు, ధృతరాష్ట్రుం డందుకు దుఃఖపడి కొడుకుం గినిసి యశ్వత్థామం బ్రార్థింప సంజయుం బుచ్చి తాను దుర్యోధనునకు మాయోపాయ ముపదేశించి పోవుటయుఁ జెప్పంబడియె. దుర్యోధనుఁడు స్వబుద్ధినే ద్వైపాయనహ్రదమునఁ బ్రవేశించినట్లు భారతమున నున్నది. ధృతరాష్ట్రుని కౌటిల్యమును వెల్లడించుటకు నీకవి యిట్లు మార్చినాఁడు.

ఆఱవయంకములో—దుర్యోధనుని వెదకుటకయి ధర్మరాజు తనపరిజనమున కాజ్ఞాపించుటయుఁ, గృష్ణప్రేషితుం డయి యుద్ధములోనుండి వచ్చి పాంచాలకుం డనువాఁడు, సుయోధనుఁ డగపడి భీమునితో గదాయుద్ధముఁ జేయుచున్నాఁ డని యెఱింగించుటయు, భీముఁడే యోడు నేమో యని విచారించుచున్నద్రౌపదీయుధిష్ఠిరులకడకు దుర్యోధనమిత్రుఁ డగుచార్వాకుఁ డనురక్కసుఁడు మునివేషమున వచ్చి భీమార్జునులు దుర్యోధనునిచేఁ జచ్చి రని యచ్చోఁ జెప్పుటయుఁ, నందుకుఁ బనవి పనవి యాదంపతు లగ్నిప్రవేశము సేయఁ దలఁచి

తోమపరిజనులకుఁ జెప్పవలసినమాటలు చెప్పి పుచ్చి భీమాదుల కుదకదానంబు సేయుటయు, నంతలో సుయోధను వధించి తద్రక్తసిక్తము లయినహస్తములతో వృకోదరుండు ద్రౌపదికి జడ ముడువ వచ్చుటయు, సుయోధనుఁ డను భ్రాంతిచేత ధర్మరాజు వానిని సత్తువకొలఁదిఁ బట్టుకొని బగ్గున మండుచున్నయగ్నిహోత్రములోఁ బడవేయఁ జూచుటయుఁ, దద్భ్రాంతిం దెలిసికొని భీముఁ డాతనికిఁ దన్నెఱింగించుకొనుటయు, ద్రౌపదీవేణీసంహారమహోత్సవంబుతో ధర్మరాజునకుఁ బట్టాభిషేకంబు జరుగుటయుఁ దెలుపఁబడియె. పైని జెప్పఁబడినచార్వాకుఁడు యుధిష్ఠిరపట్టాభిషేకసమయమున విప్రవేషముతో బ్రాహ్మణమధ్యమునఁ జేరి కొన్ని కాఱు లఱచి యచ్చోఁ జంపఁబడినట్లు శాంతిపర్వమునం దున్నది. దానినే రసపుష్టికయి కవి యిట్లు మార్చినాఁడు.

ఇష్టప్రకారము కథ మార్చుటకుఁ దనకు స్వాతంత్ర్యము గలిగియున్నను పాత్రములస్వభావమునకు భిన్నముగా మాత్ర మీకవి యెక్కడను వాక్యరచన చేయలేదు. అది దీనికి మిక్కిలి వన్నె దెచ్చుచున్నది. ఈనాటకమును గడు పురాతనముగాఁ జెప్పుదురు గాని కాలనిర్ణయమున కయినను స్థలనిర్ణయమున కయినను నాధార మేమియు దొరకలేదు. ఆ ౧౮౮౭వ సంవత్సరములో నీనాటకము తెలిఁగించి ౧౮౮౯వ సంవత్సరమున మొదటిపర్యాయము ముద్రింపించినాఁడను. పలుకారణములచే నక్కడక్కడ నున్న స్ఖాలిత్యములు మెండుగ నగపడినందున రెండవకూర్పులో శక్తికొలఁది వానిని సవరించినాఁడను. ప్రప్రథమమున నీనాటకము గోదావరీమండలములోని ద్రాక్షారామమునకు సమీపమున నున్న వేగాయమ్మపేట యను మాపూర్వనివాసగ్రామమున శ్రీవాడ్రేవు రంగనాయకాంబారాజ్ఞిగారిమందిరమునఁ బ్రయుక్తం బయినది. అప్పుడు తత్ప్రయోగమున కానందించినసాహితీచక్రవర్తులు మద్గురువరులు భాగవతి వాసుదేవదీక్షితులుగా రాంధ్రగీర్వాణముల నొసంగిన యభిప్రాయమును మాత్ర మిట వ్రాసి యీయంశమును ముగించుచున్నాను.

తే.గీ. క్షీరపారాశి వేణీసంహారనాట
కంబు, మందరాహార్యము కలిత సుబ్బ
రాయ ధైర్యము, సుధ తదర్థంబు, విష్ణుఁ
డీనృసింహారావు, విబుధు లిచటిజనులు.

శ్లో. వడ్డాదిసుబ్బరాయగ్రథితం నాటకవిచిత్రమాల్య మిదమ్
తర్పయతి రసలహర్యా సభ్యమనశ్చంచరీకనికురుంబమ్.

౧వ ఆగష్టు ౧౮౯౯వ సం.
రాజమహేంద్రవరము.

వడ్డాది- సుబ్బారాయఁడు.

ఈనాటకమునందు వచ్చుపాత్రములు.

పురుషులు.

భీముఁడు—కథానాయకుఁడు. పాండవులలో రెండవవాఁడు.
సహదేవుఁడు—భీమునికనిష్ఠసోదరుఁడు.
వినయంధరుఁడు—దుర్యోధనునికంచుకి.—మైత్రేయుఁడు—పాండవులకంచుకి.
దుర్యోధనుఁడు—పాండవులకు ముఖ్యశత్రువు. మఱియు వారి పెత్తండ్రికొడుకు.
రుధిరప్రియుఁడు—యుద్ధభూమియందు నాహారముకొఱకు దిరుగులాడు నొక రాక్ష
అశ్వత్థామ— దుర్యోధనునిపక్షమువాఁడు, ద్రోణునికొడుకు. [సుఁడు.
అశ్వసేనుఁడు—ద్రోణునిసారథి.
కృపుఁడు—దుర్యోధనునిపక్షమువాఁడు, అశ్వత్థామకు మేనమామ.
కర్ణుఁడు—దుర్యోధనునిప్రాణస్నేహితుఁడు.
సుందరకుఁడు—యుద్ధరంగములోనుండి దుర్యోధనునకు జాబు తెచ్చిన కర్ణ
ధృతరాష్ట్రుఁడు—దుర్యోధనునితండ్రి. జాత్యంధుఁడు. [సేవకుఁడు.
సంజయుఁడు—ధృతరాష్ట్రునిసూతుఁడు.
అర్జునుఁడు—భీమునితరువాతివాఁడు.
ధర్మరాజు—పాండవాగ్రజుఁడు.
బుధకుఁడు—ధర్మరాజుపరిచారకుఁడు. [బడ్డవాఁడు.
పాంచాలకుఁడు—యుద్ధరంగమునుండి ధర్మరాజునొద్దకుఁ గృష్ణునిచేఁ బంపఁ
జయంధరుఁడు—ధర్మరాజుకంచుకి. [దుర్యోధనుని స్నేహితుఁడు.
చార్వాకుఁడు—మునివేషముతో ధర్మరాజును వంచింప వచ్చిన రాక్షసుఁడు.
కృష్ణుఁడు—మనుష్యావతార మెత్తిన విష్ణుఁడు. పాండవులకు మేనబావ.

స్త్రీలు.

ద్రౌపది—పాండవులభార్య—బుద్ధిమతిక—ద్రౌపదిపరిచారిక.
భానుమతి—దుర్యోధనునిభార్య.—సువదన—భానుమతిచెలికత్తె.
తరళిక—భానుమతిపరిచారిక.
ప్రతీహారి—దుర్యోధనుని యంతఃపురపరిచారకురాలు.
దుస్సల—దుర్యోధనుని చెల్లెలు సైంధవునిభార్య.
జయద్రథమాత—దుస్సలయత్తగారు.
రుధిరప్రియ—రుధిరప్రియుని పెండ్లము, రాక్షసి.
గాంధారి—ధృతరాష్ట్రునిభార్య, భర్త యంధుఁడని కన్నులకు గంతలు కట్టు
కొన్నపతివ్రత.

శ్రీరస్తు.

శ్రీపరమాత్మనేనమః.

వేణీసంహారనాటకము.

ప్రథమాంకము.

నాంది.

చ. పాఱిఁబాఱిఁ దోలినన్ మధుపముల్ విరిదేనెగలంప, లో సుధా
కరకరలిప్త మైనటులు గాంచఁగనై వికసించి మించునీ
హరిచరణప్రకీర్ణకుసుమాంజలి సభ్యులకు న్విలోకనం
బర మగుకావ్యసిద్ధిని నొసర్చుచుఁగావుత మాకు నిర్వృతిన్. ౧.

శా. కాళిందీపులినంబునందుఁ బాలయల్కన్ రాసము న్మాని, రా
ధాలోలాక్షి సబాష్ప యై మరలఁ దత్పాదాంకముల్ మెట్టుచుం
బాళిన్ మైగరుపాఱ వెంటఁ జని, తద్భామాప్రసన్నావలో
కాళిన్ ధన్యత గన్నకంసరిపునారాగ్పుల్ మిముం బ్రోచుతన్. ౨.

మ. ఇది యే మంచు భవాని ప్రేమను, భయోద్వృత్తి న్నిశాటాంగనల్,
త్రిదశుల్ మోదమునం, దపోధనులు జాలిన్, సవ్వన న్వెన్నుఁడు
న్సదలీలం దనుజుల్ గనన్, మయపురోద్యద్దాహవేళం జయా
స్పదమ స్త్రింబఱవ్రాయుఘూర్జటి యజస్రంబున్ మిముం బ్రోచుతన్. 3.

(నాంద్యంతమున)

సూత్రధారుఁడు — అతివిస్తరమెందుకు?

తే. గీ. వీనుఁజేరల జుఱ్ఱంగ విబుధు లెల్ల
భారతం బనుసమ్మృత మెవ్వాఁడు చేసె
రాగకృష్ణవిహీనుఁ డేయోగివర్యుఁ
డట్టిసాత్యవతేయు నాయాత్మఁ దలఁతు. ౪.

పూజ్యు లయినయోసభాగ్రేసరులారా! మీయందఱితో నే నొకవిజ్ఞాపనము చేసికొనుచున్నాను.

క. మరలను నొకపుష్పాంజలి
వరుసను నెరపెదము కావ్యబంధము నిచటన్
సరసాళులు మధువునుబలె
విరళపు గుణలేశములను వెదకి కొనుండీ. ౫.

అది పూర్వము గీర్వాణభాషయందు మృగరాజలక్ష్మఁ డగుభట్టనారాయణకవిచే విరచితం బయి, యిప్పు డభినవముగా నడ్డాడ సుబ్బరాయకవిచే నాంధ్రీకృతం బయిన వేణీసంహార మను నాటకము; దాని నిప్పు డిచ్చో నుపయోగింప నుద్యోగించుచున్నాము; కావునం గవిపరిశ్రమానురోధమున నయినను, నుదాత్తకథావస్తుగౌరవమున నయినను, నవనాటక కుతూహలమున నయినను మీరు సావధానముగా దీని నవధరింపవలయును. (తెరలో) అయ్యా! త్వరపడు, త్వరపడు. మహానుభావు లయిన పారాశర్యనారదతుంబురు జామదగ్న్యప్రముఖు లయినమునిబృందారకులతో, భరతకులహితకాంక్షను స్వయముగా దూతకృత్యమును నడుపందలంచి, భగవంతుండును జక్రాయుధుండును నగు దేవకీనందనుండు దుర్యోధనమహారాజశిబిరమునం బ్రవేశించు నవసరము గదా! కావున నిప్పుడు వాద్యములను మేళము చేయుం డని విద్వాంసులయనుమతి నీపురుషులు నాటకులలోం జెప్పుచున్నారు.

సూత్ర—(సంతోషముతో) ఓహోహో! జగదుత్పత్తిస్థితినిరోధప్రభవిష్ణుం డయినవిష్ణుండు కురుపాండవరాజపుత్రుల మహాహవప్రశయానలంబును జల్లార్పం దలంచి సంధి చేయుటకు స్వయముగా దూత యగుటచేత నీభరతకులంబును, సమస్తరాజలోకంబును గూడ నమ్మహాత్ముచేత ననుగ్రహింపంబడినది గదా! కావునం బారిపార్శ్వకా! కుశీలవులతో సంగీతము నారంభింపకున్నా వేమి?

(పారిపార్శ్వకుండు ప్రవేశించుచున్నాడు.)

పారి—అలాగే యారంభించెదను గాని యేఋతువు నాశ్రయించి?

సూత్ర—ఓయీ! చంద్రాతపనక్షత్రక్రౌంచహంసకులప్రచ్ఛాదకుముదపుండరీకకాశకుసుమపరాగధవళితగగనదిఙ్మండలంబును, స్వాదుజలజలాశయంబును నగునీశరత్సమయమునే యాశ్రయించి గానము సేయుము. చూడుము. ఈశరదృతువునందు.

తే. గీ. చారువచము ప్రసాధితాశము, మదోద్ధ
తప్రయత్నము, విపులసత్త్వమైన

ధార్తరాష్ట్రశతంబు భూతలమునందు
వ్రాలెడును ఛత్రముగఁ గాలవశముచేత. ౫.

పారి—(త్రొట్రుపాటుతో) హరిహరీ! ఎంతమాటవింటిని?

సూత్ర—(తెల తెలఁబోయినవ్వి) మారిషా! నేను శరత్సమయమును వర్ణించుచుండఁగా నీవు ‘‘హరిహరి’’ యనియెద వేమి?

పారి—అవునదినిజమే. ధార్తరాష్ట్రశత మనఁగా హంసలగుంపని మీ యభిప్రాయము; అయినను దద్వచనమందలియమంగళశంసనమున నాహృదయము చెదరిపోయినది.

సూత్ర—మారిషా! ఇంక నిశ్చయముగా నన్నియమంగళములును గొట్టఁబడి పోవును. కంససంహారుఁ డగు శ్రీకృష్ణుండు తానుగ దూతయయి సంధి సేయం జూచుచున్నాఁడుగదా! ఆహేతువుచేత.

తే. గీ. పగఱ సాధించి నిర్వాణవైరదహను
లయి సుఖించుతఁ బాండవుల్ హరిని గూడి
స్వస్థు లయ్యెడు రక్తప్రసాధితోర్వు
లగుచుఁ గౌరవుల్ క్షతవిగ్రహతను జెంది. ౬.

(తెరలోపలఁ దిరస్కారముగా) ఆ! దురాత్మ! వృథామంగళపాఠక! శైలూషాధమ!

చ. ఖలు లయి నాఁడు లక్కయిలు గాల్చి విషాన్నము వెట్టి, జూదపుం
గొలువు ప్రవేశపెట్టి, మముఁ గ్రూరత జీవధనంబులందుఁ బే
దల నొనరించి చాల కది ద్రౌపదిఁ గొప్పను బట్టి యీడ్చి చీ
రల సభ నొల్చి నట్టి ధృతరాష్ట్రజు లేఁ గలుగంగ స్వస్థులే? ౭.

సూత్ర—(ఆలకించి భయముతోఁ దెరవంకఁ జూచుచున్నాఁడు)

పారి—ఆ! ఇదియేమి?

సూత్ర—(వెనుకఁజూచి) అహాహా! కృష్ణుఁడు కౌరవులతో సంధిసేయఁ బోవుట కిష్టపడక, భీమసేనుఁడు సటలతటఘటితకుటిలభ్రుకుటి యయి మనల నందఱఁ జూచునంతన మ్రింగివేయునట్లు మహాకోపముతో సహదేవానుగమ్యమానుండయి యిదిగో! నీలాగువచ్చుచున్నాఁడు; కావున నతనియెదుర మనము నిలువరాదు. వేగముగా వేఱొకచోటికిఁ బోవుదము రా.

(నిష్క్రమించుచున్నారు) ప్రస్తావన.

(తర్వాతఁ గుపితుఁడైన భీమసేనుఁడు సహదేవునితోఁ బ్రవేశించుచున్నాఁడు)

భీమ—ఆ! పాప! దురాత్మ! వృథామంగళపాఠక! శైలూషాధమ!

చ. ఖలులయి నాఁడు లక్కయిలు" అనుమునుపటిపద్యమును మరలఁ జదువుచున్నాఁడు.

సహ—అన్నయ్యా! శాంతింపుఁడు. శాంతింపుఁడు. ఈ భరతపుత్రుల వచనము మనకు సమ్మతమే. చూడుఁడు.

తే. గీ. పగఱ సాధించి నిర్వాణవైరదహను

లయి సుఖించుతఁ బాండవుల్ హరినిగూడి

అనువాక్యము మీాకిష్టమేగదా!

స్వస్థులయ్యెడు రక్తప్రసాధితోర్వ్యు

లగుచుఁ గౌరవుల్ క్షతవిగ్రహతను జెంది. ౯.

అను నీవాక్యమును మన కనుకూలముగానే యున్నది. చిత్తగింపుఁడు. క్షతవిగ్రహతను=కొట్టఁబడిన దేహములు గలుగుటను; జెంది=పొంది, రక్తప్రసాధితోర్వ్యులగుచున్=రక్త=నెత్తుటిచేత; ప్రసాధిత=అలంకరింపఁబడిన; ఉర్వ్యా=భూమిగలవారు; అగుచు; కౌరవులు; స్వస్థులు=(స్వర్ స్థ)స్వర్గస్థులు; అయ్యెదున్=అగుదురుగాక; అనియర్థమిచ్చుచున్నది.

భీము—(నిందాగర్భముగా) వద్దువద్దు. మీారు కౌరవుల కమంగళములను దలంపఁగూడదు. వారు మీాకు సోదరులు గావున సంధిసేయం దగినవారు.

సహ—(రోషముతో) అయ్యా!

క. పలుమాఱు ఱెగ్గులు సేసిన

యలధృతరాష్ట్రజులయందు నలుగక యుండం

గలఁడెవఁడు నీదుతమ్ముఁడు

వల దని మనరాజుగారు వారింపనిచోన్. ౧౦.

భీము—(రోషముతో) ఔనోయి! యదినిజమే. అందుచేతనె యింతట నుండి నేను మీాయందఱినుండి వే ఱయ్యెదను. వినుము.

ఉ. సింధురసింహసామ్యులకు చిన్నటనుండియు వారు నేను; మా

బంధురవైరకారణులు భర్తయుఁ బార్థుఁడు మీారునా? జరా

సంధునురంబువ్రోలెఁ గురుసంధి ఘటిల్లిన వెండి, సద్భుజా

గంధుఁడు భీమసేనుఁడు పెకల్చును, గూర్చుఁడు మీారలందఱున్. ౧౧.

సహ—(అనునయముతో) అన్నయ్యా! మీ రీలాగునఁ దీండ్రపడుచుండిన మనయన్నగారు ఖేదపడుదురు గదా!

భీము—(నవ్వుచు) ఏమిది? నావిషయమయి యన్నగారు ఖేదపడుదురా! ఆయన ఖేదముకూడ నెఱుంగుదురా? చూడు.

చ. అలసభ నట్టులైన ద్రుపదాత్మజఁ గాంచి, యరణ్యమందు వ
ల్కలధరు లౌకిరాతులబలంగముతోఁ జిరకాల ముండి, యు
వ్వాల నతిహీనత న్విరటుపాల వసించియు నేఁ గృశింపఁగాఁ
గలుగదు ఖేద మాయనకుఁ; గౌరవు లన్నను గల్గు నిప్పుడున్. ౧౨.

కావున సహదేవా! నీవు పోయి యతిచిరప్రవర్ధితక్రోధకృశానుం డగు భీమసేనుం డిట్లు పల్కెనని మహారాజుగారితో విన్నవింపుము.

సహ—అన్నయ్యా! ఎట్లు?

భీము—ఇదిగో నిట్లు.

మ. భవదాజ్ఞాపరిలంఘనాంబువుల భూపా! మున్గి యుంటిం గదా
యవనిం బ్రస్తుతి గన్ననీయనుజులం దఖ్యాతిఁ గంటి న్గదా
బవరంబం దిదె కౌరవక్షతజశోభన్ సల్పెదన్ మద్గదో
త్సవమున్; నేఁటికి మీరుగాదు గురువుల్, తమ్ముండఁగా నేనునున్. ౧౩.

(అహంకారముతో నడుచుచున్నాఁడు.)

సహ—(అతని ననుసరించి నడుచుచుఁ దనలో) ఓహో! ఎందుకో గాని యీయన పాంచాలిచతుశ్శాలభవనమునఁ బ్రవేశించుచున్నాఁడు: కానీ నే నిక్కడ నిలిచెదను. (అట్లు చేయుచున్నాఁడు.)

భీము—(మరలి చూచి) సహదేవా! నీవు పోయి యన్నగారి ననుసరించి యుండుము. నే నీయాయుధాగారమునఁ బ్రవేశించి యాయుధసహాయుఁడ నయ్యెదను.

సహ—అన్నయ్యా! ఇది యాయుధాగారము గాదు పాంచాలిచతుశ్శాలభవనము.

భీము—(సవితర్కముగా) ఏమి? ఇది యాయుధాగారముగాదా? పాంచాలిచతుశ్శాలభవనమా? (ఆలోచించి) పాంచాలితో మాటలాడ వలసి యున్నది. (ప్రేమతో సహదేవునిచేయి పట్టుకొని) తమ్ముఁడా! ఇటురమ్ము.

సహ—అన్నయ్యా! ఆజ్ఞాపింపుఁడు.

భీము—తమ్ముఁడా! అన్నగారు కౌరవులతో సంధికి నిచ్చగించి మనల నెట్లు శిక్షించుచున్నారో చూడుము.

(నడచి యిద్దఱును గృహము ప్రవేశించుచున్నారు.)

భీము—(కోపములో వట్టినేలను జతికిలఁబడుచున్నాఁడు.)

సహా—(తొట్రుపాటుతో) అన్నయ్యా! ఇదిగో! నిక్కడ నాసనము వేయఁబడియున్నది. ముహూర్తమాత్ర మిందు విశ్రమించి కృష్ణాగమనముఁ బ్రతీక్షింపుఁడు.

భీము—తమ్ముఁడా! నీవు కృష్ణాగమన మనుటచేతఁ దలఁపువచ్చినది. మహానుభావుఁ డయిన శ్రీకృష్ణుం డేప్రకారము సంధిచేయుటకు సుయోధను నొద్దకుఁ బంపఁబడెను?

సహా—అయిదూళ్లు మన కిచ్చునట్లు.

భీము—(చెవులు మూసికొని) అన్నన్నా! ఎంతకష్టము! అన్నగా రజాత శత్రు లయినను, నీదృశ తేజోహీను లగుటచేత నిజముగా నాహృదయము చలించుచున్నది. తమ్ముఁడా! ఇది నీ వనను లేదు. నేను విననులేదు. (పెడ మొగముపెట్టుకొని)

తే. గీ. ఊర్జితం బగుక్షాత్రంపుటుగ్రతేజ
మీమహారాజునకు నాఁటనే తొలంగె
దాయతోడుత నెపుడు జూదంబు నాఁడెఁ
బాచికలఁ దనచేతను బట్టినాఁడొ. ౧౪.

(తెరలో) దేవి! ఊఱడిల్లు మూఱడిల్లుము. కౌరవులతో నిరతబద్ధవైరుం డగుభీమసేనకుమారుఁడు నీదుఃఖము నపనయింపఁగలఁడు.

సహా—(చెవియొగ్గి తెరవంకఁజూచి తనలో) అయ్యో! ఏమిది? యాజ్ఞసేని కన్నుల బాష్పబిందువులు గ్రమ్ముకొన నన్నగారిసన్నిధి కిటు వచ్చుచున్నది. ఇందువలన నేదో గొప్పయుపద్రవము సంభవించును గదా!

తే. గీ. సంభృతం బయ్యె నీఘనుజృంభణమున
నురుతరేరమ్మనమురీతి నొక్కజ్యోతి;
వర్షఋతువట్లు వచ్చు సంవర్ధనంబు
నేయు నిజముగ నీయాజ్ఞసేని దాని. ౧౫.

(తర్వాత ముందు చెప్పినరీతిని ద్రౌపదియుఁ, జేటియుఁ బ్రవేశించుచున్నారు.)

ద్రౌప — (కన్నీరుజాఱ నిట్టూర్పుపుచ్చుచున్నది.)

చేటి— దేవీ! ఊఱడిల్లు మూఱడిల్లుము. కౌరవులతో నిరతబద్ధవైరుండగు భీమసేనకుమారుండు నీదుఃఖము సహనయింపఁగలఁడు.

ద్రౌప—(నిట్టూర్చి) మహారాజిందుకుఁ బ్రతికూలుఁడు గాకపోయిన, నీవనినలాగున జరుగఁగలదు; నాథునిఁ జూచుటకు నాహృదయము వేగిరపడుచున్నది. చేటి! బుద్ధిమతికా! ప్రాణేశునివాసభవనమునకు నన్నుఁగొనిపొమ్ము.

చేటి—దేవీ! ఇటు, ఇటు, (నడుచుచున్నారు.)

చేటి—దేవీ! ఇదే వాసభవనము. ఇందుఁ బ్రవేశింపుము.

ద్రౌప—చేటీ! నాథునితో నారాక నెఱింగింపవే.

చేటి—చిత్తము. (నడిచిమరలవచ్చి) దేవీ! ఇదిగో యువరాజుగారిక్కడనే కూరుచున్నారు. సన్నిధి కరుగుము.

ద్రౌప—అలాగే చేయుదము. (ఇద్దఱును నడచుచున్నారు.)

చేటి—జయము, జయము కుమారా!

భీము—(వినకయే క్రోధముతో)

"తే. గీ. ఊర్జితంబగుక్షాత్రంపుటుగ్రతేజ।మీమహారాజునకునాఁట నేతొలంగె॥"

అనుపద్యము మరలఁ జదువుచున్నాఁడు.

చేటి—(ద్రౌపదిని జేరి) దేవీ! నీకుఁ బ్రియముఁ జెప్పెదను. అబ్బాయిగారు కోపగించియున్నట్లు లగపడుచున్నారు.

ద్రౌప—చేటీ! ఆలాగయిన నన్నీతిరస్కారమే యూఱడించుచున్నది. కావున నేనిక్కడనే కూరుచుండి ప్రాణేశునిప్రయత్న మేమో తెలిసికొనియెదను. (అట్లుచేయుచున్నారు.)

భీము—(క్రోధముతో సహదేవునుద్దేశించి) ఏమీ! అయిదూళ్లకా సంధి?

ఉ. తల్లడమందఁ గౌరవశతంబును బట్టి యని న్మథింపనా?
ప్రల్లదు దుస్ససేనురుధిరంబు నురంబును వ్రచ్చి ద్రావనా?
పెల్లు మనల్ సుయోధనునిపెందొడలన్ గద నుగ్గు సేయనా?
యూళ్లయిదింటితో నృపతి యొప్పఁగఁ జేసెడుఁగాక సంధులన్. ౧౬.

ద్రౌప—(సంతోషముతో రహస్యముగా) ప్రాణేశ్వరా! ఇట్టిమాట నేనీవఱ కెన్నఁడును వినలేదు, దానిని మరల నింకొక్కమాఱు పఠియింపుము.

భీము—(అది వినకయే) సహదేవా! చూడు,

ఉ. ,, తల్లడమందఁ గౌరవశతంబును " అను పూర్వోక్తపద్యమును మరలఁ జదువుచున్నాఁడు.

సహ—అన్నయ్యా! మహారాజు పంపినసందేశ మంతయవ్యుత్పన్నముగా నున్నట్లు మీ రూహించుచున్నారా?

భీము—కాక మఱి యం దేమి వ్యుత్పత్తి యున్నది?

సహ—మహారాజు పంపినసందేశ మిది.

క. క్రమమున మాకింద్రప్ర
స్థమును వృకప్రస్థమును నొసంగునది జయం
తము వారణావతం బన
నమరెడునాల్గూళ్లు; కడమయది యే దైనన్.

భీము—అందులో నేమి యున్నది?

సహ—ఇట్లు నాలుగూళ్లను మాత్రము పేరుపెట్టికోరి, యయిదవదట్లు వక్కాణింపక పోవుటచేత విషభోజనము, లాక్షాగృహదహనము, ద్యూతసభాప్రవేశము మొదలుగాఁగలయపకారముల నెత్తిపొడుచుటగా మేమూహించుచున్నాము.

భీము—తమ్ముఁడా! ఈలాగయినమాత్ర మేమిలాభము?

సహ—అన్నయ్యా! ఇందువలన మహారాజహృదయము స్వకులక్షయంబునకు జంకుచున్నదనియు, దుర్యోధనుఁడు సంధికి యోగ్యుఁడు కాఁడనియు లోకమునందు వెల్లడి యగును.

భీము—ఇది యంతయు ననర్థమే. మన మందఱు మీలా గడవులపాలయి వచ్చుచుండి, కురుకులక్షయంబు గావింప నెప్పుడు ప్రతిజ్ఞ చేసికొంటిమో యప్పుడే కౌరవులతో సంధి సేయఁ గూడమి వెల్లడి యయినది. మఱియు ధార్తరాష్ట్రులకులము నిర్మూల మగునని యీవఱకే లోకమందుఁ బ్రసిద్ధ మయినది.

సహ—(సిగ్గుపడుచున్నాఁడు.)

భీము—ఏమీ? మీకు సిగ్గగుచున్నదా? అట్లయిన నోరిమూర్ఖా!

తే. గీ. కోపమున శత్రుకోటిని రూపుమాప
లోకములలోన మీకు లజ్జాకరంబు;
కూళ యొక్కఁడు రచ్చలోఁ గొప్పు వట్టి
చేడె నీడ్వంగఁ జూచుట సిగ్గు గాదు. ఆగా.

ద్రౌ—(రహస్యముగా) నాథా! వీరు సిగ్గులేనివారే; నీ వయిన నా పరాభవమును మఱచి పోకుము.

భీము—తమ్ముఁడా! ఏమిది పాంచాలి యాలస్యము చేయుచున్నది? నా హృదయము సంగ్రామావతరణమునకుఁ దత్తఱపడుచున్నదే.

సహ—అన్నయ్యా! ఆమె వచ్చి యెంతసే పయినది? మీరు రోషావేశమునఁ జూడరయితిరి.

భీము—(చూచి యాదరముతో) దేవీ! క్రోధాతిరేకమునఁ జేసి సమక్షమున నున్నను నిన్ను వీక్షింపనయితిని; కోపగించుకోకుము

ద్రౌప—ప్రాణేశ్వరా! మీ రుదాసీను లయి యూరకున్నం గోపము గాని కుపితు లయినం గాదు.

భీము—దేవీ! అటు లయిన నింక నీ పరాభవము పోయిన దని నిశ్చయముగాఁ దలఁచుకొమ్ము.

ద్రౌప—(విచారముతో నిట్టూర్పు పుచ్చుచున్నది.)

భీము—(చేయి పట్టుకొని ప్రక్కను గూరుచుండఁ బెట్టుకొని మోము చూచి) ఏమిది? దేవి యెందుకో విచారగ్రస్తురాలుగా నున్నట్టున్నది.

ద్రౌప—నాథా! మీరు సన్నిహితు లయి యుండఁగా నాకు విచారకారణ మేమి యుండును?

భీము—ఏమిది, తెలుపవు? (తల వెంట్రుకలు చూచి) సరే, తెలుపవలసిన దేమి?

తే. గీ. పాండురాజకుమారులు బ్రతికియుండి
సన్నిధిని బాయకున్నను, సకలసౌఖ్య
భాజనం బగు పాంచాలరాజతనయ
యీదృశావస్థఁ బొందె దీని నేమి చెప్ప? ౧౯.

ద్రౌప—బుద్ధిమతికా! నాథునితో సకలంబును విన్నవింపుము. నా పరాభవమునకు మఱి యెవ్వరు ఖేదపడువారు?

చేటి—చిత్తము. (భీమునితో) కుమార! దేవిగారికి నింతకన్నను నధిక మయిన వేఱొకకోపకారణము గలిగినది.

భీము—ఇంతకన్నను నధిక మయినదా? అ దేమి? చెప్పు చెప్పు.

ఆ. వె. ముక్తవేణి యయియు సముదిత నీక్రమము
ఘాతుకతను బోలెఁ దొడరి యంటి

కౌరవాన్వయంపుఁగారుచిచ్చునకును
శలభ మగుట కెవఁడు సాహసించె.? ౨౦,

చేటి— కుమారా! చిత్తగింపుము- ఇంతకుముందు దేవిగారమ్మగారితోఁ గూడ సుభద్రాప్రముఖసపత్నీవర్గపరివృత యయి పూజ్యురా లగుగాంధారీదేవికిఁ బాదాభివందనము సేయఁ బోయినారు.

భీము—మంచిపని-అట్లు చేయ వలసినదే. గురుజన మభివందనీయము గదా! తరువాత?

చేటి—తరువాత మరలి వచ్చుచుండఁగా భానుమతి యామెను జూచినది.

భీము—(క్రోధముతో) ఆ! శత్రుభార్యకంటను బడెను గదా! ఎంతకష్టము! అట్లయిన దేవికిఁ గ్రోధస్థానమే. తరువాతఁదరువాత?

చేటి—అట్లు దేవిగారిని జూచి భానుమతి తనచెలికత్తెమోముసఁ జూపు నిలిపి గర్వముతో నవ్వి యొకవాక్యము పలికెను.

భీము—ఆహా! కంటఁ బడుటయే కాక మాట కూడఁ బడినది గదా! ఓహో! ఏమిసేయుదుము? చెప్పు చెప్పు. ఏ మని?

చేటి—"ఓసీ! యాజ్ఞసేని! మీ రేమో యయిదూళ్ళను నడుగుకొను చున్నారఁట. ఇది యేమే? ఇంకను నీతలవెండ్రుకల ముడుచుకొన కున్నావు!" అని.

భీము—సహదేవా! వినుచున్నావు గదా!

సహ-అన్నయ్యా! చెప్పెడిదేమి? అది దుర్యోధనునిభార్య గదా! చూడుఁడు.

క. వనితలకును సహవాసం
బున మనములు భర్తృసదృశముల యయ్యెడు; నే
ట్లన మధుర మయ్యు విషకుజ
మున నల్లినవల్లి మూర్ఛవుచ్చుట లేదే? ౨౧.

భీము—బుద్ధిమతికా! అందుకు దేవి యే మన్నది?

చేటి—కుమారా! పరిజనము లేనియెడల దేవిగారు పలుకుదురు.

భీము—అట్లయిన నీ వేమంటివి?

చేటి—"ఓ భానుమతీ! మీతలవెండ్రుకలు విడిపోకుండ మా దేవిగారితల వెండ్రుక లెట్లు ముడివేయఁబడు" నంటిని.

భీము—(సంతోషముతో) బాగు! బుద్ధిమతికా! బాగు! మాపరిజనము నకుఁ దగిన పలుకులు పలికితివి. (ఆభరణములు దానికి బహుమానమిచ్చి వెంటనే

యూసనముసుండి లేచి) ఓ పాంచాలరాజపుత్రీ! విచారింపకుము. పెక్కుమాట లేల? శీఘ్రకాలములోనే నేను జేయునది చెప్పెద వినుము.

చ. బిఱబిఱఁ ద్రిప్పుకొంచు గద, బిట్టు సుయోధనుఁ గిట్టి, పెందొడల్
విఱుగఁగఁ గొట్టి, చేతులను వెచ్చనినెత్తుట నద్ది, నీకురుల్
మెఱుఁ గిడి, భీమసేనుఁ డవలీలను జిక్కెడలించి కూర్చెడుం
గొఱకొఱ యేల? దేవి! యిదిగో! ముద మందెదుచూడు నీమదిన్. ౨౨

ద్రౌప — ప్రాణేశ్వరా! మీకుఁ గోపము వచ్చిన దుష్కరమేమి యున్నది? మీసోదరులు గూడ మీయుద్యమము ననుగ్రహింప వలయును.

సహ — ఇది మాకును ననుమతమే.

(తెరలోపల మహాకలకలము.)

అందఱు — (విస్మయముతో నాలకించుచున్నారు.)

భీము — మ. తతఘూర్ణద్ఘటవార్ధిమధ్యవిలుఠన్మంథాచలధ్వానవ
దతఁ గోణాహతమై జగత్ప్రళయగర్జన్మేఘసంఘట్టచం
డతఁ గృష్ణోగ్రరుషాగ్రదూత కురురాణ్ణాశంకరోత్పాతమై
సతి! మత్సింహరవానుకారి రణనిస్వానం బదే మ్రోఁగెడిన్.

(తొందరగాఁ గంచుకి ప్రవేశించుచున్నాఁడు.)

కంచు — కుమార! ఇదిగో! భగవంతుఁడు కృష్ణుఁడు—

(అందఱును దోసిలి పట్టి నిలుచున్నారు.)

భీము — ఏఁడీ, ఏఁడి! భగవంతుఁడు?

కంచు — పాండవపక్షపాతామర్షంబున సుయోధనునిచేత బద్ధుండు గాఁ బోయెను.

భీము — ఏమీ! బద్ధుఁ డయ్యెనా?

కంచు — లేదు లేదు. తద్విషయకప్రయత్నములు జరిగినవి.

భీము — అప్పుడు స్వామి యేమి చేసెను?

కంచు — పిమ్మట నమ్మహాత్ముం డాత్మీయవిశ్వరూపనిరుపమానదివ్యతేజో దర్శనంబునఁ గురుకులంబును సమ్మూర్ఛితంబు గావించి నిరాకరించి మనశిబిరంబునకుఁ జక్కవచ్చెను. దేవరవారిని శీఘ్రముగాఁ జూడఁగోరుచున్నారు.

భీము — (నవ్వుకొనుచు) ఏమి? దురాత్ముఁడు దుర్యోధనుఁడు భగవంతునే కట్టివేయుటకుఁ దలంచినాఁడు గా! (ఆకాశమువంకఁ జూచి) ఓ! [illegible]

కులపాంసన! ఇట్టు లతిక్రాంతమర్యాదుఁడ వయిన నీనాశనమునకయి పాండవ క్రోధానలంబు నిమిత్తమాత్రమే సుమీ.

సహ—అన్నయ్యా! దురాత్ముఁ డాదుర్యోధనుఁడు వాసుదేవుని భగవంతునిఁగాఁ దద్విశ్వరూపదర్శనమున నయినఁ దెలిసికొన లేఁడు గాఁబోలు?

భీము—తమ్ముఁడా! ఆదురాత్ముఁడు కేవలము మూఢుఁడు గదా! ఆయన నెట్లు తెలిసికోఁజాలును! చూడు.

శా. ధీశక్త్వంబున నిర్వికల్పకసమాధిం జిత్తముల్ నిల్పి దు
ర్వారం బైనతమంబు జ్ఞానమున విధ్వస్తంబు గావించి యా
త్మారాముల్ దిలకించు పెన్వెలుఁగు మోహాంధుండు దుర్యోధనుం
డేరీతిం గని తాఁ బరాత్పరునిఁ గా నెంచంగ శక్తుం డగున్? ౨౮.

భీము-అయ్యా! మైత్రేయ! ఇప్పుడు పెద్దలేమిచేయ నుద్యోగించుచున్నారు?

కంచు—కుమార! మహారాజుగారియుద్యమమును మీరే వచ్చి తెలిసికొన వలయును. (నిష్క్రమించుచున్నాఁడు)

(తెరలోపలఁ గలకలానంతరము) ఓహో! ద్రుపదవిరాటవృష్ణ్యంధకసహదేవప్రభృతిభూతలాధినాథులార! అస్మదక్షౌహిణీపతులార! కౌరవచమూప్రధానయోధులార! మీరందఱు విన వలయును.

మ. మది సత్యవ్రతభంగసాధ్వసమునన్ మందీకృతం బయ్యె నె
య్యది, తాల్మిం గులశాంతి గోరి యొకచాయన్ విస్మృతం బయ్యె నె
య్యది, ద్యూతారణి ద్రౌపదీవసనకేశాకర్షణం బుట్టె నె
య్యది, యాధిష్ఠిర మాక్రుధాగ్ని కురువన్యాసీమ జృంభించెడున్. ౨౯.

భీము—(ఆలకించి సంతోషముతోడను రోషముతోడను) విజృంభించుఁగాక! విజృంభించుఁగాక! ఆర్యక్రోధానలం బప్రతిహతప్రసారం బయ్యెడును.

(మరలఁ దెరలోపలఁ గలకలము.)

ద్రౌప—(విస్మయముతో) నాథా! విలయవలాహకనిర్ఘోషభీషణక్వాణనం బగురణదుందుభి యిప్పు డనుక్షణమును మ్రోయుచున్నది. ఎందుచేత?

భీము—సుందరీ! మఱేమియు లేదు. యజ్ఞము జరుగుచున్నది.

ద్రౌప—(ఆశ్చర్యముతో) హో! అది యేమి యజ్ఞము?

భీము—ప్రాణేశ్వరి! రణయజ్ఞము.

మ. విను ఋత్విక్కుల మేము నల్వురము; నావెన్నుం డుపద్రష్ట; మా
యనుఁడే యాజియు; సోమిదమ్మ వగు దీవే; కౌరవుల్ తత్పశుల్;

వనితాదుఃఖము నీఁగుటె ఫలము గా వెల్గిల్లునయ్యధ్వరం
బునకున్ రాజుల సందఱం బిలువఁగా మ్రోఁగింతు రాదుందుభిన్.

సహ.—అన్నయ్యా! అటు లయిన గురుజనానుజ్ఞ వడసి మనము గూడఁ బరాక్రమానురూపమున నాచరింపఁ బోవుదము.

భీము.—తమ్ముఁడా! ఇదిగో నన్నగారియాజ్ఞప్రకార మాచరించుటకు సిద్ధముగానే యున్నాను. (లేచి) దేవి! మేము కురుకులంబు నున్మూలించుటకుఁ బోయి వత్తుమా?

ద్రౌప.—(కంటఁ దడి వెట్టుకొనుచు) నాథా! అసురసమరాభిముఖుం డగుహరికిఁ బోలె మీకు శుభం బయ్యెడును.

చేటి.—కుమారా! దేవిగా రింకొక్కటి పలుకఁ గోరుచున్నారు. మీరు పెండియు భండనంబునుండి చనుదెంచి తను నూఱడింప వలయు నఁట.

భీము.—దేవీ! ఈకల్లబొల్లూఱడింపులతో నేమి ప్రయోజనము?

తే. గీ. పరిభవక్లాంతిలజ్జావిధురితవదనఁ
గా, ననిశ్శేషితక్రూరకౌరవునిఁగ
నింకను వృకోదరునిఁ జూడ విది నిజంబు
చారుశారదపూర్ణిమాచంద్రవదన. ౨౭.

ద్రౌప.—నాథా! ద్రౌపదీపరాభవప్రోద్దీపితక్రోధానలంబున, నాలంబున ననవేక్షితశరీరు లయి సంచరింపకుఁడు. రిపుబలము లప్రమత్తసంచారము లని వినుచుందుము గదా!

భీము.—ఓసుక్షత్రియురాలా! యుద్ధరంగమున సంచరించుటకు మేము సమర్థులము సుమీ. విను.

స్రగ్ధర. ఒండొంటిన్ వ్రేయ నుగ్గై యొఱఁగుకరులరక్తాఘమేదంపురొంపిన్
మెండౌ తేరుల్ మునుంగన్, మెఱసి పయిపయిన్ మెట్టి మట్టాడ జోదుల్,
మొండెంబుల్ పానగోష్ఠి స్మెరయువతులు లన్మోఁగుతూర్యాళి నాడన్,
జండం బౌభండనాబ్ధిం జడియరు తిరుగన్ శౌండు లౌ పాండుపుత్రుల్.

(అందఱును నిష్క్రమించుచున్నారు.)

గద్య. ఇది శ్రీపరమేశ్వరవరప్రసాదలబ్ధసరసకవితాధురంధర వడ్డాది సాధువంశక్షీర
నీరాకరరాకాసుధాకరాచ్చనామాత్యపౌత్ర హారితసగోత్ర పవిత్రగుణకదంబ
లక్ష్మాంబాగర్భశుక్తిముక్తాఫల సూరపరాజప్రధానతనూభవవిబుధవిధేయ సు
బ్బరాయనామధేయాంధ్రీకృత వేణీసంహారనాటకంబునందుఁ బ్రథమాంకము.

శ్రీరస్తు.

శ్రీపరమాత్మనే నమః.

వేణీసంహార నాటకము.

ద్వితీయాంకము.

(తరువాతఁ గంచుకి ప్రవేశించుచున్నాఁడు)

కంచు — “వినయంధర! భానుమతీదేవి యమ్మగారికిఁ బాదాభివందన మాచరించి వచ్చిన దేమో చూచి రా. నేనామెను సందర్శించి యభిమన్యువధ విధానధౌరేయు లగు రాధేయజయద్రథప్రముఖులను బహూకరించుటకయి సత్వరముగా సమరతలమునకు కరుగవలయు” నని దుర్యోధనమహారాజుగారు నాకాజ్ఞాపించినారు గదా! కావున నే నాలస్యము చేయరాదు. అన్నా! దుర్యోధనమహారాజుగారియాజ్ఞాబలము! ముసలితనముచేత నిల్లు కదలలేక మర్యాదామాత్రమునకు నంతఃపురమున వసించుచున్న నాచేతను గూడఁ బూర్ణముగాఁ బనిసేయించుచున్నది! సరి, నిష్కారణము నాముదిమిని నిందింపనేల? అంతఃపురికులయి విహరించునెల్లవారికిని వేషంబును జేష్టలు నిటువలెనే యుండును గదా! సందేహ మేమి?

మ. కనరా దింతలు కన్నులున్న; వినిసం గారాదు విన్నట్టు; శ
త్రునకైనన్ విధి కట్టఁ జేకొనుట యుద్యోగంబుచే; నెల్లచో
మనమం దెప్పుడు జంకె యాట, నడకల్ మందంబు లౌఁ; గాన నే
వనజీవుం డగునాకు నన్ని మునుపే వచ్చెన్; జరం గల్గెనే? ౧.

(నడచి యాకాశమువంకఁ జూచి) విహంగికా! భానుమతీదేవి యత్తమామలకుఁ బాదవందన మాచరించి వచ్చినదా? (చెవియొగ్గి) ఏ మంటివి? ఇప్పుడే నివర్తిత గురుదేవతాచరణాభివాదన యయి యామె దన పెనిమిటికి జయము గలుగవలెనని నేఁడు మొదలు నియమముతో బాలోద్యానమందలి దేవళమునఁ బ్రవేశించి యున్నదా? సరే, కల్యాణీ! నీవు నీపనిలో నుండుము. నేనును దేవి యిక్కడ నున్నసమాచారము మహారాజునకు నివేదించెదను. (నడచి) మేలు! పతివ్రతా!

మేలు! ఆఁడుదాన వయినను నీవే నయము గాని మహారాజు కాఁడు; ఏమనఁగాఁ బ్రబలులో దుర్బలులో వారు దేవసహాయు లగుపాండవేయు లెత్తి వచ్చుచుండ నిప్పుడు గూడ నీమహారాజుగా రంతఃపురవిహార మనుభవింపఁ గోరుచున్నారు. (ఆలోచించి) ఈయనగారిచేష్ట లేమియు బాగున్నవి కావు.

చ. అడిదము పట్ట నేర్చినది యాది, యకుంఠకుఠారుఁ డౌమునిం
గడిమిని గెల్చుభీష్ము నొఱగంగ నొనర్చిరి పాండునందనుల్;
మిడుకఁడు దానికిన్; మగఁటిమిం బలువీరులనోర్చి క్రాంతుఁ డౌ
బుడుతని నొక్కనిన్ ధనువు పోయినవాని వధించి ప్రీతుఁ డౌ.

సర్వథా మాకు దైవమే మేలు చేయ వలెను. ఇఁక నేను మహారాజునొద్దకుఁ బోయి దేవి యెక్కడ నున్నదని విన్నవించెదను. (నిష్క్రమించుచున్నాఁడు.)

(విష్కంభము)

(తరువాత నాసనస్థురా లగుదేవియు సఖియుఁ జేటియుఁ బ్రవేశించుచున్నారు.)

సఖి—సఖీ! భానుమతీ! అభిమానధనుం డగుదుర్యోధనమహారాజునకుఁబట్టపుదేవి వయియుండియుఁ, గలగన్నంతమాత్రమున కింత బేలవై చింతపడియెద వేమి?

చేటి—దేవీ! సువదన యథార్థము వచించినది. నిద్రపోయినవారి కేనయినఁ గలవరింత రాక యుండునా?

భాను—చేటీ! ఇది యటువంటిది కాదు. నిజముగా నీస్వప్నము నాకు నశుభమును సూచించుచున్నది.

సఖి—ప్రియసఖీ! అటు లయిన నాస్వప్న మేమో చెప్పుము. మే మది సాంగముగా విని దానధర్మములచేతను దేవతాకీర్తనములచేతను దూర్వాదిపరిగ్రహణముచేతను దద్దోషము పరిహరించెదము.

చేటి—సువదన లెస్సగాఁ బలికినది. అకుశలదర్శనము లగుకలలు దేవతాప్రశంసనమునఁ గుశలపరిణామము లయ్యెడు నని వినుచుందుము గదా!

భాను—అట్లయిన దానిని జెప్పెదను. సావధానవు గమ్ము.

సఖి—ఆ! సావధానసుగానే యున్నాను; చెప్పుము ప్రియసఖీ!

భాను—సఖీ! ప్రాణములు చెదరి పోయి పరాకు పడినదానను. మెల్లమెల్లగా జ్ఞప్తికిఁ దెచ్చుకొని యంతయు నీకుఁ జెప్పెద నుండు. (విచారముతో నాలోచించుచున్నది.)

(తరువాత దుర్యోధనుఁడు కంచుకియుఁ బ్రవేశించుచున్నారు.)

దుర్యో—ఎవ్వఁడు చెప్పెనో కాని యిది గడుతెస్సయినమాట.

క. వినిగూఢమొ, బహిరంగమొ,
ఘనమో, స్వల్పంబొ, తానొ, కాకితరుండో,
పొనరించుట యపకారం
బును నపకారులకు, నది ప్రమోదము సేయున్. 3.

నిజమే గదా! సైంధవద్రోణకర్ణాదులచేత నభిమన్యుఁడు చచ్చుట విని, నా హృదయ మూపిరి పుచ్చినట్టే యున్నది.

కంచు—దేవా! ఆచార్యశస్త్రప్రభావమున కిది దుష్కరము గాదు. కర్ణజయద్రథులకు మాత్ర మిది యేమి గొప్ప?

దుర్యో—వినయంధర! కృష్ణుఁ డేమన్నాఁడు? విల్లు విఱిగి పోయినకుఱ్ఱవాని నొంటిగానిఁ జేసి పలువురు గూడుకొని చంపినా రనిగదా! చూడు.

క. ఎదుట శిఖండిని బెట్టుక
ముదుకం డగుభీష్ము నాలమునఁ జంపుటచే
నెదిరికి నేమి యశంబో
యది యే మాకును ఘటిల్లు నట్లగు నేర్పిన్. 4.

కంచు—(తెల్లఁబోయి) దేవా! దేవర యీలాగున సరిపెట్టుకొనఁ గూడదు. దేవరవారిపౌరుషము మొక్క ప్రోవు నని ముం దెన్నఁడయినఁ దలంచు కొంటిమా! అందుచేత నట్లు మనవి చేసికొన్నాఁడను.

దుర్యో—అవు నది నిజమే.

తే. గీ. సేవకులతోడ బాంధవశ్రేణితోడ
హితులతోడఁ గుమారసంతతులతోడఁ
దమ్ముగమితోడఁ దా సుయోధనునిఁ గూల్చుఁ
దనబలంబున రణమందు ధర్మసుతుఁడు. 5.

కంచు—(చెవులు మూసికొని భయముతో) హరి హరీ!

దుర్యో—వినయంధర! నే నేమన్నాఁడను!

కంచు—"తే. గీ. సేవకులతోడ" [అనుపద్యము చదివి] దేవరయట్లు విపరీతముగా ధర్మసుతుఁడు సుయోధను నని వచించితిరి.

దుర్యో—వినయంధర! ఎప్పటివలె నాతోఁ జెప్పకుండ, భానుమతి కేళీకాగృహంబునుండి నేఁ డుదయము చక్కఁబోయినది. అందుచేత నామనస్సు

కలఁతపడి యున్నది. ఆమె యెక్కడ నున్నదో చూఁపుము.

కంచు—దేవా! ఇటు విజయము చేయుఁడు.

ఇద్దఱు—(నడచుచున్నారు.)

కంచు—(ముందు చూచి యంతటఁ బరిమళ మాఘ్రాణించి) దేవా! చిత్తగింపుఁడు. ఇదిగో! మంచుబిందువులచేత శీతలంబు లయినయీప్రభాతవాతపోతంబులు వీతెంచుటంబట్టియుఁ, గులాయకూలంబుల మేలుకొని కర్ణరసాయనంబుగాఁ గలకలధ్వనులు సేయుచుఁ బిట్టలు తమచెట్టుపలను విడుచుటంబట్టియు, స్నేటు గదలి, తొడిమలపట్టు వదలి, దళములమీఁదుగాఁ దరులనుండి యురలు విరులు, పఱచినట్లు లెల్లయెడలను దఱచుగాఁగఁ జూడ వేడుక పుట్టించుచు, గమ్మగమ్మని కమ్మతావులు వెదచల్లుచున్నయీబాలోద్యానంబును దేవర యవలోకింప వలయును. చూడుఁడు.

ఉ. రాతిరి విచ్చి మంచును మరందము లోపల నేక మౌనును
వ్రాతముతోడఁ దాను వఱువాతను నేలను రాలి, బాలసూ
ర్యాతపయోగభిన్నముకుళాంతరవాసన లాన కొల్వఁగా,
శీతతఁ దమ్మిమొగ్గలకు నేగెడు జుమ్మని గండుఁదుమ్మెదల్. ౬.

దుర్యో—(పాఱఁజూచి) వినయంధర! ఈప్రభాతమున నిది మఱియు రమణీయముగా నున్నది. చూడుము.

ఉ. అల్లన విచ్చుచో దళదళాంతరజాలగభానుహస్తముల్
మెల్ల నొడళ్ళు సోఁక, నెకిమీఁడ్రును బోలెను నాంద్రతోడ రా
గిల్లుచు మేలుకాంచి, వల పించుక మైకలపంబు దెల్ప, ను
త్ఫుల్లసరోజగర్భమృదుమోహనశయ్యల వీడుఁ దుమ్మెదల్. ౭.

కంచు—దేవా! ఇదిగో! భానుమతీదేవి సువదనచేతను దరళికచేతను సేవింపఁబడుచున్నది. దేవర యచ్చోటికి వేంచేయుఁడు.

దుర్యో—(చూచి) ఓయీ! వినయంధర! ఇదిగో! దేవిని సందర్శించి నేనును నీవెనువెంట నే వచ్చెదను. నీవు పోయి పౌరితంబునకుఁ దే రాయితంబు సేయుము.

కంచు—చిత్తము! ఇదిగో! సిద్ధపఱిచితిని. (నిష్క్రమించుచున్నాఁడు.)

సఖి—ప్రియసఖీ! జ్ఞప్తికి వచ్చినదా?

భాను—ఆ, వచ్చినది. సఖీ! విను. నే నీప్రమదవనంబునఁ గూరుచుండి యుండఁగా, సమధికదివ్యరూపము గల యొకముంగిస యపురూపముగా నాయెదురను నూఱుపాముల రూపు మాపెను.

ఇద్దఱు—(వెనుకకుఁ దిరిగి తమలో) హరిహరీ! (ప్రకాశముగా) తరువాతఁ దరువాత?

భాను—అయ్యో! నాహృదయము సంతాపసదన మయి క్రమ్మఱ మఱచి పోయెనుగదా!

దుర్యో—(చూచి) ఓహో! దేవి భానుమతి సువదనాతరళికలతోడ నేమేమో మంతన మాడుచున్నది. కానీ. దట్టముగా నల్లుకొనినయీపొదలగుంపు మాటునఁ బొంచి యుండి వీరివిస్రంభసంభాషణముల నాలకించెదను. (అట్లు చేయుచున్నాఁడు.)

సఖి—సంతాపము శాంతిపఱుచుకొని ప్రియసఖీ! చెప్పవమ్మా.

దుర్యో—ఏమి చెప్పుమా యీమెకు సంతాపకారణము? సరే. నేఁడు వాసభవనంబునుండి నాతోఁ జెప్పకుండ లేచి వచ్చినది గదా! కనుక నీమెకు నామీఁదఁ గోపము వచ్చినట్లు స్పష్టమగుచునే యున్నది. ఓభానుమతీ! దుర్యోధనుఁడు నీకోపమునకుఁ దగనివాఁడు సుమీ.

మ. అలుగన్ సల్పితినో ప్రమాదమునఁ గంఠాశ్లేషశైథిల్య మా
వల మోనైతినొ నిద్ర నొత్తిగిలి నాపై నీవు పన్నుండఁగాఁ?
గలలోఁ బ్రేలితినో పరాంగనకథల్? గావించినా నేదియో;
చెలి! యింతేటికి? నన్ను దాసుని బలెన్ జీవాట్లు పెట్టం దగున్. ౧౫

(ఆలోచించి) అటు గాక పోయినను.

తే. గీ. మిగులఁ జిత్తంబు నాయందె తగులుఁ గాన
సంతతప్రేమబద్ధమత్సరము చేత
లేమ నామీఁద నపరాధలేశ మేదొ
మోపి కోపించె నింతుఁ బ్రేముడిని నిజము. ౧౬

అయిన నేమి చెప్పునో విందము.

భాను—సఖీ! తరువాత నే నాసుందరనకులసందర్శనంబున మనంబున నానందంబు నొందితిని.

దుర్యో—ఏమిది! సుందరనకులసందర్శనంబున మనంబున నానందంబు నొందితివి గా! హా! మాద్రీసుతానురక్తురాలగు దీనిచేత మేము నిష్కారణము మోసపోయితిమి. (ముం దనినమాట స్మృతికి వచ్చి)

తే. గీ. "మిగులఁ జిత్తంబు నాయందె తగులుఁ గాన"

(అనుపద్యము చదివి) మూఢదుర్యోధన! ఊంకులాఁడిచేత వంచితుఁడ వగుట యెఱుంగక నిన్నెన్ని విధములనోమన్నించుకొన్నాఁడవు. మఱియిప్పు డేమనియెదవు?

"మ! అలుగన్ సల్పితినో"

(అను పైపద్యము చదివి దిక్కులు చూచి) ఔరా! ఇందుకా దీనికిఁ బ్రొద్దుటనే నిర్జనస్థలమును, సఖీజనసల్లాపములును? మోహవశంబున దుర్యోధనుం డీఱంకులాఁడి లోఁగుట్టును దెలియలేక యేమేమో భ్రాంతిపొందెను. ఆ! ఓసిపాపాత్మురాలా! ఓసికళత్రపాంసులా!

ఉ. సన్నిధి నంత నీకడలు, సాహసము ల్గన నింత లేసి; న
న్నెన్నుట లట్టు, నీవినయ మేదిన ప్రేమము లిట్టు; నాకు నీ
పన్నన యావిధంబు, కొఱమాలినవర్తన మీవిధంబు; నీ
తిన్న నివంగసం బదియుఁ, దెచ్చినమచ్చ యిదయ్యె; జారిణీ! ౧౦.

సఖి—తరువాతఁ దరువాత?

భాను—తరువాత నే నిప్పుడు గూరుచున్నయీలతామంటపము ప్రవేశించితిని. తోడనే యానకులకుమారుఁడు నన్ను ననుసరించి యీపూవుటీరముఁ జేరవచ్చెను.

దుర్యో—అహహా! ఈపాపాత్మురాలికి సిగ్గు లేకున్నది! ఇది కులటల కుచితమే గదా.

తే. గీ. చిరతరాబాల్యవర్ధితస్నేహ యయ్యుఁ
జెప్ప లజ్జించు నారతిచిన్నె లెవరి
కట్టిచెలికత్తెలకు ఱంకులాఁడితనమె
చెప్పుచున్నది కాసంత సిగ్గు లేక. ౧౧.

ఇద్దఱు—తరువాతఁ దరువాత?

భాను—ఆవెనుక నానకులకుమారుండు గర్వముతో మీఁదిమీఁదికి వచ్చి తనచేతితో నాపయిఁటకొంగును దొలంగించెను.

దుర్యో—(క్రోధముతో) సరే. ఇఁకఁ బయిసంగతి విన నక్కఱలేదు. కానీ. పరవనితాహరణప్రగల్భుం డైన యామాద్రీసుతాధముజీవితమును నే నపహరించెదను. (కొంచెము నడచి యాలోచించి) అటుగాదు. ఇదియే మిగులం బాపాత్మురాలు. దీనినే ముందుగా సంహరింప వలయును. (అని మరలుచున్నాఁడు.

ఇద్దఱు—తరువాతఁ దరువాత?

భాను—సఖీ! అటుమీఁదట మహారాజుగారి ప్రాభాతికశోభాకరమంగళమృదంగాదివాద్యంబులచేతను, వారవిలాసినీసరససంగీతభంగీతరంగంబులచేతను మేలుకొంటిని.

దుర్యో—(సవితర్కముగా) ఏమిది? మేలుకొంటి ననుచున్న దే. స్వప్నదర్శనవృత్తాంతము చెప్పుచున్నదా యేమి చెప్పుమా? (ఆలోచించి) కానీ. సఖీవచనంబున స్పష్ట మగును.

ఇద్దఱు—(విషాదముతో నొండొరులను జూచుకొని)

సువదన—ఇందలి యమంగళమును బవిత్రము లగుభాగీరథీప్రముఖపుణ్యనదీతోయములచేత నమోఘము లగుబ్రాహ్మణాశీర్వాదములచేతను బ్రజ్వలితహుతాశనహోమములచేతను బరిహరింతము.

దుర్యో—చాలు నాచిత్తవికల్పము. నిశ్చయముగా నీమె స్వప్నదర్శనమే వర్ణించుచున్నది. నేనే మందబుద్ధి నయి యన్యథా తలంచితిని.

చ. అరసగ మాలకించి చననైతిని గ్రోధముతో, నదృష్టమే;
పరుసము లాడనైతిఁ గొఱపల్కులకల్క జనించి, పుణ్యమే;
సరి యని నేను నమ్మఁగ వెసం గథయుం దుద ముట్టె, దిష్టమే;
తరుణి నిరాపనిందఁ బడి ధాత్రికిఁ బాయుటఁ దప్పె, భాగ్యమే. ౧౨.

భాను—సఖీ! ఇందేమి శుభసూచక మున్నదో చెప్పుము.

ఇద్దఱు—(ఒండొరులను జూచుకొని వెనుకఁ దిరిగి) ఇందుఁ గొంచెమైనను శుభసూచకము లేదు. అసత్యము చెప్పుట మిగుల నపరాధముగదా? సఖుల నడిగినప్పుడు కఠినముగా నున్నను హితమునే చెప్పవలయును. (ప్రకాశముగా) సఖీ! ఇది యంతయు నశుభమునే సూచించుచున్నది. కాఁబట్టి దూర్వాదిపరిగ్రహంబుచేత దేవతాప్రణామంబుచేత నిది పరిహరింపఁబడును. నకులమునుగాని మఱి దేనినిగాని కోఱలు గలజంతువును గలయందుఁ జూడఁ గూడదు. మఱియు నూఱుపాములను వధించుటగూడ స్వప్నమందుఁ జూడ రానిదే.

దుర్యో—సువదన యథార్థము పలికినది. నకులముచేతఁ బన్నగశతవధంబును స్తనాంశుకహరణంబును నిశ్చయముగా మాకరిష్టోదర్కమునుగా నూహించుచున్నాను.

తే. గీ. చూడఁ బర్యాయమున శుభాశుభము లైన
స్వప్నములు రాక యుండవు జనుల కెల్ల;
నూఱనెడులెక్కచే నూహపాఱె మదిని
దమ్ముగమితోడ నాకిది దగిలినట్లు. ౧౩.

(ఎడమకన్నదరుట సూచించి) ఆ! దుర్యోధనుఁడ నయిననాకుఁ గూడ నిమిత్తములు చిత్తవిక్షోభమును గావించుచున్నవి! (గర్వముతో) ఇది యెట్లు? భీరుజనహృదయప్రకంపనము లయిన యిట్టివానియెడల దుర్యోధనున కేమి లక్ష్యము? ఈయర్థమున నంగిరసుఁ డిట్లు చెప్పుచున్నాఁడు.

తే. గీ. కాకతాళీయముగ మూఁడు గల్గుచుండు
స్వప్నశకునంబులును గ్రహచారములును;
భీతికివారలు వానికి బెదరుచుంద్రు;
ప్రాజ్ఞు లాచందమున భయపడరు మదిని. ౧౮.

కాఁబట్టి స్త్రీస్వభావముచేతఁ జులుకనగాఁ గలిగినయీభానుమతిమనసులోని వెఱ్ఱిభయమును నేను బోఁగొట్టెదను.

భాను—సఖీ! సువదనా! ఉదయపర్వతశిఖరంబుమాటుననుండి తనయరదంబు బయలుదేఱ సంధ్యారాగంబు పోయి ప్రసన్నం బైనదురాలోకతేజోమండలంబుతోడ మార్తాండుం డదె యుదయించుచున్నవాఁడు. చూడుము.

సఖి—సఖీ! రోషాన్వితకర్కశకాంతిసశ్రీకం బయినతనకిరణసహస్రంబును, నిబిడముగా నల్లుకొనినయీవల్లికాన్వృతులసందులనుండి వ్యాపింపఁజేసి, యుద్యానవనాంగణంబునకు బంగారునీరు వోయుచు, దాయలకుం జూడ నలవి కాకుండునట్లు, వేఁడివెలుంగు నింగి నలంకరించుచున్నవాఁడు. ఇమ్మహామహునకు లోహితచందనకుసుమగర్భం బగునర్ఘ్యంబు నొసంగ నిది మంచిసమయము.

భాను—చేటీ! తరళికా! అర్ఘ్యపాత్రము నిటు తే. భగవానుఁ డయినయీయుదయభానునిపూజ నిర్వర్తించెదను.

చేటి—దేవీ! చిత్తము. (నిష్క్రమించి మరలఁ బ్రవేశించి) దేవీ! ఇదిగో నర్ఘ్యభాజనము. ఈబాలభానునిసపర్య నిర్వర్తింపుము!

దుర్యో—ప్రేయసీసమీపమునకుఁ బోవ నిదియే మంచిసమయము. (పోవుచున్నాఁడు)

సఖి—(చూచి తనలో) ఎందుకో మహారాజు వచ్చుచున్నాఁడు. అయ్యో! ఈమౌనిమమునకు భంగము గలుగును గదా!

భాను—సూర్యున కభిముఖి-యయి) దేవా! గగనసరోవరవిరాజమానవికచారుణసహస్రపత్రశోభాకరా! పురందరహరిత్సుందరీవదనారవిందసందీపితసిందూరతిలకా! సకలభువనైకరత్నప్రదీపా! కృపాయత్తచిత్తంబున నావందనం

బును జేకొని, నేఁడు నాకుఁ గలిగినయీస్వప్నమందు నేమికీ డున్నను, నది యంతయు సభ్రాతృకుం డగునాప్రాణనాయకునకుఁ గుశలముగాఁ బరిణమింపం జేయుదువుగాక! (అర్ఘ్యమిచ్చి) ఓసీ! తరళికా! ఇతర దేవతలఁ గూడఁ బూజించుటకుఁ బుష్పముల నిటు లందిమ్ము. (చేతులు సాఁచుచున్నది).

దుర్యో—(చేసన్న చేతఁ బరిజనమును దొలఁగించి, తానే పుష్పముల నందిచ్చి స్పర్శసుఖము నభినయించుచుఁ, బరవశమునఁ బుష్పముల నేల జాఱవిడిచినాఁడు.

భాను—(కోపముతో) ఏమీ! పరిజనమున కింత మయిమఱపా? (మఱల రాజును జూచి భయపడి సిగ్గుపడుచున్నది.)

దుర్యో—దేవీ! ఇటువంటిసేవావకాశమందు నీపరిజనుఁడు మిక్కిలి చేతఁగానివాఁడు; దేవిగారు వీనిని శిక్షించి దిద్దుకొన వలయును. ఓ ప్రియురాలా!

తే. గీ. కలికి! నీసోగ తెలిమెఱగంటిచూపుఁ
బడయ నాసించులెంకచో భయము దగునె?
మందహాసాంకురము మోవి మలయఁ బలుకు
మూడిగము సేయ దోసిలి యొగ్గియుంటి. ౧౫.

భాను—మహారాజా! నాకుఁ గొండొకనియమమం దభిలాష గలదు. దేవర యనుగ్రహించి యభ్యనుజ్ఞ నీయ వలయును.

దుర్యో—దేవీ! నీస్వప్నవృత్తాంతము నంతయు నాలకించినాఁడను. ప్రకృతి సుకుమార మయినయీశరీరము నేల యిట్లు గాసిల్లఁ జేసెదవు?

భాను—ప్రాణేశ్వరా! నాహృదయము నతిశయముగా సంశయము బాధించుచున్నది. దేవర నా కనుజ్ఞ నీయ వలయును.

దుర్యో—(గర్వముతో) దేవీ! చాలు నీశంక. చూడు,

మ. ధరఁ గ్రుంగం దెస లన్ని నిండుటలు వ్యర్థంబే మదక్షోహిణుల్?
గురులో నేమికఁ? గర్ణుఁ జేపనికి నొక్కో నీయెడల్ గాసిలన్?
తరుణీ! భ్రాతృశతాస్త్రదీర్ఘభుజకాంతారాంతరస్వైరసం
చరదుర్యోధనకేసరీంద్రగృహిణీ! శంకింప నీ కేటికిన్? ౧౬.

భాను—ప్రాణేశ్వరా! మీరు సన్నిహితులై యుండఁగా నాకు శంక యేమి? మఱి యే మన్న దేవరకే మనోరథసిద్ధి గావింప నభిలషించుచున్నాను.

దుర్యో—ఓసుందరీ! మాకిదే మనోరథము. ఎల్లప్పుడును స్వేచ్ఛను నీతోఁ గూడి విహరింప వలయును. చూడు.

ఉ. కూరిమి నిశ్చలంబు లగుగొప్పకను ల్వొలిదమ్ముల న్నగన్,
దోరపుసిగ్గునం బలుకు దొట్రిల, లోఁ జెలువ వ్వెలర్ప, లో
తూరసరక్త మాకెదవి చక్కెర చిమ్మఁగ, ముద్దు గామసిం
గారపునీముఖేందురుచికన్నను దుర్లభ మేది నా కిలన్? ౧౭.

(తెరలోఁ బెద్దకలకలము. అందఱు నాలకించుచున్నారు.)

భాను—(రాజును గౌఁగిలించుకొని) ప్రాణేశ్వరా! రక్షింపురక్షింపుఁడు.

దుర్యో—(పాఱఁజూచి) ప్రియురాల! భయపడకుభయపడకు.

శా. ప్రాఁకుల్ పెల్లగిలంగ, స్కంధకపతల్ గ్రమ్మంగ ధూమంబు, దం
డాకారభ్రమధూళి రేఁగఁగఁ దృణవ్యాప్తిం దివిన్, శర్కరా
వ్యాకీర్ణం బయి, పెద్దచప్పు డెగయం బ్రాసాదగర్భంబులన్,
లోకం బాకుల మొంద, గాలి విసరెన్; లోలాక్షి! జం కేటికిన్? ౧౮.

సఖి—మహారాజ! మేఘము గ్రమ్మినట్లు కఱకుదుమ్ము భూమినుండి యెగసి కన్నులు దెఱవనీ కుండఁ జేయుచున్నది. పెళపెళారావములతోఁ బెద్దపెద్దచెట్లు విఱిగి పడియెడుచప్పుడులు విని బెదరి, లాయముల నున్నయుత్తమతురంగంబులు కట్లు దెంచుకొని యిట్టటుఁ బరు గెత్తుచున్నవి. పనివాండ్రందఱుఁ దమతమపనులు నిలిపి వేసికొని యూరకుండిరి. అహాహా! ఈదారుణసమీరణాసారంబు సర్వవిధంబులఁ జెఱుపు చేయుచున్నదిగదా! దేవర యింక నిక్కడ లేచి యీదారుపర్వతప్రాసాదము ప్రవేశించుట యనుకూలము.

దుర్యో—ఈసురకరువలి దుర్యోధనునకు మహోపకారి గాని మాఱుతుండు గాఁడు సుమీ. ఈతనిపుణ్యంబునం గాదె యీదేవి తననీమమును మాని నామనోరథము దీర్చినది.

మ. కనుబొమ్మల్ ముడి వేయ లేదు; కనులం గ్రమ్మంగ లే దశ్రులున్;
గినుకన్ మోము మటు చేయ లేదు; శపథోక్తిం బల్కి వారింపలే
దనుఁగుంజన్ను లురమ్ము గాఁడఁ జెలి గాఢాలింగనం బిచ్చె, హా
యని సౌఖ్యాబ్ధిని దేల నామనసు వాత్యాచక్రభీతాత్మ యై. ౧౯.

కావున సంపూర్ణమనోరథుండ నగునాకు స్వేచ్ఛావిహారము గావలసినదే. దారుపర్వతమునకుఁ బోవుదము. (అందఱు నోరుగాలిబాధను నిరూపించుచుఁ గష్టముగా నడచుచున్నారు.)

దుర్యో—క. అడుగులు మెలమెల్లగ నిడు;
వడఁకుచు నడువంగఁ బోకు; పడెదవు సుమ్మీ

పడఁతీ! భుజలతికలు నా
మెడకును బెనవేయు నురము మొఱయిడఁగఁ జన్నుల్. ౨౦.

(ప్రవేశము నిరూపించి) ప్రియురాలా! ఈగర్భగృహము సంవృత మగుటవలన వాయు విందుఁ బ్రవేశింప నేరదు; నలుసులు దుడుచుకొని కన్నులు చక్కఁగాఁ దెఱవుము.

భాను—(సంతోషముతో) అమ్మయ్యా! అదృష్టముచేత నీప్రళయవాయు వునకుఁ దప్పితిమి.

సఖి—మహారాజ! ఈదారుపర్వతారోహణశ్రమమును మాప్రియసఖి యూరుయుగళము సహింపఁ జాల కున్నది. దేవరవారు! వేదికాసనము నింకను నలంకరింప కున్నా రేమీ?

దుర్యో—(దేవిని జూచి) దేవీ! వాత్యాసంభ్రమమున నీకుఁ గలిగినయుపకార మల్పమే. అయినను.

చ. కనుఁగవ పెద్ద దాట నధికశ్రమ చేసెడు నల్పరేణువుల్;
ఘనకుచ హాటలోష్మలఁతికంపముచేతనె ధూతహార మౌఁ;
బెనుచును గంపముం జఘనవిస్తృతి యూరుల కల్ల నేగినన్;
గనుఁగొన నీవరాంగములు గాలికిఁ దోడ్పడె బాధ సేయుటన్. ౨౧.

(అందఱును గూరుచున్నారు.)

దుర్యో—అహో! ఏమిది! దేవి యనాస్తరణ మైనకఱకుఱాతినేలను గూరుచున్నది.

తే. గీ. జిలుఁగుఁబుట్టంబు గాలికిఁ జెదర, నాకుఁ
గనులపండువు సేయునీఘనజఘనము,
వలవదే గారవింప, నావలువ యొగయ
నువిద! నీచూపుఁ దనుపునాయూరుయుగము? ౨౨.

(తెరను జిమ్ముకొని తత్తఱపాటుతోఁ గంచుకి ప్రవేశించుచున్నాఁడు.)

కంచు—దేవా! భగ్నమయినది. భగ్నమయినది.

(అందఱుఁ దెల్లఁబోయి చూచుచున్నారు.)

దుర్యో—ఎవనిచే?

కంచు—స్వామీ! భీముచే

దుర్యో—ఆ! ఏమిరా ప్రేలెదవు?

భాను—ఓయీ! ఏమి చెఱుపు చెప్పుచున్నావు?

కంచు—(భయముతో) ఇదిగో! సర్వము మనవిచేసెదను-

తే॥గీ॥ భగ్నమయినది భీముచేఁ బవనుచేత
నూతనం బైనమీరథకేతనంబు;
కింకిణీక్వాణమున నది క్రిందఁ బడియె
రోదనము చేయునది పోలె మేదినీశ. ౨౩.

దుర్యో—బల మయినగాలి కొట్టినందున లోకమే వ్యాకుల మయినది. ఇఁక రథమున కెత్తినజెండా విఱిగి పడుట యేమి వింత? అంతమాత్రమున కింత ప్రళయముగా “భగ్న మయినది భగ్న మైనది”యని ప్రలపించెద వేమి?

కంచు—దేవా! మ తేమి లేదు గాని, యీయనిమిత్తము నుపశాంతి చేయుటకయి దేవరవారితో విన్నవింపు మని స్వామిభక్తి న న్నిట్లు పలికించినది.

భాను—ప్రాణేశ్వరా! ప్రసన్నబ్రాహ్మణవేదానుఘోషమునను హోమమునను నీయనిమిత్తము పరిహరింప వలయును.

దుర్యో—సరే, నీవు పోయి పురోహితుఁ డయినసుమిత్రునితోఁ జెప్పు.

కంచు—చిత్తము దేవా! (నిష్క్రమించుచున్నాఁడు)

(ప్రతీహారి ప్రవేశించి, జడియుచు దగ్గఱఁ బోయి.)

ప్రతీ—జయముజయము మహారాజా! దేవా! అల్లుఁ డయినసింధురాజు గారితల్లియు నమ్మాయి దుస్సలయును వచ్చి ద్వారముకడ నిలిచి యున్నారు.

దుర్యో—(తనలో) ఏమి? జయద్రథమాతయును, దుస్సలయునా? అభిమన్యువధామర్షితు లైనపాండుసుతులచే నే దేని మహోపద్రవము సంభవిల్లినది కాదు గదా? (ప్రకాశముగా) పోయి వారిని వేగముగాఁ దీసికొని రా.

ప్రతీ—చిత్తము దేవా (నిష్క్రమించుచున్నది.)

(తరువాతఁ దొట్రుపడుచు సైంధవునితల్లియు దుస్సలయుఁ బ్రవేశించుచున్నారు)

ఇద్దఱు—(ఏడ్చుచు దుర్యోధనునిపాదములమీఁదఁ బడుచున్నారు.)

మాత—కురునాథా! రక్షింపుము రక్షింపుము.

దుస్సల—(రోదనము చేయుచున్నది)

దుర్యో—(తొందరపడి లేచి) అమ్మా! ఊఱడిల్లు మూఱడిల్లుము. ఏమి యుపద్రవము వచ్చినది? యుద్ధరంగమున నప్రతిహతరథుం డగుజయద్రథునకుఁ గుశలమే కదా?

మాత—ఏమి కుశల మోయితండ్రి!

దుర్యో—ఎందువలన?

మాత—(భయముతో) పుత్రవధసంజాతక్రోధంబున మండి పడుచు గాండీవి సూర్యుం డస్తమింపక మున్న యతనిని వధించుటకుఁ బ్రతిజ్ఞ పట్టినాఁడు.

దుర్యో—(చిఱునవ్వుతో) ఇదా యంబకును దుస్సలకును బెద్దదుఃఖకారణము? పుత్రశోకముచేతఁ గాల్పఁబడుచుఁ బ్రేలినకిరీటిమాటలచేత నిట్టియవస్థను బొందుచున్నారు. అహా! అబలల బేలతనము! అమ్మా! ఇంక విచారము చాలింపుము. అమ్మాయీ! దుస్సలా! కంటఁ దడి వెట్టకుము. దుర్యోధనబాహుపరిఘసంరక్షితుండును మహారథుండు నగుజయద్రథుని ధనంజయుఁడు ప్రధనంబున నెట్లు నిధనంబు నొందింపఁగలఁడు?

మాత—కుమార! బంధువధచేతఁ గలిగినదుఃఖమునఁ గోపాగ్నులు ప్రజ్వలింప వీరావేశంబున వారు శరీరంబు లాశింపక తిరుగుచున్నారు.

దుర్యో—(పక్కున నవ్వి) అది నిజమే. పాండవులక్రోధము జగత్ప్రసిద్ధమే కదా! చూడు.

ఉ. ముందలఁ బట్టి యీడుచుచుఁ బుట్టము లొల్వఁగ దుస్ససేనుఁ డే
సందడిలోన నోసిపశువా! పశువా! యని కృష్ణ నంటె; నాఁ
డందున లేఁడె గాండివి? యహా! విను. క్షత్రియవంశమందుఁ బు
ట్టొందినపిన్నవాని కిఁక నున్నవె యెక్కుడుక్రోధహేతువుల్? ౨౮.

మాత—అయ్యో! యీప్రతిజ్ఞ నెఱవేఱక పోయినఁ దాను జచ్చిపోవుటకుఁ గూడఁ బ్రతిజ్ఞఁ జేసికొనె నోయితండ్రి!

దుర్యో—అట్లయిన మఱియు మేలే. మోదము నొందుటకు బదులు ఖేదము నొందుచున్నా రేమి? తమ్ములతోఁ గూడ ధర్మరాజు రూపుమాసె నని తలఁచి సంతోషింపుఁడు. అమ్మా! కురుకుమారశతపరివారవర్ధితమహిమముండును, కృపద్రోణాశ్వత్థామాదిమహారథద్విగుణీకృత నిర్వక్రవిక్రముండును నగునీకుమారునిపై నైనను దలపెట్టుటకుఁ గవ్వడి గాని మఱి యెవ్వఁడుగాని సమర్థుండు గాఁడు. నమ్ముము. ఓసికొడుకుశక్తి తెలియనిదానా!

తే. గీ. భీముబలమును విప్వచ్చువిక్రమంబుఁ
దలఁచి ధర్మజుఁ గవలను దలఁప రాదు;
వారిలో నైన నెదిరించువాఁ డెవండు,
చేత విలు పూని నిలిచినసింధురాజు? ౨౯.

భాను—దేవా! అది నిజమే. అయినను గురుకృతప్రతిజ్ఞాభరుం డగుబీభత్సుఁడు భయనిధానుండె గదా!

మాత—అమ్మాయీ! బాగున్నది. కాలమునకుఁ దగినట్లు లాలోచించితివి.

దుర్యో—ఆ! దుర్యోధనుఁడ నైననాకుఁ గూడఁ బాండవులు భయనిదానములా? చూడుము.

స్రగ్ధర. కోదండజ్యాకిణాంకుల్ కుటిలరిపుజనక్షోభులాముక్తవర్ముల్
సైదోడుల్ నూర్వు రచ్ఛాబ్జవన మనుకొనఁగ ఛత్రముల్ దాల్చి రాఁ, బె
ల్లాదు మ్మాదిత్యుతేజ మ్మడఁప నసివిభావ్యాప్తిఁ జూడంగ రాకె
చ్చోఁ దా మై నాదు సేనల్ పోరిది రణమునం జొచ్చు మాత్సర్య మొప్పన్.

ఓ భానుమతీ! పాండవప్రభావము తెలిసినదానా! నీవు కూడ నిట్లు భయపడెద వేమి? చూడు.

తే. గీ. దుస్ససేనునురమ్ము నెత్తురులు గ్రోల,
గద సుయోధనుతొడలు భగ్నముగఁ జేయఁ,
జేయరే వారు ప్రతినలు? సింధురాజుఁ
జంపుశపథంబు నట్టిదే; జంక నేల?. ౨౭.

ఓరీ! యెవడురా అక్కడ? శీఘ్రముగా మాజయరథమును దీసికొని రా. ఇప్పుడే యాప్రల్లదుని మిథ్యాప్రతిజ్ఞునిఁ గావించి, వానికిఁ బవిత్ర మైనశస్త్రమరణము లేకుండఁ జేసెదను.

(కంచుకి ప్రవేశించుచున్నాఁడు.)

కంచు—దేవ!

తే. గీ. జాళువాచిఱుగంటలు శ్రావ్యముగను
మొరయఁ, బ్రాలంబచామరంబులు వెలుంగ,
పల్గితాకులహయములఁ బన్ని తెచ్చె
రథము, తత్పితారివ్యాస్మనోరథము, దేవ! ౨౮.

దుర్యో—దేవి! నీ వంతిపురమున కేఁగుము. నేను నాప్రల్లదుని మిథ్యాప్రతిజ్ఞునిఁగావించి తెల్లఁబుచ్చి వానికిఁ బవిత్రమయినశస్త్రమరణము లేకుండఁ జేసెదను.

(అందఱు నిష్క్రమించుచున్నారు.)

గద్య. ఇది శ్రీపరమేశ్వరవరప్రసాదలబ్ధసరసకవితాధురంధర వడ్డాది సాధువంశక్షీరనీరాకరరాకాసుధాకరాచ్చనామాత్యపౌత్ర హారితసగోత్ర పవిత్రగుణకదంబలక్ష్మాంబాగర్భశుక్తిముక్తాఫల సూరపరాజప్రధానతనూభవవిబుధవిధేయ సుబ్బరాయనామధేయాంధ్రీకృత వేణీసంహారనాటకంబునందు ద్వితీయాంకము.

శ్రీరస్తు.

శ్రీపరమాత్మనే నమః.

వేణీసంహారనాటకము.

తృతీయాంకము.

రంగము—యుద్ధభూమి.

(తరువాత వికృతవేషముతో నొకరాక్షసి ప్రవేశించుచున్నది.)

రాక్షసి—(వికృతముగా నవ్వి సంతోషముతో) చచ్చి పోయినమనుష్యుల మాంసముతోడను వసతోడను వేయికడవలరక్తము సంపాదించి యుంచితిని. ప్రతిదినము దృష్టి దీఱ ద్రాగెదను. ఈయుద్ధము నూఱేండ్లు వర్ధిల్లుఁ గాక. (సంతోషమున గంతులు వేయుచు) సైంధవవధ జరిగించిననాఁడు వలెఁ బ్రతిదినము నర్జునుఁడు యుద్ధకర్మమును సలిపెనేని, నాయింటికొట్లన్నియు రక్తమాంసములతో నిండి యుండును గదా! (నడిచి దిక్కులు చూచి) అయ్యో! నామగఁడు రుధిరప్రియుఁ డెక్కడ నున్నాఁడో? వానిని వెదకెదను. (నడచి) పోనీ. పిలిచెదను. ఓరుధిరప్రియా! ఓరుధిరప్రియా! ఇటురా. ఇటురా.

(తరువాత నట్టిరాక్షసుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

రాక్షసు—(ఆయాసపడుచు) ఇప్పుడు క్రొత్తగాఁ జంపఁబడినమనుష్యుల మాంసమును, వెచ్చవెచ్చనివచ్చినెత్తురును, లభించెనేని నాయాయాసము నిముసములో నుపశమిల్లును గదా!

రాక్షసి—(తిరుగఁ బిలుచుచున్నది.)

రాక్షసు—ఓరీ! ఎవతెరా నన్నుఁ బిలుచుచున్నది? (చూచి) ఓహో! వసాగంధా. (సమీపించి) వసాగంధా! నన్నెందుకే పిలుచుచున్నావు?

రాక్షసి—ఇదిగో! రుధిరప్రియా! ఇప్పుడే హతుఁడైనయొకానొకరాజ ఋషిశరీరావయవములనుండి ప్రవహించి వసాస్నేహముచేతఁ జిక్కనై గోరువెచ్చగా నున్నయీక్రొత్తనెత్తురు, హృదయమాంసముతోఁ గూడ నీనిమిత్తము కొనివచ్చినదానను. ఈమాంసము నంజుకొనుచు రక్తమున దప్పి తీర్చుకో.

రాక్షసు—(సంతోషముతో) బాగు! వసాగంధా! బాగు! కడు మేలయిన పని చేసితివి. నేను మిక్కిలి పడ గొట్టి "యెక్కడ నైనను వెచ్చవెచ్చని నెత్తురు దాహమునకు దొరకునా?" యని కనుపెట్టుకొని యున్నాను.

రాక్షసి—రుధిరప్రియ! మనుష్యులు, యేనుఁగులు, గుఱ్ఱములు, మొదలగువానిరక్తప్రవాహములచేతఁ బెద్దసముద్రములాగున నున్న యిటువంటి యుద్ధరంగమునఁ దిరుగు చుండియు దప్పిగొన్నాఁడ నని చెప్పుచున్నావు. నాకుఁ జాల వింతగా నున్నది.

రాక్షసు—(క్రోధముతో) ఓసీ వసాగంధా! పుత్రశోకముచేతఁ బరితపించుచున్న మనరాణి హిడింబాదేవిని జూచి వచ్చుటకు వెళ్ళినాఁడనే.

రాక్షసి—రుధిరప్రియా! మనరాణి హిడింబాదేవి ఘటోత్కచకుమారునిమరణమున కింకను నేడ్చుచునే యున్నదా?

రాక్షసు—ఓసీ! ఆమెదుఃఖ మెట్లు చల్లాఱును? అయినను నభిమన్యుని చావువలన సమానదుఃఖురా లయినసుభద్రాదేవియు, ద్రౌపదీదేవియు నామెనూఱడించుచున్నారు.

రాక్షసి—రుధిరప్రియ! ఇదిగో నేనుఁగుఁబుఱ్ఱలోఁ బట్టి తీసికొని వచ్చిన దానను. ఈవెచ్చవెచ్చనిక్రొత్తనెత్తురు గుండెలయూరుఁగాయను నప్పళించుచు దాహము పుచ్చుకో.

రాక్షసు—(ఆలాగుచేసి) వసాగంధా! నీవు రక్తమును హృదయమాంసమును గూడ నేపాటి సంగ్రహించి యుంచితివే?

రాక్షసి—రుధిరప్రియ! మునుపు నేను దాఁచిపెట్టిన దెంతో నీ వెఱుఁగవే యెఱుఁగుదువు. క్రొత్తగాఁ గూర్చి పెట్టినది చెప్పెద వినుము. భగదత్తుని నెత్తురు బానెఁడు. సైంధవునివస రెండు కడవలు. విరాటరాజు భూరిశ్రవస్సు సోమదత్తుఁడు బాహ్లికుఁడు మొదలగు పెద్దపెద్దరాజులయుఁ, దక్కినప్రముక్కడి మానుసులయు రుధిరవసామాంసములు వేలకొలఁది బానలనిండఁ బట్టి వాసెనలు గట్టి యింటిలోఁ బదిలము చేసి యుంచినదానను.

రాక్షసు—(సంతోషముతోఁ గౌఁగిలించుకొని) వహవా! వహవా! నీవు మిక్కిలి మంచిపెండ్లామవే. నీవంటిమంచిపెండ్లాము దొరకుటచేతను హిడింబాదేవిప్రసాదముచేతను నాదారిద్ర్యము బొత్తిగ వదలి పోయినది.

రాక్షసి—రుధిరప్రియ! హిడింబాదేవిప్రసాద మెట్టిది?

రాక్షసు—ఇంతకు ముందే హిడింబాదేవి నన్ను గౌరవముతోఁ బిలిచి "రుధిరప్రియ! నీవు నేఁడు మొదలు యుద్ధములో భర్తగారివెను వెంటను దిరుగు

చుండుమనది" యని యాజ్ఞాపించినది. కాఁబట్టి భీమసేనుఁడుగారితోఁ దిరుగు చుండు నాకు నేమి కొదవ? రక్తము మాంసము మెదడు క్రొవ్వు మొదలుగా నేమి గావలసిన నది యెల్లను సులభముగా లభించును గనుక, నాఁకలి యెట్టిదో దప్పిక యెట్టిదో యెఱుంగక భూలోకస్వర్గ మనుభవించెదను. నీవును జాగరూకురాలవయి మఱి వేయికడవలరక్తము సంపాదించి యుంపుము.

రాక్షసి—రుధిరప్రియ! నిన్ను భీమసేనుఁడుగారితో నుండు మన్నది యెందుకు?

రాక్షసు—వసాగంధా! మనదొర భీమసేనుఁడుగారు దుశ్శాసనునిగుండెలు బద్దలు చేసి రక్తము త్రాగుటకుఁ బ్రతిజ్ఞ పట్టినారు. కాఁబట్టి రాక్షసులమయినమనము గూడ నాయనతో రక్తపానము చేయ వలె నని.

రాక్షసి—(సంతోషముతో) దేవి! బాగు! బాగు! నీయనుగ్రహమున నామగనికి మంచియుద్యోగము దొరకినది.

[తెరలోపలఁ బెద్దకలకలము.]

ఇద్దఱు—(ఆలకించుచున్నారు.)

రాక్షసి—ఓరుధిరప్రియ! ఏమిది? పెద్దకలకలధ్వని వినఁబడుచున్నది.

రాక్షసు—ఓసీ! వసాగంధా! ధృష్టద్యుమ్నుఁడు ద్రోణునిజుట్టుఁ బట్టుకొని కత్తితోఁ గుత్తుకఁ గోయుచున్నాఁడు.

రాక్షసి—(సంతోషముతో) రుధిరప్రియ! మనము గూడఁ బోయి ద్రోణునిరక్తము ద్రావుదము.

రాక్షసు—(భయముతో) వసాగంధా! అది బ్రాహ్మణరక్తమే; గొంతును దగులఁబెట్టుచు లోపలఁ బ్రవేశించును. అయ్యో! మన కది యెందుకే?

[తెరలో మరలఁ గలకలము.]

రాక్షసి—రుధిరప్రియ! ఇదిగో! మరలఁ బెద్దకలకలధ్వని వినఁబడుచున్నది.

రాక్షసు—(తెరవంకఁ జూచి) వసాగంధా! ఇదిగో! ఖడ్గము చేతఁ బట్టుకొని యశ్వత్థామ యిటు వచ్చుచున్నాఁడు. ఒకవేళ ధృష్టద్యుమ్నునిమీఁది కోపమున మనలను గూడ బట్టి వధించు నేమో! లేచి రా. మనరాణి హిడింబాదేవి యాజ్ఞాపించినట్లు చేయుదము. (నిష్క్రమించుచున్నారు. ప్రవేశకము)

[తరువాత నుత్థాతఖడ్గుఁడయి కలకల మాలకించుచు నశ్వత్థామ
ప్రవేశించుచున్నాఁడు]

మ. బహులోద్యత్ప్రళయానిలక్షుభితశుంభత్పుష్కలావర్తమే
ఘహాభైరవగర్జితారవసదృక్షుం బై, విశీర్ణశ్రవః

కుహరం బై, తతరోదసీభరిత మై, క్షుభ్యత్కులక్షోణిభృ
ద్గుహా మై, యుత్భవ మయ్యె యుద్ధభువి నీకోలాహలం బే మొకో? ౧.

(ఆలోచించి) అర్జునుఁడో సాత్యకియో వృకోదరుఁడో పడుచుఁదనపుగర్వముచేత మర్యాద నతిక్రమించి ప్రవర్తించినారు. అందుచేత మాతండ్రిగారు మహాకోపమున శిష్యవాత్సల్యము నొకమూలకుఁ ద్రోసి, నిజ మయినతమపరాక్రమమునకుఁ దగినంతపని చేయ నారంభించి యుందురు. ఇది నిశ్చయము.

మ. అని దుర్యోధనపక్షపాతసదృశం బస్త్రగ్రహోత్కోచితం
బనఘశ్రీభృగురామలబ్ధబహుదివ్యాస్త్రానురూపంబు స
ద్ధనురాచార్యరుషానురూప మగుచేతల్ చేసెఁ గాఁబోలు న
జ్జనకుం డారిపుఘస్మరు న్మనయఁగా శక్యుం డెవం డామొనన్? ౨.

(వెనుకఁ దిరిగి చూచి) ఇంకను నేను రథము నెందుకుఁ బ్రతీక్షింప వలెను? నీలమేఘచ్ఛాయను గేరుచు బంగారుఁబిడియును దిట్టమయినపట్టుఁద్రాళ్ళను గలిగి యున్నయీఖడ్గమే నాకు సకలశస్త్రములును; శీఘ్రముగా యుద్ధరంగమున నుఱికెదను. (నడచి యెడమకన్నదరుట సూచించి) ఏమిది? ఆహవమహోత్సవప్రమోదనిర్భరుండ నయి తండ్రిగారిపరాక్రమము చూడ వేడుక పడుచున్నయశ్వత్థామ నగునాకుఁ గూడ నీయనిమిత్తములు సమరగమనవిఘ్నమును గలిగించుచున్నవి. కానీ. పోయెదను. (గర్వముతో నడిచి ముందు చూచి) ఆహాహా! ఏమిది? అవధీరితసకలక్షత్రధర్ము లయి, యుత్సృష్టసత్పురుషోచితలజ్జావకుంఠను లయి, విస్మృతస్వామిసత్కారలఘుచేతసు లయి, యుగళితకులవచస్సదృశపరాక్రము లయి, యీరథికులు హస్తిపకులు నాశ్వికులుఁ బదాతులును గూడఁ దిరిగి చూడక వెన్నిచ్చి పఱచుచున్నవారు. ఏమీ! యీ బలములమహాక్షోభము! (నిరూపించి) ఆహా! ఎంతకష్టము! కర్ణాదు లయిన మహారథులు గూడ సమరపరాఙ్ముఖు లగుచున్నవారే! (భయముతో) మా తండ్రిగారిచేత సంరక్షింపఁబడుచున్నను బలములకు నిట్టియవస్థ సంభవించిన దేమి చెప్పుమా? ఏమో, కానిమ్ము. ఓయీ కౌరవసముద్రవేలాపరిపాలనమహామహీధరమూర్ధాభిషిక్తులారా! ఏల యీలాగున యుద్ధరంగమునుండి పాఱిపోవ సాహసించితిరి? చాలుఁ జాలు. నిలు నిలుండు.

తే. గీ. సమరమునకుఁ దొలంగినఁ జావ లేని,
యిచటు వాసి మఱొక్కెడ కేగఁ దగును;

జంతువుల కెల్ల మృత్యువు సహజ మూరి
కిల్లు మీకీర్తి నలుపు గావింప నేల? ౩.

మఱియు,

చ. పరబలవార్ధిహేతియుత బాడబుఁ డుగ్రధనుర్ధరాధిరా-
డ్గురుఁడు, భవచ్చమూపతి, యకుంఠిత తేజుఁడు, నాదుతండ్రి, సం
గరభర మూన, మీకు భయకారణ మేమి? కృపుండ! నిల్వుమీ;
పరుగిడి పోకు కర్ణ! కృతవర్మఁడ! ధైర్యము చిక్కఁ బట్టుమీ. ౪.

(తెరలోపల) ఇంకను మీతండ్రి యెక్కడ?

అశ్వ—(విని) ఏ మనుచున్నారు? ఇంకను మాతండ్రి యెక్కడనా? ఓరి క్షుద్రులారా! పాఱుఁబోతులారా! ఇట్లు ప్రేలుచున్న మీనాలికలు వేయిచీలికలు గావలదా?

మ. పటుతేజంబున ద్వాదశార్కు లుదయింపన్ లేదు విశ్వంబు గా
ల్చుటకున్; వీచుట లేదు వాయువులు నేఁడున్ సప్తధా భిన్నమై;
జటిలంబై కనుపట్ట దంబరము గర్జత్పుష్కలావర్తక
చ్ఛటలన్; పాపము లాడి రేల జనులున్ శౌర్యాబ్ధిఁ బాపాత్మకుల్? ౫.

(తత్తఱపాటుతో దెబ్బలు తిని సూతుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

సూతు—కుమారా! రక్షింపు రక్షింపు. (కాళ్ళమీఁదఁ బడుచున్నాఁడు.)

అశ్వ—(చూచి) ఏమిది! తండ్రిగారిసారథి యశ్వసేనుఁడా? ముల్లోకములు రక్షింపఁ జాలినతండ్రిగారిసారథి వై యుండియు చిన్నవాఁడ నగు నావలన రక్షణము గోరుచున్నా వేమి?

సూతు—(లేచి దుఃఖముతో) ఇంకను మీతండ్రి యెక్కడ?

అశ్వ—(తత్తఱపడి) ఏమి? తండ్రిగారు లేరా?

సూతు—మఱేమి?

అశ్వ—హా! తండ్రీ! (మూర్ఛిల్లుచున్నాఁడు.)

సూతు—కుమార! ఊఱడిల్లు మూఱడిల్లుము.

అశ్వ—(తెలివి వచ్చి కన్నీళ్ళతో) హా! పుత్రవత్సల! హా! లోకత్రయైకధనుర్ధర! హా! పరశురామాస్త్రసర్వస్వప్రతిగ్రహప్రవీణ! హా! తండ్రీ!

సూతు—కుమారా! ఇంతకడుపువగిలి దుఃఖింపఁగూడదు. మీతండ్రిగారు వీరపురుషోచిత మయినమరణము నొందినారు. నీవును దదనురూప మయినభుజపరాక్రమమున విజృంభించి యీదుఃఖసాగరమును దరించి సుఖింప వలయును.

అశ్వ—(కన్నీరు జారు) అయ్యో! అశ్వసేనా! అంతభుజపరాక్రమసమగ్రు లయినతండ్రిగారు తా మేరీతిన నస్తమించిరో చెప్పుము.

చ. తనగదచేతఁ బెద్దగురుదక్షిణ యిచ్చెనొ భీముఁ డాజిరన్?

సూతు—కాదు! కాదు!

అశ్వ—ఘనతరశిష్యవత్సలుని గాండివి యమ్ములఁ బూజ చేసెనో?

సూతు—కుమారా! అలా గేల జరుగును?

అశ్వ—వినిశితచక్రధారకును వెన్నుఁడె తా సర చేసెనో గురున్?

సూతు—అదియును సంభవింప లేదు కుమార!

అశ్వ—మనమున నాకు నాలుగవమానిసి తోఁపఁడు వీరు మువ్వురే ౬.

సూతు—కుమార!

ఉ. వీరత నెంత? యుద్ధమున విల్లు కరంబున నున్న యంత్రమా
కారము దాల్చునగ్గురుమగంటిమి కాయన కొండ్లు సాటియే?
దారుణశోకభారమునఁ దానుగ శస్త్రము నుజ్జగింపఁగాఁ,
గ్రూరరిపుండు చేరి యతిఘోరము చేసె; నిఁ కేమి చెల్పుదున్? ౭.

అశ్వ—అయ్యో! శోకమునకుఁ గాని యస్త్రపరిత్యాగమునకుఁ గాని యేమి కారణము?

సూతు—కుమారుఁడే కారణము.

అశ్వ—అయ్యో! నే నెట్లుగాను?

సూతు—(కన్నీళ్ళతో) ఆలకింపుము.

మ. వడిగా, స్పష్టముగాఁ, బృథాతనయుఁ డశ్వత్థామ దోఁచింపఁగాఁ
బడె నంచు న్వచియించి, మెల్లఁ దనలోఁ బల్కెన్ గజం బంచు; నా
నుడు వాలించి, కుమారవత్సలుఁడు ద్రోణుం డట్టి కన్నీళ్ళతో
విడి చెన్ శస్త్రములున్, యుధిష్ఠిరవచోవిశ్వాసమూలంబునన్ ౮.

అశ్వ—హా! సుతవత్సల! హా! వృథామదర్థపరిత్యక్తజీవిత! హా! శౌర్యరాశీ! హా! శిష్యప్రియ! హా! యుధిష్ఠిరపక్షపాతీ! హా! తండ్రీ! (రోదనము చేయుచున్నాఁడు)

సూతు—కుమార! ఊరక యేల యిట్లు వావిడిచి దైన్యంబు నొందెదవు! ఊఱడిల్లు మూఱడిల్లుము.

అశ్వ—తే॥గీ॥ తండ్రి! నీ నష్టదుస్సృతవధంబు వినుచు,
విడిచి తనువు నస్త్రములతోడఁ గొనకుండెదన్

నీదునిక్కంపువధ విని నేను మనెద;
నిట్టిఖలు నెడఁ బ్రేమ నీ కేల పుట్టె?

(మూర్ఛిల్లుచున్నాఁడు.)

సూతు — ఊఱడిల్లు మూఱడిల్లుము కుమార!

(తరువాత నుద్వేగముతోఁ గృపుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

కృపు — చ. అనుజులతోడి కౌరవధరాధిపుఁ డేటికి? నేల ధర్మనం
దనుఁడు? వృథాగ నస్త్రములు దాల్చినరాజులు నేను నేల? మా
తనువులు గాల్పనా? యపుడు ద్రౌపది, యిప్పుడు ద్రోణుఁ డీవిధం
బునఁ దలపట్టుకోఁబడినముచ్చట గంటిమి చిత్రవైఖరిన్. ౧౦.

కట్టా! ఎంతపని పుట్టెను? పిల్లవాఁ డయినయీయశ్వత్థామ మొగము నే నెట్టుగాఁ జూతును? అయినను వాఁడు హిమవంతునివంటి ధైర్యసారము గలవాఁడును, లోకవృత్తములు బాగుగ నెఱింగినవాఁడును, గాన నంతగా దుఃఖింపకుండు నని తోఁచెడును; కాని యసదృశ మయినయీపితృపరాభవము వినిన, నేమి చేసెడునో యది మాత్ర మూహింపఁ జాలకున్నాను.

మఱియు.

క. మునుపటి యొకదాని ఫలం
బనుభూతం బగుచు నున్న దతిదారుణ మై;
జనమీ కేశగ్రహణం
బున నిశ్శేషంబ యగును బోరూఢముగన్. ౧౧.

(చూచి) ఇదిగోఁ గుఱ్ఱవాఁ డిక్కడనే కూరుచున్నాఁడు. దగ్గఱకుఁ బోయెదను. (సమీపించి తొట్రుపాటుతో) వత్సా! ఊఱడిల్లు మూఱడిల్లుము.

అశ్వ — (మూర్ఛ దెలిసి కన్నీళ్ళతో) హా! సకలభువనైకగురూ! హా! తండ్రీ! (ఆకాశము చూచి) యుధిష్ఠిర! యుధిష్ఠిర!

ఉ. కొంకి మెఱుంగ వెన్నఁడును బుట్టి; యజాతవిరోధి వైతి వే
వంకను భూజనంబునకు బాధ యొనర్పమి; నాయభాగ్యతన్
గొంకక సర్వముం జెఱుచుకొంటివి నీ వొకమాటలో; నృపా!
పంకిలచిత్త! మజ్జనకు బ్రాహ్మణుఁ డొజ్జ యటంచు నెంచవో? ౧౨.

సూతు — కుమార! ఇదిగో! మీమేనమామ కృపాచార్యులవారు వచ్చి ప్రతీక్షను గూరుచున్నారు.

అశ్వ — (పార్శ్వమునకుఁ దిరిగి చూచి కన్నీళ్ళతో) మామా! మామ!

ఉ. ఎవ్వనితోడ నిప్పు డని కేగితివో, పరశూర రాజికిన్
జివ్వగులం దొలంప రణసీమల రాపిడికంబ మెవ్వఁడో,
యెవ్వనితోడ నీ కగునొ యెప్పుడుఁ జిత్రపుసప్పుటా లతం
డెవ్వల నేగె నీమఱంది? యెర్పడఁ జెప్పఁగదయ్య మాతులా! ౧౩.

కృపు—అబ్బాయీ! తెలుప పలసిన దంతయు నీకే తెలియును; కాబట్టి యిఁక నీలాగున నీ పతిశోకమున మునుంగఁ దగదు.

అశ్వ—మామా! నేను దుఃఖము విడిచి పెట్టినాఁడ. ఇదిగో! సుతవత్సలుఁ డయిన నాతండ్రియొద్దకే పోయెదను.

కృపు—నాయనా! ఇది నీబోఁటులకుఁ దగినది కాదు.

సూతు—కుమార! అతిసాహసము చేయకుము.

అశ్వ—అయ్యా! ఏమి చెప్పుదును?

తే. నన్ను నెడఁబాయఁ జాలక నాదుతండ్రి
సరగఁ బరలోకమునకుఁ దా నరిగెఁ గాదె?
యెంత ప్రేముడి గలిగినయట్టితండ్రి
కెట్లు విరహంబు గలిగింప నేను నేర్తు? ౧౪.

కృపు—వత్సా! పుత్రులకు లోకద్వయమునందును దండ్రు లనువర్తనీయులు; కాపున సంసార మున్నంతవఱకు దేహయాత్ర విధాయకము.

ఆ. వె. ఉదకదానమునను, యోగ్యనిమంత్రణం
బునను, శ్రాద్ధకర్మమునను, దండ్రి
కుపకరింతు బ్రతికి యుండిన నిహమున;
నితరవిధమె యైన నేమి చెప్ప? ౧౫.

సూతు—ఆయుష్మంతుఁడా! ఈశారద్వతునియాజ్ఞ మీఱకుము.

అశ్వ—అయ్యా! ఇది యంతయు సత్యమే; అయినను పితృవియోగి నగు నేను దుర్భర మయినయీశోకభారముచేత క్షీణ మైన నీప్రాణముల భరింపఁ జాలకున్నాను: కాఁబట్టి తండ్రిగారిని జూచుట కాయన పడియున్న యెడ కేని పోయెదను. (లేచి ఖడ్గముఁజూచి యాలోచించి) ఇంక నీశస్త్రగ్రహణవిద్యతో నేమి ప్రయోజనము? (దోసిలి పట్టి కన్నీళ్ళతో) పూజ్య మయిన యోశస్త్రమా!

చ. అనుచిత మైన నోటమిభయంబున నెవ్వఁడు నిన్నుఁ దాల్చె, నె
వ్వనిమహిమంబుచేతను బ్రపంచమునం దెదు రేది లేదు నీ
కనుపమపుత్రశోకమున నాయన నిన్నుఁ బరిత్యజించెఁ; గా
వున నిఁక నేను నిన్నిడుదుఁ; బొమ్ము శుభ మ్మగు నీకు శస్త్రమా! ౧౬.

(విడువఁబోవుచున్నాఁడు.)

(తెరలో) ఓహోహో! రాజులారా! ఏమిది? పూజ్యుఁ డయిన భారద్వాజు నీఘాతుకుఁ డిట్లు పరాభవించుచుండఁగా మీ రందఱు నుపేక్షించుచున్నారుః

అశ్వ—(విని మెల్లమెల్లగా శస్త్రమును స్పృశించుచు) ఏమీ! మాతండ్రిగారగు భారద్వాజునకే పరాభవమా?

(మరలఁ దెరలో)

మ. వదనం బశ్రులఁ దోఁపదోఁగ వనటు న్వర్జించి శస్త్రంబు లా
పదలో నుండఁగఁ, దజ్జరాపలితధావళ్యస్ఫురత్కేశముల్
సదసచ్చాపన్యతఁ జేతఁ బట్టుకొని, ధృష్టద్యుమ్నుఁ డాచార్యుగొం
తు దెగం గోసి చనంగ, నంద ఱిటు లీ మ్లాత్ము నైరింతురే? ౧౭.

అశ్వ—(క్రోధముతోడను దుఃఖముతోడను గృపసూతులను జూచి) ఇదేమి?

చ. కనులను మూసి, ప్రాయమునఁ గాయముఁ బాయఁ దలంచి, శస్త్రముస్
మునుపె పరిత్యజించి, రణభూమిని నాజనకుండు నిల్వ, నా
యనపలితో త్తమాంగమున హస్తము వైచియు గొంతు గోసెనే
చనఁటి యొకండు, విండ్లు తమచేతులఁ బూని నృపుల్ గనుంగొనన్? ౧౮.

కృపు—వత్సా! జను లీలాగుననే చెప్పుకొనుచున్నారు.

అశ్వ—ఏమి! నాతండ్రిశిరస్సె యొకదుర్మార్గుఁడు ముట్టుకొనెనా?

సూతు—(భయముతో) కుమార! తేజోరాశి యగు నమ్మహాత్మునకుఁ గ్రొత్తగా నిట్టిపరాభవము సంభవించినది.

అశ్వ—హా! పుత్రవత్సల! హా! తండ్రీ! అదృష్టహీనుఁడ నయిన నానిమిత్తము నీశస్త్రమును బరిత్యజించి యిటువంటిక్షుద్రునిచేతఁ బరాభూతుఁడ వయితివి గదా? కానీ.

శోకముతో ననిశ గళదసూ డగుమద్గురుని త్తమాంగముఁ,
గాకియొ, కుక్కయో, దుపదనందనుఁడో, స్పృశియించుఁగాక! ద
ర్పోంకరభీకరాస్త్రధనవిస్ఫృతి మత్తిలు శత్రుసేత్తిపై,
... కాలు నే నునిచినా నిదిగో! మఱి కేలు గాదు సూ. ౧౯.

ఆ! ... త! పాంచాలాపసద!

...మో మహోగ్రగతిఁ దోఁగ నాజనకుం డమ్ముల్ విల్లు వర్జింప, నీ
...మై మెల్లగఁ జేరి, తచ్ఛిరముపై హస్తం బిడం జాలినా
వాఁ... మూర్ఖా! మది నప్పు డేమఱితి యశ్వత్థామ యే మయ్యెరా?
ఖీఁ... మూఁకలు దూదిబుంగ లగుఁ జుమీ నాదుర్బాహాగ్నికిన్ ౨౦.

హా! యుధిష్ఠిర యుధిష్ఠిర! అజాతశత్రూ! అమిథ్యావాదీ! ధర్మపుత్ర! నీ తమ్ములకుఁ గాని నీకుఁగాని నాతండ్రి యేమియపకారము గావించెను రాజా? పోనీ. అసత్యప్రతిధానవక్రచేతస్కుండగు వీనితో నేమి? అర్జునా! సాత్యకీ! బాహుశాలివృకోదరా! మాధవా! సురాసురమనుజలోకైకధనుర్ధరుండును, బ్రాహ్మణుండును, వయోవృద్ధుండును, సర్వజనధనురాచార్యుండును, విశేషించి నాకుఁ దండ్రియు నగు భారద్వాజుని యుత్తమాంగమును బాంచాలకులకళంకుఁ డగు నరపశువు తనకరంబున స్పృశియించుచుండ, మీ రెల్లరు చూచి యూరకుండుట యుచితమే గదా? ఛీ! వీండ్రతో నేమి? వీండ్రందఱుఁ బాపాత్ములే.

తే.గీ. వీతమర్యాదులై గురుపాతకంబు
సలిపి సహియించి చూచిన సకలమనుజ
పశుల మిమ్మెల్ల, నేఁ గృష్ణపార్థభీమ
యుక్తముగ భూతబలి యిత్తు రక్తమునను — ౨౧.

కృపు—అబ్బాయీ! దివ్యాస్త్రకోవిదుండవయి పితృసమానుండవగు బాహుశాలికి నీ కట్లు చేయుట యేమి యసాధ్యము?

అశ్వ—ఓరోరి పాండవమత్స్యపాంచాలక్షత్రియహతకులార!

చ. గురుశిరంబు ముట్టి రనుకోపమునన్, జ్వలదగ్నితుల్యమౌ
పరశున జామదగ్న్యుఁడు నృపాలుర నెమ్మెయిఁ జేసె వింటిరే?
నరపతులార! దారుణరణంబున రోషకషాయితాత్ముఁడై
యరిరుధిరప్రవాహముల నట్టులె ద్రోణి యొనర్ప లేఁడొకో? — ౨౨.

సూతుఁడా! నీవు శీఘ్రముగాఁ బోయి మహాహవలక్షణ మనుమదీయరథంబును సమస్తయుద్ధోపకరణములతోడను దీసికొని రా.

సూతు—చిత్తము కుమారా! (నిష్క్రమించుచున్నాఁడు)

కృపు—వత్సా! అవశ్యము ప్రతిక్రియ చేయఁదగిన యీ దారుణపరాభవానలంబును నీవు గాక మాబోఁటులు చల్లార్ప నేర్తురా?

అశ్వ—అటులయిన నే నిఁక నేమి చేయవలెను?

కృపు—సేనాధిపత్యమున కభిషిక్తుండవయి నీవు యుద్ధభూమికిఁ బోవలయు నని నా తాత్పర్యము.

అశ్వ—మామా! ఇది పరాధీనము నపరిగణనంబును.

కృపు—నాయనా! ఇది పరాధీనమును గాదు; అపరిగణనంబును గాదు. చూడు.

తే. భీష్ముఁడును ద్రోణుఁడును లేని పెద్దకాలంత,
పాయు నెట్టులు ధృతరాష్ట్రబలములకును,
వారితోఁ దులఁదూఁగెడు బాహుశాలి
వీవు సేనాధిపతివి గా వేని పత్న? —౨౩.

విలువిద్యయందు నాఁటి తేఁటినని నుభాఁటిశూరునికి ముల్లోకములు నోపవన, నిఁక యుధిష్ఠిరబల మెంతపాటిది? కాఁబట్టి కౌరవనాయకుం డభిషేకోపకరణంబులను గూర్చుకొని, నీనిమిత్త మిప్పు డెదురు చూచు చుండు నని నేనుదలంచెదను.

అశ్వ—అలా గయిన మామా! పరాభవాగ్ని చేత దగ్ధ మగుచున్న నా హృదయంబు, తత్ప్రతీకార మగునభిషేకమునకుఁ దత్తఅపడుచున్నది; కాఁబట్టి నే నిప్పుడు పోయి నాతండ్రి యస్తమించుటకు విచారగ్రస్తుఁ డయి యున్న దుర్యోధనుని సేనాధిపతి నయి కౌఁగిలించికొని, నెయ్యంబున నూఱడించి, సంతాప శాంతి గావించెదను.

కృప—అబ్బాయీ! ఇది బాగున్నది. మన మతనియొద్దకే పోవుదము.

(నడుచుచున్నారు).

(తరువాతఁ గర్ణదుర్యోధనులు ప్రవేశించుచున్నారు.)

దుర్యో—అంగరాజ!

తే.గీ. చుట్టముల శత్రువులు సంప, శోకజలధి
శస్త్ర మను తెప్ప నీదుఁ దేజస్వి యెందుఁ;
గొడుకుచావును విని పోరఁ గుంభభవుఁడు,
శస్త్రమును దాల్ప కేటికి సన్యసించె? —౨౪.

అవును. ఎట్టివారికిఁ గాని నైజగుణంబు పో దని చెప్పెడు పెద్దలమాట యబద్ధ మగునా? శోకాంధచేతస్కుఁ డయి యీద్రోణుండు క్షత్రియధర్మ మయినకాఠిన్యమును విడిచిపెట్టి బ్రాహ్మణసులభ మయినమార్దవమును బరిగ్రహించినాఁడు.

కర్ణ—రాజా! కౌరవేశ్వర! ఇది యట్లు కాదు సుమీ.

దుర్యో—మఱి యెట్లు?

కర్ణ—ఆయనయభిప్రాయ మిది. అతఁ డీభూమండలం బంతకు నశ్వత్థామ నభిషేకింప వలె నని చూచు చుండువాఁడు; కాఁబట్టి యాకోరిక వ్యర్థ మయినందున బ్రాహ్మణుఁడను వృద్ధుండను నయిన నా కీవృథాశస్త్రగ్రహణ మెందు కని యట్లు చేసినాఁడు.

దుర్యో—(తలపంకించి) ఇది యాలాగే కావచ్చును.

కర్ణ—ఇందుచేతనే, కౌరవపాండవపక్షపాతమున రాజు లందఱుఁ దమలోఁ దాము పోరాడి చావఁగోరి యీతండు మనలోనిప్రధానపురుషుల కపాయము వచ్చునప్పుడు చూచి చూడనట్లు లూరకుండుచు వచ్చినాఁడు.

దుర్యో—ఇదియును ముందు చెప్పినదాని కనుకూలముగనే యున్నది.

కర్ణ—ఇంతే కాదు. రాజా! ద్రుపదరాజితనికి బాల్యస్నేహితుఁడయిన ను జిన్నప్పటినుండి యితనియభిప్రాయ మెఱింగి యుండుటచేతనే యీమహాత్మునికిఁ దనరాష్ట్రములో నిలువ నింత నీడ నైన నిచ్చినాఁడు కాఁడు.

దుర్యో—సెబాసు! అంగరాజా! లెస్సగా నాలోచించితివి.

కర్ణ—మిత్రమా! ఇది నాయొక్కనియభిప్రాయమే కాదు. ఎఱిఁగినవా రెవ్వరును దీనిని వేఱుగాఁ దలంచుకొనరు.

దుర్యో—అవును. ఇది నిశ్చయమే. ఏమి సందేహము?

తే.గీ. అతిరథుఁడు తాను ముందుగా నభయ మిచ్చి
సైంధవున కర్జునుఁడు వానిఁ జంపుచుండ
నితఁడు తద్రక్షణమున నుపేక్ష చేసె;
నిక్లెకం కున్న దానికి నేమి కతము? ౨౫.

కృపు—(చూచి) అబ్బాయీ! ఇదిగో! దుర్యోధనుఁడు సూతపుత్రునితోఁగూడ నీమఱ్ఱిచెట్టునీడను గూరుచుండి యున్నాఁడు. మనము నక్కడకుఁ బోదము. (అట్లుచేసి)

ఇద్దఱును—విజయతాం విజయతాం రాజన్!

దుర్యో—(చూచి) ఓహో! కృపాచార్యులవారును నశ్వత్థామయు నా? (ఆసనమునుండి లేచి) గురువర్యా! నమస్కరించుచున్నాను. (అశ్వత్థామ నుగూర్చి) ఆచార్యపుత్ర!

ఉ. దగ్గఱ రమ్ము; నాకతనఁ దండ్రికిఁ బాసినబిడ్డ వైతె? నన్
బిగ్గఁ గవుంగిలింపు సఖ! నీకడుపుత్తని మేను హత్తఁగా;
నగ్గురుబాహులట్టిభవదాయతబాహులు మేను సోఁకినన్,
గగ్గురుపాటు సంభవము గా దెటు లారట మొందుచుండినన్? ౨౬.

(కౌఁగిలించుకొని పక్కను గూరుచుండఁ బెట్టుకొనుచున్నాఁడు.)

అశ్వ—(కన్నీరు విడుచుచున్నాఁడు)

కర్ణ—ద్రోణాయనీ! తీవ్రమయినశోకానలమున నేల పరితపించెదవు?

దుర్యో—ఆచార్యపుత్ర! ఈదుఃఖసాగరమునందు మన కిరువురకును భేద మేమి?

ఆ.వె. తండ్రి నీకుఁ జూడఁ దండ్రి నెచ్చెలి నాకు;
నీకు గురువు వింట నాకు గురువు;
అతఁడు నేను దొఱఁగ, నార్తి చెప్పఁ దరంబె?
మఱుఁగుచున్న నీదు మదికె యెఱుక. —౨౭.

కృపు—వత్సా! ఈకురుపతి చెప్పినదంతయు యథార్థము.

అశ్వ—రాజా! నీవు కూడ నిట్లు పంచుకొనుటచేత నాశోకభారము కొంతచులుకపడినది. కాని

ఆ.వె. నేను బ్రతికి యుండఁగానె నాజనకుని
జుట్టు దుష్టరిపుఁడు పట్టుకొనియె;
నింక లోకమందు నితరు లాత్మజులు
కొడుకులకును నాస పడుదురయ్యా? —౨౮.

కర్ణ—ద్రోణజా! అందుకుఁ జేయునది యేమి? ఎల్లవారలపరాభవమును పోఁగొట్టఁ జాలినతాను బుద్ధిపూర్వకముగా శస్త్రమును బరిత్యజించి యంతటి దురవస్థను దెచ్చుకొన్నాఁడు.

అశ్వ—అంగరాజా! నీ వేమనియెదవు? అందుకుఁ జేయునది యేమా? అయిన నాచేయునది యేమో చెప్పెద వినుము.

* శా. పాలుం బూనుబలాఢ్యుఁ డేఁ డెవఁడొ శుంభత్పాండవానీకినిన్
బాలుండున్, ముది,మూలు, నెవ్వఁ డెవఁడో పాంచాలురం దేఁ డెవం
డాలోకించెఁ బదుగ్రకర్మ మెవఁ డేఁ డడ్డం బనిన్ నాకుఁ, ద
త్కాలుం డైనను, వానివానికి మహాకాలుండ నే నయ్యెదన్ —౨౯.

మఱియు నో జామదగ్న్యశిష్య! కర్ణ!

చ. మడువు లొనర్చె నిక్కడనె మాతృరసెత్తుటితోడ రాముఁ డి
ప్పుడు నదియే పరాభవము భూపుఁడు మత్పితృమౌళి ముట్టె; నా
కడ వెలుఁ గొందుచున్న రిపుఘస్మరశస్త్రము లవ్వియే సుమీ;
యడిగితి గాన లెస్స విను మాపనియే యిపు డేను జేసెదన్ ౩౦.

దుర్యో—ఆచార్యపుత్రా! అనన్యసాధారణమై తథావిధమైననీబాహుపరాక్రమమునకు సాటి యున్నదా?

పాఠాంతరము. * ఉ. వాలును గెలఁ బూనుబలవంతులఁ బాండవసేనలందుఁ, బాం
చాలకులంబునందు ముదుసళ్ళను బిల్లలఁ జూలులన్, మహా
కాలుఁ డనంగ నవ్వు డవి గాంచిన వైరుల నెల్లద్రుంతు నే
నాలములోనఁ గ్రోధభయదాకృతి నై పగ యెల్లఁ దీఱఁగన్.

కృపు—రాజా! అశ్వత్థామ మహాసమరభారము వయి వేసికొన్నాఁడు గదా! ఇతఁడు ధనుర్ధరుఁ డయిన ముజ్జగంబులును జయింప సమర్థుఁ డీక యుధిష్ఠిరబల మెంతపాటిది? కాఁబట్టి యీతనిసేనాధిపత్యమున కభిషేకించుట సముచితం బని నే నూహించెదను.

దుర్యో—మీరు లెస్సగా నాలోచించి చెప్పితిరి. అయిన నిది పూర్వమందే యంగరాజునకుఁ జెంది పోయినది.

కృప—రాజా! అసదృశ మయినపితృపరాభవశోకసముద్రమున మునిఁగి యున్నయితని, నంగరాజునిమిత్తము పేక్షించుట యుక్తము గాదు. ఆశత్రుకులమునే సంహరింపఁ దలఁచి యున్నయితనికి నీ విట్లు చేసినఁ గష్టముగా నుండదా?

అశ్వ—రాజా! ఇంక యుక్తాయుక్తవిచార మెందుకు?

మ. ఎదఁ జే యుంచుక నిద్రపో దధిప! నీ వీరేయి నల్లాములున్;
గదసంపుంగధ నేఁటితో ముగియు; నిష్కంసారి నిష్పాండవం
బిదె నిస్సోమక మయ్యెడుం జగము; నేనే యాధరాభార మం
త దొలంగించెద, దుష్టరాజకులకాంతారంబు ఖండించుచున్. ౩౧.

కర్ణ—ద్రోణాత్మజా! ఇది చెప్పుట సుకరమే గాని చేయుట దుష్కరము. ఈపనికిఁ గౌరవసేనలో ననేకులు సమర్థులు.

అశ్వ—అంగరాజా! ఈపనికిఁ గౌరవసేనలో ననేకులు సమర్థులు; నిజమే. అయినను నాదుఃఖముకొలఁది నే నిట్లు పలికితిని గాని వీరపురుషుల నాక్షేపింప వలయు నని కాదు.

కర్ణ—మూఢుఁడా! దుఃఖ ముండినఁ గన్నీళ్ళు విడువ వలయును; క్రోధ ముండిన నాయుధసహాయుఁడ వయి యుద్ధములో నుఱుక వలయును. అంతే కాని యిట్లు ప్రతాపములు గొట్టుట యెందుకు?

అశ్వ—(క్రోధముతో) ఓరోరి రాధాగర్భభారభూత! సూతాపసద! ఇ దేమిరా న న్నాక్షేపించెదవు?

కర్ణ—క. సూతుఁడనో సూతసుతుఁడనో
యీతప్పున కేమి లేర? యెవఁడో యొకఁడన్;
జాతము దైవాధీనము;
ఖ్యాతం బగుపౌరుషము మదాయత్త మగున్. ౩౨.

అశ్వ—ఓరికర్ణా! నీ వే మని యెదవు; నాదుఃఖమును గన్నీళ్ళతో నా తీర్చుకొమ్మని యెదవు? ఖడ్గముతోఁ గాదేమి? చూడు.

మ. భవదస్త్రంబులు వ్రాలె నావి, గురుశాపప్రాప్తి వ మ్మయ్యెనో?
బవరంబు న్విడనాడి వచ్చితినొ నీభంగిన్ భయం బొందుచున్?
స్తవముల్ చేసెదుసూతవంశమున సంజాతుండనో నీవలెన్?
పవ యస్త్రంబునఁ గాని యస్త్రమునఁ దీర్పన్ లేను రా? బాలిశా! 33.

కర్ణ— (క్రోధముతో) ఓరివాచాట! ఓరివృథాశస్త్రగ్రహణదుర్విదగ్ధ! ఓరిబ్రహ్మచారి!

క. వ మ్మయ్యెనో సా మ్మయ్యెనో
యమ్ముల నే విడిచిపెట్ట నాలములోనన్,
నెమ్మనమునపాంచాలభ
యమ్మున నీబాహుశాలి యగుతండ్రివలెన్. ౩౪.

అశ్వ— (క్రోధముతో) ఓరిరథకారకులకలంక! రాధాగర్భభారభూత! ఓరియాయుధానభిజ్ఞ! తండ్రిగారిని గూడ నాక్షేపించుచున్నావట్రా?

చ. విదితజగత్త్రయైకభుజవిక్రముఁ డాయన భీరుఁడో జయా
ప్పదుఁ డగుశూరుఁడో యెఱుఁగుఁ బ్రత్యహ మీభువి తద్రణక్రియన్;
వదలెను శస్త్ర మెట్లొ తెలుపంగను ధర్మసుతుండె సాక్షి; నీ
వదలెదు పాఱఁబోత! తులువా! యపు డచ్చట నీవు లేవురా? ౩౫.

కర్ణ—(నవ్వి) ఓహో! నేను పాఱఁబోతను; నీవు పోటుమానిసివి; నీతండ్రిని దలఁచుకొన్న నాకు మిక్కిలి సందియము గలుగుచున్నది. ఓరిమూఢ!

తే. గీ. శస్త్ర ముడిగిన నేమి? యశస్త్రపాణు
లాయుధము నెత్తురిపుదర్ప మడఁప లేరె?
రాజచక్రంబు నెదుర శిరంబు గోయ
నువిదలాగున నీతండ్రి యోర్చెఁ గాక. ౩౬.

అశ్వ—(క్రోధముతో దేహము వడఁకుచుండ) దురాత్మా! రాజవల్లభప్రగల్భ! అసంబద్ధప్రలాప! సూతకులసంభవ!

ఆ. వె. భయము పడియొ దుఃఖభారంబుననొ నాదు
తండ్రి ద్రుపదసుతు నదల్పఁ డయ్యె;
నడిచి పడెదు నిన్ను నొదల నాకడ
కాలఁ దన్ను చుంటిఁ; గాచుకోర. ౩౭.

(అట్లు చేయుటకు లేచుచున్నాఁడు.)

కృపదుర్యోధనులు—గురుపుత్ర! శాంతింపుము శాంతింపుము.

(వారించుచున్నారు.)

అశ్వ—(తన్నుట నభినయించుచున్నాఁడు.)

కర్ణు—(క్రోధముతో లేచి కత్తిదూసి) ఓరిదురాత్మా! బ్రహ్మబంధుఁడా! ఆత్మశ్లాఘీ!

తే. గీ. బ్రాహ్మణుండవు గాఁబట్టి బ్రతికి పోయి
తయిన నీ విప్పు డెత్తినయట్టికాలు
కలుగరవాలమునను నే నఱకి వైతుఁ,
దునిసి పడె నని తలఁచుకో మనసునందు. 38

అశ్వ—ఓరిమూఢుఁడా! నేను బ్రాహ్మణుండను గనుక నా ప్రతికిపోయితిని? ఇదిగోఁ! జూడు నా బ్రాహ్మణ్యమును విడిచిపెట్టినాఁడను. (యజ్ఞోపవీతమును త్రెంచివేసి మరలఁ గ్రోధముతో)

తే. గీ. ఇపుడె మిథ్యాప్రతిజ్ఞఁ గావింతుఁ జూడు
మల్లగాండీవి నీ వింక నడిచి పడిన;
శస్త్రమును దాల్చి రార; రాఁ జాల వేని
క్రింద నస్త్రంబు నిడి మోడ్పుఁగేలు పట్టు. 39

ఇద్దఱును (కత్తులనుదూసి యొండొరుల నఱుకుకొన నుద్యోగించుచున్నారు.)

కృపదుర్యోధనులు—(వారించుచున్నారు.)

దుర్యో—ఆచార్యపుత్ర! ఆయుధము దూయ నేటికి?

కృపు—కర్ణా! సూతపుత్ర! కత్తి యెత్త నేటికి?

అశ్వ—మామా! మామా! నీ వెందు కడ్డగించెదవు? తండ్రిగారిని నిందించుచున్న యీసూతాపసదుఁడును గేవలము ధృష్టద్యుమ్న పక్షపాతి.

కర్ణు—రాజా! నన్ను నీ విప్పుడు వారింపఁ గూడదు.

ఆ. వె. క్రోధ మెంత యున్నఁ గుత్తుక దిగ మ్రింగి,
వీరుఁ డధము నిట్లు వేకు సేయు,
దుర్మదంబు హెచ్చి, తుదకు నీలాగునఁ
బొగడుకొనును దనదుమగతనంబు. 40

అశ్వ—రాజా! వీనిని వదలు వదలు. రానీ. నాభుజములసందున నిటికి సులభముగాఁ దుద ముట్టించెదను. మఱియును గారవేశ్వరా! గురువుగారి నధిక్షేపించినయీదురాత్ముని స్నేహముచేతనో కార్యముచేతనో గాని నాబారివలన రక్షింపఁ గోరుచున్నావు. నీ కివి రెండును వ్యర్థములే. చూడు.

ఆ. వె. ప్రథితగుణుఁడ వీవు, పాపప్రియుఁడు వీఁడు;
విధుకులుండ వీవు, వీఁడు సూతుఁ
డేటిమైత్రి? కూల్చునే వీఁడు నరు? వీడు;
జగ మకర్ణ పార్థ మగును నేఁడు. ౪౧.

(నలుకఁ దలఁచుచున్నాఁడు.)

కర్ణు—(కత్తియెత్తి) ఓరి ప్రేలరీ! బ్రాహ్మణాధమ! ఇదిగో! నీవు చచ్చితివిరా! రాజా! విడువిడు. నన్ను వారింపకు. (చంపఁ దలఁచుచున్నాఁడు.)

కృపదుర్యోధనులు—(అడ్డగించుచున్నారు.)

దుర్యో—కర్ణ! గురుపుత్ర! ఇప్పుడు మీ కీ వెఱ్ఱి యేమి?

కృపు—అబ్బాయీ! ప్రస్తుత మొకటి, నీతొందర మఱి యొకటి. ఇది యేమి వెఱ్ఱి? ఇప్ప డీరాజకులమునకు స్వబలవ్యసనము నీవలననే గలుగుచున్నది. ఇది పెడత్రోవ గాదా?

అశ్వ—మామా! పరుషప్రలాపి యగునీరథకారకులకలంకునిమదము సదమదము సేయుట సంభవింప దయ్యెను.

కృపు—నాయనా! స్వబలప్రధానవిరోధమున కిది సమయము కాదోయి.

అశ్వ—మామా! ఆలాగయిన—

తే. గీ. రణముఖంబున వీఁడు శాత్రవులచేతఁ
జచ్చునందాఁక విడిచితి శస్త్ర మేను;
పార్థభీముల కీదళవాయి జడియ,
నపుడె రారాజు సఖుని న న్నరసికొనును. ౪౨.

(ఖడ్గమును విడుచుచున్నాఁడు.)

కర్ణు—(నవ్వి) నీవంటివాఁ డాయుధమును జేతఁ బట్టుకొన్నను నది చిరకాలము క్రిందనే విడిచిపెట్టినట్టు. ఏమనఁగా వ్యర్థ మగుటవలన.

క. నాకరమునఁ గరవాలము
గైకొని యుండంగ లాఁతిఖడ్గం బేలా?
నాకైదువు దీర్పనిపని
యేకైదువు దీర్పఁ జాలు నిలోకమునన్? ౪౩.

(తెరలో) హా! దురాత్మా! ద్రౌపదీకేశాంబరాకర్షణ! మహాపాతకీ! ధార్తరాష్ట్రాపసదా! చిరకాలమునకు నాయెదురఁ బడితివి గదరా! ఓరి క్షుద్రపశువా! ఇప్పు డెందుఁ బోయెదవురా? ఓరోరి కర్ణ! ఓరి దుర్యోధన! ఓరి శకునీ! ఓరోరి పాండవవిద్వేషులార! ధనుర్ధరు లయినమానధనులు మీ రెల్లరు నాలకింపుఁడు.

ఉ. ఏనృపశేఖరుండు ద్రౌపదిని నేర్తెఱఁ గొప్పును బట్టి యీడ్చెనో,
మానధనుల్ గనుంగొనఁగ మానినిపుట్టము లెవ్వఁ డొల్చెనో,
యేనియురస్స్థలక్షతజ మేఁ జవి చూడఁ బ్రతిజ్ఞ గొంటినో,
యానయహీనుఁ గాచికొనుఁడా; పడె నాభుజపంజరంబునన్. ౪౩.

అందఱు—(ఆకర్ణించుచున్నారు.)

అశ్వ—అంగరాజ! సేనాధిపతీ! జామదగ్న్యశిష్య! ద్రోణాపహాసీ! భుజబలపరిరక్షితసకలలోక!

"క. నాకరమునఁ గరవాలము
గైకొని యుండంగ లాఁతిఖడ్గం బేలా?
నాకైదువు దీర్పనిపని
యేకైదువు దీర్పఁ జాలు నీలోకమునన్?" ౪౪.

అని బీరములు పలికినాఁడవు గదా? సరే. ఇదిగో! దానికిఁ దగినయవసరము వెంటనే సంప్రాప్త మయినది. చూతము. ఇప్పుడు భీమునిబారిఁ బడకుండ దుశ్శాసనుని సంరక్షింపుము.

కర్ణ—ఆ! నేను జీవించియుండఁగా యువరాజునీడ నయినను స్పృశించుటకు వృకోదరుఁడు శక్తుఁ డగునా? యువరాజా! వెఱవకు వెఱవకు. ఇదిగో! నేను వచ్చితిని. (నిష్క్రమించుచున్నాఁడు.)

అశ్వ—రాజా! కౌరవేశ్వరా! భీష్మద్రోణులు లేరు గదా యని భీమార్జునులు విచ్చలవిడిగాఁ గౌరవబలమును గలగుండు పడఁ జేయుచున్నారు. అట్టివారల నీవిధ మయినరాధేయుఁడు గాని గీధేయుఁడు గాని నివారింపఁ జాలఁడు. కాఁబట్టి నీవే పోయి సయిదోడుప్రాణములు సంరక్షించుకొమ్ము.

దుర్యో—ఆయుధహస్తుఁడ నయి నేను జీవించి యుండఁగా, దురాత్ముఁ డైన భీముఁడు గాని గీముఁడు గాని నాతమ్మునినీడ నయినఁ ద్రొక్కఁగలఁడా? తమ్ముఁడా! భయపడకు భయపడకు. ఓరీ యెవఁడురా అక్కడ? రథము రథము.

(నిష్క్రమించుచున్నాఁడు.)

[తెరలోపలఁ గలకలము.]

అశ్వ—(ముందు చూచి) మామా! మామా! అయ్యయ్యో! ఎంతకష్టము! తనయన్నగారిప్రతిజ్ఞ కెక్కడ భంగము గలుగునో యనుభయముతోడ గాండీవి కర్ణదుర్యోధనుల నిద్దఱను దుర్వారమైనశరధారావర్షమున ముంచుచు నెదురుకొనుటకుఁ బదుగెత్తుకొని వచ్చుచున్నాఁడు. హా! హా! యెంతకష్ట మెంతకష్టము!

పాపము! దుశ్శాసనునిరక్తముభీముఁడునిశ్శంకముగాఁ ద్రాగుచున్నాఁడు. అబ్బబ్బా! దుర్యోధనునితమ్మునికి సంభవించెడి యిట్టియాపదను నేను జూచి సహింపఁజాలను. అనృత మయినను సరే. మామా! శస్త్రము శస్త్రము.

ఆ. వె. సూనృతంబుకన్న శుభ మగు ననృతంబె;
నరకమునకె పోదు; నాక మేల?
పవనతనయువలన యువరాజు గావఁగ,
విడిచినను గృపాణి విడువ నేను. ౪౭.

(ఖడ్గము గ్రహింపఁబోవుచున్నాఁడు.)

(తెరలో) మహాత్మా! భారద్వాజతనూజ! ఈవఱకెన్నఁడు నతిక్రమింపని సత్య వాక్యము నిప్పు డేల యతిక్రమించెదవు?

కృపు—అబ్బాయీ! అశరీరవాణి నిన్నసత్యమువలనఁ గాపాడుచున్నది.

అశ్వ—ఏమిది! దైవాజ్ఞయు నాయుద్ధగమనమునకు వ్యతిరిక్తముగానే యున్నది. అన్నన్నా! ఎంతపాపము! దేవతలుగూడఁ బాండవపక్షపాతులయి ప్రవర్తించుచున్నారే. ఆహా! భీముఁడు దుశ్శాసనునిరక్తము సర్వథా గ్రోలుచున్నాఁడు.

ఆ. వె. దుస్ససేనుపేరురస్సు భీముఁడు వ్రచ్చి
రుధిరపూర మిట్లు గ్రోలుచుండ,
నూర కుంటి, నింక యుద్ధంబులోఁ బ్రియ
మేమి గూర్తుఁ గౌరవేశ్వరునకు? ౪౮.

మామా! కర్ణునిమీఁదికోపమున నే ననార్య మయినకార్యమును జేసితిని. నీవైన రారాజునకుఁ దోడుపడుము.

కృపు—ఈవిషయమున నేను బోయి ప్రతీకారము జేసెదను. నీవు శిబిరమునకుఁ బోయి యుండుము. (నిష్క్రమించిరి.)

గద్యము. ఇది శ్రీపరమేశ్వరవరప్రసాదలబ్ధసరసకవితాధురంధర వడ్డాది
సాధువంశక్షీరనీరాకరరాకాసుధాకరార్చనామాత్యపౌత్ర హరి
తసగోత్రపవిత్రమగుణకదంబలక్ష్మాంబాగర్భశుక్తిముక్తాఫల
సూరపరాజప్రధానతనూభవ విబుధవిధేయ సుబ్బ
రాయనామధేయాంధ్రీకృత వేణీసంహార
నాటకంబునందు ద్వితీయాంకము.

శ్రీరస్తు.

శ్రీపరమాత్మనేనమః.

వేణీసంహారనాటకము.

చతుర్థాంకము.

[తరువాతఁ బ్రహారమూర్ఛితుండును రథస్థుండు నగుదుర్యోధనుని యుద్ధరంగమునకుఁ దొలఁగించుచు సూతుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

సూతు—(తొందరగాఁ బోవుచున్నాఁడు.)

(తెరలో) కౌరవపక్షపాతమునఁ బ్రాణధనంబులు పిడికిలించుకొని భుజబలదర్పమున మహాసమరదోహలు లయి తిరుగుచున్న యోధాజన్యులారా! మీరు పాఱిపోక ధైర్యము తెచ్చుకొని నిలువఁబడుఁడు. దుశ్శాసనునివక్షస్స్థలమును ప్రక్కలించి త్రాఁగఁగా మిగిలినరక్తమును, స్నానము చేసినట్టు శరీర మంతటఁ బూసికొని, భీమసేనుఁడు మహాబీభత్సవేషముతో నుండుట విలోకించి, సేన లన్నియు విషాదమునఁ దమతమయాయుధములను విడిచిపెట్టి తిరిగిచూడక పలాయనము నొందుచున్నవి.

సూతు—(చూచి) ఆహా! ఇదిగో! గాలిచేఁ గదలుధవళచామరము హేమక మండలువు దాఁక, మనుజమాతంగతురంగసంఘంబులకళేబరంబులచేత మిట్టపల్లంబుగా నున్నపొలికలనఁ బఱపు చుండుటం జేసి గణగణ యని చిఱుగంటలు మొరయుచుండఁ, గొట్టకొనను బంధించిన బెడఁగుపడగ యడియాలంబుగాఁ గ్రాలుచున్నయరద మెక్కి, పరబలపరాక్రమప్రసరంబును శరవర్షమున నడచివేయుచుఁ గృపాచార్యుండు మాసేనల కూఁటగా నతిత్వరితముగాఁ బోయి, యర్జునునితో నెక్కటికయ్యంబు సేయుచున్నరాధేయునకుఁ దోడుపడియె. అమ్మయ్య! ఇప్పటిమట్టునకు మాబలములకుఁ గొంతయాధారము గలిగినది.

[తెరలోఁ గలకలానంతరము]

భీము—ఓహో! కౌరవచమూయోధులార! ఓహో! పాండవవరూథినీయోధులార! నన్నుఁ జూచిన భయంబున ధనువులు, ఖడ్గములు, శక్తులుఁ,

దోమరములం, గ్రింద జాఱ విడిచి పాఱిపోయెద రేల? వెఱపకు వెఱవకుఁడు. నేను మఱి యెవ్వఁడను గాను. దుశ్శాసనునిగుండెలు బద్దలుచేసి త్రాగినరుధిరాసవంబున మత్తిల్లి, కించిదవశిష్టప్రతిజ్ఞామహోత్సవంబునకుఁ దత్తఱపడుచున్న పార్థమధ్యముఁడను, భీమసేనుండను, దుర్యోధనద్యూతనిర్జితదాసుండను. వినుండు. మీ రందఱు సాక్షులు.

ఉ. మానధనుండు కార్ముకసమంచితుఁడై కురురాజు సూడ, నా
ఆనిసఖుండు కర్ణుఁడు మఱిం గురుబంధులు శల్యుఁడుం గనన్,
శానము చేసినా రిపుడె పాండువధూకచవస్త్రకర్షణున్
బ్రాణము లుండ గోళ్ళ నెద వ్రచ్చి కవోష్ణపుఁ బచ్చినెత్తుటిన్. ౧౦.

సూతు—(విని భయముతో) అరే! కౌరవరాజకుమారమహారణ్యమున సుత్పాతమారుతుఁ డయినదురాత్ముఁడు భీముఁ డిదిగో! సమీపించుచున్నాఁడు. ఈరాజు మూర్ఛదేఱునంతకును దేరు దూరముగాఁ దోలుకొని పోయి నిలిపెదను. ఒకవేళ దుశ్శాసనునెడఁ బోలె నితనియెడఁ గూడ నీక్రూరుఁడు దుర్మార్గము చేయు నేమో? (త్వరితముగాఁ బోయి చూచి) ఆహా! ఈచెఱువులోనితామరపువ్వులమీఁదనుండి పరిమళముతో వీచెడుచల్లగాలిచేతఁ బల్లవంబులు గదల నుల్లసిల్లుచున్న దిదిగోఁ బెద్దమఱ్ఱిచెట్టు! యుద్ధవ్యాపారముచేత శరీరము సొలసినవీరపురుషున కిది విశ్రమింపఁ దగినపట్టు గదా? ఇక్కడ సప్రయత్నోపవీజితతాలవృంతశీతలంబును హరిచందనచ్ఛటాశీతలంబును సహజపరిమళమిళితంబును నయి ప్రాణము లేచి వచ్చునట్లు వీచుచున్నయీతమ్మికొలనిమీఁది చల్లగాలి మేను సోఁకుటచేత నీమహారాజు మూర్ఛ దేఱును. శత్రువుచేతఁ గేతనము నఱికివేయఁబడినది గావున నీరథమును నిర్నిరోధముగాఁ జెట్టుక్రిందికిఁ బోఁగలను. (అక్కడఁ బ్రవేశించి) ఎవ రక్కడ? (పాఱఁ జూచి) ఏఁడీ? సేవకుఁ డొక్కఁడును లేఁడు. ఆవిధముగా నున్నభీమసేనునిఁ జూచియు, నీవిధముగా నున్నమహారాజును జూచియు, వాం డ్రందఱు నిశ్చయముగా శిబిరమునకే పాఱిపోయిరి. ఆహా! ఎంతకష్టము!

చ. దొరఁకొని సింధురాజుతలఁ ద్రుంచెఁ గిరీటి గురుండు గాచినన్;
హరిణమునట్లు చీరె నిపు డక్కట! భీముఁడు దుస్ససేను; దు
ష్కరపుఁ బ్రతిజ్ఞలున్ సులువుగాఁ బగవారికి నెగ్గఁ జేసెదున్;
గురుకులమందు నింక విధి క్రూరతఁ బాయుఁడ యంచు నెంచెదన్. ౧౧.

(రాజును జూచి) ఏమిది! మహారాజిప్పటికిని దెప్పిఱిల కున్నాఁడు! అయ్యో! ఎంతకష్టము! (నిట్టూర్పు విడిచి)

తే. గీ. మదపుటేనిక యన్నికొమ్మలను విఱువఁ
జీవర శోకకొమ్మతో నున్న చెట్టు ప్రాలెఁ
గౌరవు లందఱుఁ దెగినయీకులమునందు
దైవకృప నీవె మిగిలితి తప్పి దారి. ౩.

హా! హతవిధీ! భరతకులవిముఖ!

తే. గీ. చెక్కు చెదరక పెనుగద చేతఁ బూని
సందియం బించుకంతయుఁ బొంద కున్న
పవనతనయునియాక్రోశప్రతిన గూడ
నీబలంబున నెఱవేఱు నిశ్చయంబు. ౪.

దుర్యో— (తెలివి వచ్చి ధీరముగా) ఆ! దుర్యోధనుఁడను నేను జీవించి యుండఁగా దురాత్ముఁ డయినపవనతనయునిప్రతిజ్ఞ యెట్లు నెఱవేఱును? తమ్ముఁడా! దుశ్శాసనా! జడియకు జడియకు. ఇదిగో! నేను వచ్చితిని. సూతుఁడా! దుశ్శాసనుఁ డున్నయెడకు రథముఁ బోనిమ్ము.

సూత— ఆయుష్మంతుఁడా! గుఱ్ఱములు రథమును వహింప లేవు. (వెనుకఁ దిరిగి) నీమనోరథమును మేమును.

దుర్యో— (రథమునుండి దిగి గర్వముతో) ఈరథగమనాలస్యముతో నేమి?

సూత— (తెల్లఁబోయి సకరుణముగా) దేవా! శాంతింపుము శాంతింపుము.

దుర్యో— ఇస్సిరో! సూతుఁడా! రథం బేటికి? నేను కేవల మరాతిసమర్ద సంఘట్టసంచారి నగుదుర్యోధనుండను గదా! గదామాత్రసహాయుఁడ నయి యుద్ధరంగమునఁ బ్రవేశించెదను.

సూత— దేవా! అది నిజమే. ఏమి సందేహము!

దుర్యో— ఆలాగయిన నీ విట్లు పలికెద వేమి? చూడుము.

తే. గీ. ప్రకృతిదుర్లలితుం డగుబాలు ననుజుఁ
బాపి హింసింపఁ గాంచి, యాపనికిఁ బోవు
నన్ను వారణ సేయుచున్నావు; నీకు
లేదొ క్రోధంబు? దయ లేదొ? లేదొ సిగ్గు? ౫.

సూత— (దుఃఖముతోఁ గాళ్ళమీఁదఁ బడి) దేవా! ఇంతకు నాపాపపువృకోదరుండు సంపూర్ణప్రతిజ్ఞుం డయి పోయి యుండును గాన యెట్లు విన్నవించెదను.

దుర్యో—(వెంటనే భూమిపయిఁబడి) హా! తమ్ముఁడా! దుశ్శాసన! హా! మదాజ్ఞావిరోధితపాండవ! హా! విక్రమైకరస! హా! మదంకదుర్లలిత! హా! విద్విషత్ప్రికరమదద్విరదకంఠీరవ! హా! యువరాజ! పలుకవేమి? (నిట్టూర్పువిడిచి)

ఉ. ఒప్పెడునాదుప్రోవునకు యోగ్యుఁడ వైనను భోగసౌఖ్య మొ
క్కప్పుడు నే ఘటింపను వృథాగ్రజుఁడం గద నీకుఁ దమ్ముఁడా!
యిప్పుడు సంభవం బయినయీపెనుముప్పున కేన కారణం
బప్పుడు పంచినా నవినయంబునకుఁ నినుఁ, గావ నియ్యెడన్. ఉ.

(మూర్ఛిల్లుచున్నాఁడు.)

సూతు—రాజా! ఊఱడిల్లు మూఱడిల్లుము.

దుర్యో—(తెలివి వచ్చి) ఇసీ! సూత! ఏమి పని చేసితివి?

తే. గీ. దుష్టమృగమున కెర యిచ్చి తొలఁగి నట్లు
బాలు నాజ్ఞానువర్తిఁ గావంగఁ దగిన
యనుజు దుశ్శాసనుని నరి కప్పగించి
కటకటా! నాదుప్రాణము గాచికొంటి. తే.

సూతు—మహారాజ! మర్మభేదు లయినయలుఁగులచేతను శక్తితోమర ప్రాసాదులచేతను మహారథు లందఱుఁ దెలివి దప్పి పడి పోవుటవలనను, దేవరయుఁ జేష్టలు దక్కి వ్రాలుటవలనను రథ మిట్లు మరలించితిని.

దుర్యో—సూతుఁడా! ఎంతవిరుద్ధము చేసితివి?

క. ఆపాండవపశువుగడా
వ్యాపారపుధ్వనులఁ దెలివి నందమి గల్గెన్;
బాపని నెత్తుటి సెజ్జను
నాపాపియొ నేనొ యొఱఁగమా? యది తప్పెన్. క.

నిట్టూర్పు విడిచి యాకాశముచూచి) హా? హతవిధీ! కృపావిరహిత! భరతకులవిముఖ!

తే. గీ. చంపుకొని పొమ్మ న న్నెటో సరగ నీవె
పాపవృకోదరుని బారిఁ బడఁగ నొల్ల;

సూతు—హరి! హరీ! ఏ మిది మహారాజా!

దుర్యో—సకల మగుబంధువర్గంబుఁ జంపుకొన్న
భ్రష్టునకు నాకు జయ మేల? రాజ్య మేల? తే.

(సప్రహారుం డయి యొకపురుషుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

పురు—అయ్యా! సారథిద్వితీయుండగు దుర్యోధనమహారాజు నిచ్చోట మీరు చూచినారా? ఏ మిది! ఒక్కఁడును మాటలాడఁడు! కానీ. ఇదిగోఁ బరికరములను ధరించినకొందఱుపురుషు లక్కడ గుంపుగా నగపడుచున్నారు. అక్కడకుఁ బోయి యడిగెదను. (చూచి) ఏ మది! వా రందఱు గాఢముగా దెబ్బలు దగిలినతమతమహృదయమునఁ జిక్కుకొన్నఘనసన్నాహజాలదుర్భేద్యముఖంబు లయినశిలీముఖంబులను గంకముఖంబులతోడ మెలపునఁ బుచ్చుచున్నారు; కాఁబట్టి వీరి కాగొడవ తెలియదు. పోనీ. మఱియొకచోటఁ గనుఁగొనియెదను. ఇదిగోఁ గొందఱు వీరపురుషు లిక్కడఁ జేరియున్నారు. ఇయ్యెడకుఁ బోయి యడిగెదను. (చేరి) అయ్యలారా! కురునాథుఁ డెం దున్నాఁడో యెఱుఁగుదురా? ఏమిది! వీరు నన్నుఁ జూచి పెద్దపెట్టున నేడ్చుచున్నారు! (చూచి) వీరికిని దెలియదు. ఆహా! ఇక్కడ నెంతదుష్కరము జరుగుచున్నది! ఇదిగో నీ వీరమాత తనకుమారుఁడు యుద్ధములోఁ జనిపోవుట నాలకించి, రక్తాంబరధారిణియు సమగ్రభూషణయు నయినతనకోడలితోఁ గూడఁ జిచ్చుఱుకుచున్నది. (సశ్లాఘముగా) బాగు! వీరమాతా! బాగు! నీ వింకొక్కజన్మమునఁ బుత్రశోకము లేనిదాన వయ్యెదవు. కానీ. వేఱొకచోట నరసెదను. (మఱియొకవైపు చూచి) ఇదిగోఁ గాయములనిండ గాయములు పడినను, వానికిఁ జికిత్స చేసికొనక యీ జోదులు, వట్టిపల్లముతో నిలిచి యున్న యీగుఱ్ఱమును జూచి యేడ్చుచున్నారు. దీని నారోహించి యుద్ధమునకుఁ బోయిన వీరి యేలిక చచ్చియుండును. ఇది నిశ్చయము. కాఁబట్టి వీరికి నెఱుక లేదు. పోనీ. కొండొకయెడకుఁ బోయి విచారించెదను. (పాఱ జూచి) ఏమిది! సర్వజనులును దమతమయవస్థకుఁ దగినదుఃఖము ననుభవించుచు నదృష్టహీను లై తిరుగులాడుచున్నారు. ఇం కెవని నడుగుదును? ఎవని నిందింతును? పోనీ. నేనే విచారించుకొనెదను. (నడిచి) కానీ. దైవమును నిందించెదను. ఓహో! దైవమా! పదునొకం డక్షోహిణులసేనలకు నధినాథుఁడు, నూఱుగురు సోదరులకు నన్నగారు, భీష్మద్రోణకర్ణాశ్వత్థామశల్యకృపకృతవర్మప్రముఖు లయినదొరలకును దక్కిన రాజచక్రంబునకును నియామకుఁడు, సకలపృథివీమండలమునకు నిరంకుశప్రభుఁడు, నయినదుర్యోధనమహారాజు నిప్పుడు వెదకించుచున్నావు. అతఁ డెచ్చట నుండెనో తెలియఁ జాలకున్నాను. (ఆలోచించి నిట్టూర్పువిడిచి) దైవమును దూఱ నేల! ఇది యంతయు దీనివికృతియే కదా! విదురనీతినిరాకరణబీజంబును, భీష్మహితోపదేశతిరస్కారాంకురంబును, శకునిమాతకప్రోత్సాహనాదినిరూఢమూలంబును, జిర[illegible]

ద్ధవైరాలవాలంబును, నగులాక్షాగృహద్యూతవిషవృక్షంబు ద్రౌపదీకేశాంబరాకర్షణమిషంబునఁ బుష్పపూచి, తుద కీచందంబున ఫలించినది. (బండువలను చూచి) ఇదిగో! వివిధరత్నప్రభామిశ్రితం బయి తరణికిరణవారంబునుం బోలె దిగంతముల నింద్రచాపములను బుట్టించుచు నొకయరదంబు ఖండితధ్వజవేణుదండం బయి కానంబడుచున్నది. దీనిం బట్టి నిశ్చయముగా దుర్యోధనమహారాజక్రీడ విశ్రమించి యుండు నని నేను దలంచెదను. (పోయి చూచి) జయము జయము మహారాజా!

సూతు—(చూచి) దేవా! సమరములోనుండి సుందరకుఁడు వచ్చినాఁడు.

దుర్యో—(చూచి) ఓరీ! సుందరకా! అంగరాజునకు గుశలమే గదా?

సుంద—దేవా! కేవలశరీరమాత్రంబున.

దుర్యో—(తొందరగా) సుందరకా! ఏమి! అర్జునుఁ డతనిగుఱ్ఱములను జంపెనా? సారథిని వధించెనా? రథమును భగ్నము చేసెనా?

సుంద—దేవా! అతనిరథము నేకాదు మనోరథమునుగూడ భగ్నము చేసెను.

దుర్యో—(రోషముతో) ఓరీ! ఏమిరా యిది? ఉరిసినపుండుల నుప్పువెట్టి నట్టు లీవఱకే వ్యాకులపడుచున్న నామనస్సును నీసందిగ్ధపుమాటలచేత మఱింత వ్యాకులపఱుచుచున్నావు. అదేమో స్పష్టముగాఁ జెప్పఁగదరా!

సుంద—అయ్యా! చిత్తము, దేవరవారిముకుటమణిప్రభావముచేత నాగాయములవేదన యుపశమిల్లినది. (గర్వముతో నడిచి) దేవా చిత్తగింపుఁడు. ఇదిగో! దుశ్శాసనకుమారునివధ—

(ఇట్లు సగము చెప్పి నోరుమూసికొనుచున్నాఁడు.)

సూతు—సుందరకా! చెప్పు చెప్పు. అది రాజుగారీవఱకే విన్నారు.

దుర్యో—సుందరకా! చెప్పుము. అది విన్నాము.

సుంద—దేవా! చిత్తగింపుఁడు. ఇదిగో దుశ్శాసనకుమారునివధ నిరీక్షించి, క్రోధావేశంబునఁ బ్రభువరేణ్యుం డయినకర్ణుండు భీషణమ్ముగా నెమ్మొగమ్మునఁ గనుబొమ్మలు ముడివయిచి, హుమ్మని యతిలాఘవమ్మున సంధానమోక్షణమ్ములు తెలియ నలవి గాకుండ నఖండబాణవర్షము గురియించుచు దురాచారుం డగు నాభీమసేనహతకుని నెదురుకొనెను.

ఇద్దఱు—తరువాతఁ దరువాత?

సుంద—అనంతర మోదేవా! ఇరుపీడులందును గ్రందుకొనుచున్న కరితురగపదాతిసముదయంబులపదఘట్టనల నెగసినధూళిపరాగంబుచేతను, నటునిటు

పడగొండలవలెఁ దిరుగులాడెడు వేదండతండముల చేతను, సంభవించి కాఱుగ్రమ్మిన చిమ్మచీఁకటికతమ్మున నుభయబలమ్ములు నంధీభూతంబు లయి భూతలంబును జూడ లేక పోయెను.

ఇద్దఱు—తరువాతఁ దరువాత?

సుంద—తరువాత నోస్వామీ! ఆకర్ణాంతము పూర్ణముగా నారి నాకర్షించి విడుచుటవలనఁ గలిగినభీషణధనుష్టంకారంబులు, ప్రళయధారాధరగంభీరగర్జారవానుకారంబు లయి, శ్రవణపుటంబులు వ్రక్కలించు చుండెను.

దుర్యో—తరువాత?

సుంద—తరువాత నోమహాప్రభూ! వారిరువురకును బ్రవర్తిల్లినదారుణరణంబునఁ బరస్పరసింహనాదంబు లనియెడునుఱుములును, నన్యోన్యపరిముక్తవివిధాయుధసంఘట్టనంబున మండెడుమయిమఱువు లనియెడుమెఱుములును, బహుళరుధిరబిందువు లనియెడుఖద్యోతబృందములును గలిగి, నిరంతరస్తనితధనుర్జలధరప్రసృతశరధారావర్షంబున దుర్దర్శనం బయి, దుర్దినంబు సంభూతం బయ్యె.

దుర్యో—తరువాత?

సుంద—పిమ్మట నోదేవా! ఇంతలోఁ దనయన్నగారికిఁ బరాభవ మగు నని భీతి యొత్తి, వజ్రనిర్ఘాతనిర్ఘోషసదృశం బగుచక్రనేమిసంఘట్టనధ్వానంబు ఘోటకహేషారవంబుల నినుమడింప, శిఖరావబద్ధకపిధ్వజప్రభలు కన్నుల మిఱుమిట్లు గొలుప, శంఖచక్రగదాఖడ్గలాంఛితచతుర్భుజుం డగుకృష్ణుండు యుగ్యంబులపగ్గంబులు సడల విడిచి నొగలపయిం గూరుచుండఁ, బిట్టపిడుగులుం బోలె బిట్టొత్తిన పాంచజన్యదేవదత్తంబులపెద్దయులివు దిఙ్మండలంబు చెవుడు పఱుపఁ, జూపఱకు భీతికొలిపెడుతనయరదంబును బరు వెత్తించుకొని కడురయంబునఁ గిరీటి యుటకుఁ జనుదెంచె.

దుర్యో—తరువాతఁ దరువాత?

సుంద—దేవా! అటుతరువాత నీవిధమున భీమార్జును లిద్దఱును దనతండ్రిని దాఁకుట యాలోకించి, తత్తఱపాటుతోఁ దలనుండి జాఱినరతనాలకుళ్ళాయి నైన గణియింపక, చెవియంట వింటినారిని దివిచి, లఘ్యలాఘవంబులు దీపింపఁ బుంఖానుపుంఖంబులుగాఁ బఱపి, యంపవానల నరిబలంబుల ముంచివేయుచుఁ, బదపదమని సారథిని దొరపెట్టుచుఁ, దత్క్షణంబ వృషసేనకుమారుండచ్చోటికి విచ్చేసెను.

దుర్యో—(గర్వముతో) తరువాతఁ దరువాత?

సుంద—తరువాత దేవా! అట్లు వచ్చి వెంటనే యా వృషసేనకుమారుండు, సూదినకాటుకతీరున నునుపుదేరి నిగనిగ లాడుచుండెడుపుంఖములయందు సొగసుగా గ్రద్దఱెక్కలు బిగియించి కట్టి క్రొత్తగా సానఁబట్టిన మెఱుఁగారు వెడఁదవాతి దొడ్డనారసంబులు గుప్పఁగూరలుగాఁ బఱపి, ముహూర్తమాత్రములో నాకవ్వాడి యరదంబును బువ్వులు పూచిన చెట్టులాగున నలుఁగులతోఁ గప్పివేసెను.

ఇద్దఱు—(సంతోషముతో) తరువాతఁ దరువాత?

సుంద—అటుపిమ్మట దేవా! అయ్యర్జునుండు తీవ్రముగా బల్లెములవంటి వాఁడికోలలు వేనవేలు పఱపి చిఱునవ్వు నవ్వి యతని కిట్లనియె. ఓరోరి వృషసేన! నీతండ్రియట్టివాఁడే నాయెదుర దురమున నిలువ లేక యున్నాఁడు. నీ వెంతరా పిల్లవాఁడవు? వేఱొకయెడ కేగి నీయీడుకుమారులతోఁ బోరు సలుపుము. అనవుడు నా నుడువు లాలించి, తనజనకుని నధిక్షేపించినాఁ డనుకోపంబున మొగ మంతయుఁ జేవురింప, బొమ్మముడితో హుమ్మని యవ్వుడు కఱచి, వృషసేనకుమారుండు గాండీవికి నాకర్ణాకృష్టముక్తంబు లయి మర్మంబులు భేదించుతీవ్రనారాచపరంపరలఁ బ్రత్యుత్తరం బిచ్చెఁ గాని పరుషవచనంబుల నీయఁ డయ్యె.

దుర్యో—వహవా! వృషసేనుఁడా! వహవా! తరువాతఁ దరువాత?

సుంద—దేవా! అనంతరము శాతశరాభిఘాతవేదనాప్రభూతక్రోధాతిరేకుండును, శరవర్షతిరోహితుండును నగునయ్యర్జునుండు గాండీవజ్యాశబ్దనిర్జితగర్జితారవుం డయి యెల్లవారు ఱిచ్చ వడునట్లు తనయస్త్రశిక్షాపాండిత్యంబునకు, బాహుబలంబునకు ననురూపం బయినవ్యాపారము చేయఁ జాగెను.

దుర్యో—(అభిప్రాయగర్భముగా) తరువాతఁ దరువాత?

సుంద—మహాప్రభూ! అటుపిమ్మట నట్లు మహాశ్చర్యంబుగా సమరచాతుర్యంబును జూపుచున్న తనశత్రువును జూచి వృషసేనకుమారుండును దూణీరమునఁ బాణి యుంచుటయు, నారి తివియుటయు, నలుఁగు దొడుఁగుటయు, నేయుటయు సహస్రాక్షున కయినఁ దెలియ నలవి గాకుండ నతివిచిత్రంబుగాఁ దనకరలాఘవశరలాఘవంబులు సూపఁ దొడఁగెను.

దుర్యో—తరువాతఁ దరువాత?

సుంద—స్వామీ! అనంతర మేమి చెప్పుదు? అప్పు డెల్లవారును దమతమయుద్ధంబులు నిలిపివేసి, చిరకాలమునుండి మనంబుల రగులుకొనుచున్న క్రోధానలంబును జల్లార్చుకొని యాయుభయవీరులు నేయువిచిత్రసమరంబును

మహాశ్చర్యంబుతోఁ జూచుచుండి యిరువాగువారు నొక్కమాఱుగా "వృషసేనుఁడా! బళి! బళి!" యని మిన్ను ముట్ట మహాకలకలంబు గావించిరి.

దుర్యో—(ఆశ్చర్యముతో) తరువాతఁ దరువాత?

సుంద—తరువాత దేవా! ఇట్లు మేటివిలుకాండ్ర నందఱ నతిక్రమించి తనకుమారుఁడు బాహుపరాక్రమంబు చూపుచుండుటఁజేసి స్వామి యైనకర్ణుండు హర్షరోషకరుణాశంకాసంకులమానసుం డయి భీమసేనునిపయి సహస్రంబులు తూపులును వృషసేనునిపై సాస్రంబులు చూపులును బ్రసరింపఁ జేయుచుండెను.

దుర్యో—(భయముతో) తరువాతఁ దరువాత?

సుంద—దేవా! తరువాత నట్లావృషసేనకుమారుని నిరువిడులవారును బళిబళి యని ప్రశంసించుటచేత గాండీవి మండిపడి మెఱుఁగులు గ్రక్కుచున్న కఱకుటమ్ముల నొక్కుమ్మడి నక్కుమారుని తేరిమీఁదను, సారథిమీఁదను, గుఱ్ఱములమీఁదను, వింటిమీఁదను, నారిమీఁదను, రాజలాంఛన మగు వెల్లగొడుగుమీఁదను వీరావేశంబున వర్షధారలవలె లెక్కలేక కురియించెను.

దుర్యో—(భయముతో) తరువాతఁ దరువాత?

సుంద—దేవా! తరువాత వృషసేనకుమారుండు భగ్నరథుండు ఖండితకోదండుండు నయి గుబాలున భూతలంబునకు లంఘించి తనశత్రువు ప్రయోగించెడు వాలుటమ్ములను జక్రమువోలె గిఱ్ఱునఁ దిరిగి తప్పించుకొనుచుండెను.

దుర్యో—(అడలుతో) తరువాతఁ దరువాత?

సుంద—అటుపిమ్మట దేవా! తననందనునిస్స్యందనము చక్కుచేసె నను నక్కసునఁ బ్రభు వైనకర్ణుండు భీమసేనునితాఁకుఁడు నొకగణన సేయక వాఁడిసాయకంబుల నర్జునునిపయి నిగిడింపఁ జాగెను. ఇంతలోఁ దనపరిజనుండు కొని వచ్చిన వేఱొకతేరి నారోహించి వృషసేనకుమారుండు వెండియు గాండివినే తలపడి యోరోరి మదీయజనకాధిక్షేపవాచాట! మధ్యమపాండవా! నాశరంబులు నీశరీరంబును విడిచిపెట్టి వేఱొకయెడకుఁ బోవ నిష్టపడకున్నవి. ఇదిగోఁ! గాచుకొమ్మని వేనవేలు వాలుటమ్ము లతనినెమ్మేను గ్రమ్ముకొనం బ్రయోగించియుఁ ముఱిమినట్లు పెద్దసింహనాదంబు గావించెను,

దుర్యో—(విస్మయముతో) ఔరా! ఆఱితేఱినవాఁడు గాకపోయినను గుఱ్ఱవాఁ డెంతపరాక్రమము జూపెను! తరువాతఁ దరువాత?

సుంద—పిమ్మట దేవా! ధనంజయుండు తనమీఁదకు వచ్చు బాణముల నెల్ల నింత లింతలు చిదురుపలు గావించి రోషావేశంబునఁ గనత్కనకకింకిణీజాలఝుంకారవిరావిణియు, మేఘావరోధవిముక్తనభోమండలనిర్మలాకారిణియు, నిశితశ్యామలస్నిగ్ధముఖియు, వివిధరత్నప్రభాభాసురభీషణస్వరూపిణియు, రమణీయదర్శనయు, నయి తనయరదంబునఁ బ్రజ్వలించుచున్న శక్తి నట్టి యంది పుచ్చుకొని నవ్వుచు నక్కుమారున కభిముఖముగా విడిచిపెట్టెను.

దుర్యో—(విషాదముతో) అయ్యయ్యో! తరువాతఁ దరువాత

సుంద—అటుపిమ్మట దేవా! నింగి యంతయు మ్రింగివేయునట్లు - భగ్గుభగ్గున మండుచుఁ గుమారుని దెసకు వచ్చుచున్న యాశక్తిని జూచినతోడనే స్వామి యయినకర్ణునికిఁ జేతినుండి ధనుర్బాణంబులును, హృదయంబునుండి వీరసులభోత్సాహంబును, గన్నులనుండి బాష్పబిందుసందోహంబును, వదనంబునుండి వికాసంబును నొక్కమాఱుగా జాఱిపోయెను. అర్జునుండు హసించెను. భీమసేనుండు సింహనాదంబు చేసెను. అతిదారుణ మతిదుష్కర మని మనబలంబులు హాహాకార మొనరించెను.

దుర్యో—(విచారముతో) తరువాతఁ దరువాత?

సుంద—అటుపిమ్మట నోస్వామీ! వృషసేనకుమారుఁడు దానికి లేశమైన భయం బొందక వాఁడి యయినయొకయర్ధచంద్రబాణమును వింటఁ దొడిగి గుఱి పెట్టి చెవి యంట గొనయంబు లాగి యాశక్తికి సూటిగా దానిని విడిచిపెట్టిన ఫాలాక్షునిచేత భాగీరథియుంబోలె మధ్యభాగముననే యది ముత్తునియగాఁ జేయఁబడియె.

దుర్యో—సెబాసు! వృషసేనుఁడా! సెబాసు! తరువాతఁ దరువాత?

సుంద—తరువాత నోదేవా! హల్లకల్లోలం బగుసముద్రంబులాగునఁ గోలాహలంబు గావించెడువీరవారంబులసాధువాదంబులకతంబునఁ దూర్యారావంబులు వినంబడ వయ్యెను. అంతరిక్షమున వీక్షించెడుగరుడగంధర్వసిద్ధసాధ్యాది వియచ్చరులు గురిసినపుష్పవర్షంబున సమరాంగణంబు సంఛన్నం బయ్యె.

దుర్యో—ఆహా! బాలకునిపరాక్రమము! తరువాతఁ దరువాత?

సుంద—తరువాత దేవా! సామి యయినకర్ణుం డివ్విధంబునం బలికెఁ. ఓవృకోదరా! నీకు నాకును యుద్ధ మింకను ముగియ లేదు; అయినను ముహూర్తమాత్రము నన్ననుమతింపుము. కొంచెము సేపు నాకుమారునియు నీతమ్మునియు ధనుర్వేదశిక్షానైపుణ్యము చూడ వేడుక పొడముచున్నది. ఇది నీవును జూడఁ

దగినదే గదా? అని కర్ణుండును భీమసేనుండును రణవ్యాపారనిర్బంధమునుండి విముక్తులయి, ముహూర్తమాత్రము పరస్పరవైరముల నణఁచివేసికొని, వృషసేనధనంజయులు సలుపుద్వంద్వయుద్ధంబు నిరీక్షించుచుండిరి.

దుర్యో—(సాభిప్రాయముగా) తరువాతఁ దరువాత?

సుంద—తరువాత దేవా! శక్తిని ఖండించినాఁడనురోసమున నాసమయమున గాండీవి యిట్లనియె; ఓరోరిదుర్యోధనాది—(సగము చెప్పి సిగ్గుపడుచున్నాఁడు.)

దుర్యో—సుందరకా! చెప్పుము. అది పరుఁ డన్నమాట గదా!

సుంద—దేవా! యవధారు. ఓరోరిదుర్యోధనాదికౌరవసేనాప్రభువులారా! ఓరియవినయార్ణవకర్ణధార! కర్ణ! మీరు నేను దగ్గఱ లేనియప్పుడు నాకొడుకు నభిమన్యుని నధర్మముగా నేకాకిని జేసి, చంపితిరి గదా! ఇదిగో నేను మీ రందఱుం జూచుచుండఁగా ధర్మయుద్ధమున నీవృషసేనకుమారుని నామైకశేషునిఁ గావించెదను. అనిపలికి దర్పాతిరేకంబున నిర్ఘాతఘోషభీషణమౌర్వీచండనాదంబగుగాండీవంబు సారించిన సామ్మియైనకర్ణుండును గాలపృష్ఠంబగునిజకార్ముకంబు నెక్కు వెట్టె.

దుర్యో—(సావహిత్థముగా) తరువాతఁ దరువాత?

సుంద—తరువాతనో దేవా! కర్ణునితో వెండియు యుద్ధంబు సేయఁబూనెడు భీమసేనుని వారించి, యర్జునుండు తానొక్కరుండ కర్ణవృషసేనుల తేరులనెడు కూలముల నొరసికొనునట్లు బాణౌఘద్వయంబును బ్రవహింపఁ జేసెను. అంత వారిరువురును బరస్పరస్నేహంబునఁ దమధనుర్విద్యాపాండిత్యవిశేషంబును జూపుచు నయ్యర్జునుం దలపడిరి.

దుర్యో—తరువాతఁ దరువాత?

సుంద—తరువాత నేమి చెప్పుదు దేవా! పాండవమధ్యముండు చండగాండీవమౌర్వీనిర్ఘోషమాత్రవిజ్ఞాతం బగుశరవర్షంబు నమర్షంబునఁ గురియించుచు, దానికతన భూమియు నాకసంబును, గర్ణుండుఁ గుమారుండును, వారువంబులు వీరవారంబును, దేరును సారథియును, గేతనంబు నాతపత్రంబును, దిక్కులు గిక్కులును గన్నుల కగోచరంబు లయ్యె.

దుర్యో—(విస్మయముతో) తరువాతఁ దరువాత?

సుంద—దేవా! పిమ్మట నొకక్షణమాత్రములో సాయంపవాన వెలిసెను. అంతలోఁ బాండవసైన్యంబునందు హర్షముతోఁ బెద్దసింహనాదంబులును గౌరవసైన్యంబున వృషసేనుఁడు చచ్చెఁజచ్చెననుహాహాకారంబులును నొక్కపెట్ట నెగసెను.

దుర్యో—(సబాష్పరోషుండయి) తరువాతఁ దరువాత?

సుంద—తరువాత దేవా! హతసారథితురంగముండును, ఖండితచ్ఛత్రచామరచాపకేతనుండును నయి హృదయమర్మభేదక మ్మగునొకవాలుటమ్మున మేను వ్రీలి స్వర్గభ్రష్టుం డయినసురకుమారుండునుం బోలెఁ దేరిమీఁదఁ బడియున్న యావృషసేనకుమారునిఁ జూచి వచ్చితిని.

దుర్యో—అహహా! వృషసేనకుమార! అటుపిమ్మట వినుట చాలును. హా! వత్స! హా! వృషసేన! హా! మదంకదుర్లలిత! హా! మదాజ్ఞానుసారి! హా! గదాయుద్ధప్రియశిష్య! హా! శౌర్యసాగర! హా! రాధేయకులప్రరోహ! హా! ప్రియదర్శన! హా! దుశ్శాసననిర్విశేష! హా! సర్వగురువత్సల! పలుకవేమిరా కుమార.

తే. గీ. కొలిచినను జేరలకు మీఁటుగొప్పకనులు,
మోసు లెత్తెడునూనూఁగుమీసములును,
గలిగి శశిఁ బోలునీముఖకమల మకట!
కర్ణుఁ డెటు గాంచె, నీవు ప్రమాఁగన్ను వెట్ట? ౧౦.

సూతు—దేవా! దుఃఖసాగరమున మునుంగకుము.

దుర్యో—సూతుఁడా! దుఃఖవంతులును బుణ్యాత్ము లేసుమీ. ఇఁకమఱొకో—

తే. గీ. కనులయెదుర బంధుగణ మెల్ల హత మయ్యె,
ననెడు పరిభవపు దవానలమున
హృదయ మెప్పుడును దహించుకపోయెడు;
నేటిదుఃఖ మింక నేటిబాధ? ౧౧. (మూర్ఛిల్లుచున్నాఁడు.)

సూతు—ఊఱడిల్లు మూఱడిల్లుము. (చేలచెఱంగున విసరుచు) దేవా! అతిదుఃఖమును బొందకుము.

దుర్యో—(తెలివివచ్చి) సుందరకా! నాచెలికాఁడు కర్ణుఁ డప్పుడేమి చేసెను?

సుంద—తరువాత దేవా! అత్తెఱంగున జీవంబులు విడిచినకొడుకును జూచి, యంగరాజు కాలువలు గట్టుకన్నీరు చేతులతోఁ దుడుచుకొనుచు, దనశరవేదనను గణియింపక వెండియు గాండీవిని దలపడియె. అట్లు పుత్రవధామర్షంబున జీవితంబుపై నాస రోసి పరాక్రమింప వచ్చినయాకర్ణునిఁ జూచి, భీమసేననకులసహదేవులును, బాంచాలప్రముఖబంధుగణంబును నయ్యర్జునునరదంబును బొదివికొనియె.

దుర్యో—తరువాతఁ దరువాత?

సుంద—దేవా! తరువాత నయ్యర్జును చేతిగాండీవం బనుమహాప్రళయపయోధరంబు, తెఱపి యీకుండ నఖండశరధారావర్షంబున దశదిశలును ముంచుచుండఁ, గనుంగొని యంగరాజుతో శల్యుం డిట్లనియె. అంగరాజా! గుఱ్ఱంబులు

వచ్చినవి. నొగలుఁ జక్రనేమియు విఱిగినవి. ఇట్టిరథ మెక్కి నీవు భీమార్జునుల నెదురుకొనుట మేలు గాదు. అని చెప్పి మరలించి యాయనను రథమునుండి డింపి పలువెఱఁగుల నూఱడించెను.

దుర్యో—తరువాతఁ దరువాత ?

సుంద—దేవా! కొండొకతడ వాలసించి తరువాతఁ దనపరిజనునిఁ జూచి యంగరాజు నీవు త్వరితముగా వేఱొకయరదము గొనితెమ్మని సెలవిచ్చిన వాఁడు నట్లు కావించె. అప్పు డాయన నావైపు చూచి సుందరకా! ఇటురమ్మని పిలిచిన, నేను వినయముతో సమీపమునకుఁ బోయి నిలిచితిని. అంతటఁ దనముఖపట్టమును దీసి చేతఁ బట్టుకొని, నెత్తుటితో నిండి యున్న గాయములయందు బాణాగ్రమును ముంచి దేవరవారి కీజాబును వ్రాసి పంపెను. (పట్టిక సమర్పించుచున్నాఁడు.)

దుర్యో—(పుచ్చుకొని చదువుచున్నాఁడు.)

స్వస్తిశ్రీమహారాజదుర్యోధన!

ఈగడియవఱకు గాఢముగాఁ గంఠాశ్లేషము చేసికొని యుద్ధరంగమునుండి కర్ణుండు కావించుకొనువిజ్ఞాపనము.

మ. వరదివ్యాస్త్రవిశారదుం డితని కెవ్వం డీ డనీ? నాకు నా
గ్గురుసైదోడులకంటె నెక్కు డితఁడే. కూల్చెం బృథాసూనులన్
దురమం దంచు, బహూకరింతు నను; నే దుశ్శాసనారిన్ భయా
తురతం గూలుపనైతి; నీఁగు వగ నీదోశ్శ్రీని కన్నీటనో. ౧౨.

దుర్యో—వయస్యా! కర్ణుఁడా! ఏమిది! నూఱుగురుతమ్ములును జచ్చి దుఃఖపడుచున్న నన్ను నీవచోభల్లఘాతములచేత మఱింత దుఃఖ పెట్టుచున్నావు. సుందరకా! సరే. ఇప్పు డంగరాజుప్రయత్న మ్మేమి ?

సుంద—దేవా! ఆయన యిప్పు డాత్మవధయందుఁ గృతనిశ్చయుఁ డయి కవచవిసర్జనంబు గావించి యుద్ధమునకుఁ బోవ నుండెను.

దుర్యో—(విని యదరిపడి లేచి) సుందరకా! నీవు త్వరితముగాఁ బోయి మిత్రుఁ డైనయంగరాజుతో నావచనంబులుగా నిట్లు పలుకుము. "మిత్రమా! నీ విప్పుడు జయకాంక్షను వదలుకొనుము. మనయిరువురసంకల్పమునొకటియే కదా!

ఉ. పాండవులన్ వధించి, హతబంధుల కిచ్చి నివాపవారి, చా
కుండినవాండ్రతోఁ గలిసి మొక్కము దేడిచి, యింక మీఁద నే
నుండెదను లేదు గావున ఘనంబుగ నొండొరుఁ గౌఁగిలించి, యా
ముండిశరీరముల్ విడిచి పోదము, దుఃఖమొ సౌఖ్యమో తుదిన్. ౧౩

ఇంక దుఃఖమును గుఱించి నిన్ను నే నేమని యూఱడింతును ?

క. సూనుఁడు గాఁ డనుకో వృష
సేనుఁడు నీకట్లు దుస్ససేనుఁడు నాకుఁ
మానుగఁ దమ్ముఁడు గాఁ డిఁక
నే నిన్నే మందు నన్ను నే మనె దీవుఁ ?" అని ౧౪.

సూద—చిత్తము దేవా (నిష్క్రమించుచున్నాఁడు.)

దుర్యో—ఓయీ! బండికండ్లచప్పుడులా గున్నది.

సూతు—ఆలకించి దేవా! అది యిప్పు డధిక మగుచున్నది.

దుర్యో—సరే. పరిజనుఁడు రథమును దోలుకొని వచ్చుచున్నాఁడు. నీవు పోయి దాని నాయితంబు సేయుము.

సూతు—చిత్తము దేవా! (నిష్క్రమించి మరలఁ బ్రవేశించుచున్నాఁడు.)

దుర్యో—ఏమిది రథ మెక్కి రావయితివి ?

సూతు—దేవ! ఇదిగో! అమ్మగారును నాయనగారును సంజయునితో రథారూఢు లయి తమయొద్దకే వచ్చుచున్నారు.

దుర్యో—హాహా! దైవ మెంతబీభత్సము చేసెను! సూతుఁడా! నీవు త్వరితముగా రథము నాయితంబు చేసికొని రమ్ము. నేనును నాయనగారి కగపడకుండ దాఁగి యుండెదను.

సూతు—దేవా! వారికి నీవు దప్ప మఱి యెవ్వరుఁ జుట్టంబులు లేరు గదా! దేవర కూడ నూఱడింపక పోవుట యుచిత మగునా ?

దుర్యో—సూతుఁడా! అదృష్టహీనుఁడను నేను వారి నేమని యూఱడింతును? చూడు.

చ. అని కిటు వచ్చుచుండ, మము నమ్మయుఁ దండ్రియు, బాష్పబిందువుల్
గనులను రాల మూర్ధములు ఘ్రాణము చేసిక యంపి రిప్పుడే
మనుదు నొకండ డగ్గఱి? కటాకట! మ్రింగితి దుస్ససేను; న
త్తనయుని యట్టిదారుణవథ న్విని యాముదియంధు లోర్తురే ? ౧౫.

ఐనన్ను దల్లిదండ్రు లవశ్యము వందనీయులు గదా! (నిష్క్రమించుచున్నారు.)

గద్యము. ఇది శ్రీపరమేశ్వరవరప్రసాదలబ్ధసరసకవితాధురంధర వడ్డాది
సాధువంశక్షీరనీరాకరరాకాసుధాకర రార్చనామాత్యపౌత్ర హరి
తసగోత్ర పవిత్రమగుణకదంబలక్ష్మాంబాగర్భశుక్తిముక్తాఫల
సూరపరాజప్రధానతనూభవ విబుధవిధేయ సుబ్బ
రాయనామధేయాంధ్రీకృత వేణీసంహార
నాటకంబునందుఁ జతుర్థాంకము.

శ్రీరస్తు.

శ్రీపరమాత్మనేనమః.

వేణీసంహారనాటకము.

పంచమాంకము.

[తరువాత రథ మెక్కి గాంధారియు సంజయుఁడును ధృతరాష్ట్రుఁడును ప్రవేశించుచున్నారు.]

ధృత—వత్స! సంజయ! కురుకులవనంబున నొక్కయాకులాగున మిగిలి యున్న నాకొడుకు దుర్యోధనుఁ డేమయిన బ్రతికి యున్నాఁడా? లేదా?

గాంధా—సంజయా! నిజముగా బ్రతికి యుండెనేని యెక్కడ నున్నాఁడో చెప్పుము.

సంజ—ఇదిగో! మహారా జొక్కఁడు నీమఱ్ఱిచెట్టునీడను గూరుచున్నాఁడు.

గాంధా—కుఱ్ఱవాఁ డొక్కఁడే యని చెప్పుచున్నావు. ఇపుడు నూఱుగురు తమ్ములును వానిపార్శ్వభాగమున లేరా?

సంజ—నాయనా! అమ్మా! రథము నిమ్మళముగా దిగుండి.

ఇద్దఱు—(దిగుచున్నారు.)

[తరువాత దుర్యోధనుఁడు ప్రవేశించి సిగ్గుతోఁ గూర్చున్నాఁడు.]

సంజ—(దగ్గఱఁ బోయి) జయముజయము మహారాజ! ఇదిగో! నాయనగారమ్మగారితోఁగూడ వేంచేసినారు. వారిని జూడ వేమి మహారాజా?

దుర్యో—(తెలతెలఁబోవుచున్నాఁడు.)

ధృత—చ. ఘనకవచంబు ధీయఁగనె, కంకముఖంబున నల్గు లూడ్చి, వే
గను వ్రణపట్టికల్ వయిచి కట్టుడు, దిండున నత్తమిల్లి, ద
ర్పున జితశత్రులన్ నృపులఁ బుత్రక! నీవు ప్రియంబునం గనుం
గొనఁ, జెవిఁ జేరి వేదనను గూరిచి నిన్నడుగన్ దురాత్ముఁడన్.

(ధృతరాష్ట్రుఁడు గాంధారియుఁ దడవి చూచి కౌఁగిలించుకొనుచున్నారు.)

గాంధా—కుమారా! తీవ్రమయినగాయముల వేదనచేత క్షోభపడుచు మాతోఁ గూడ మాటలాడఁ జాలకున్నావా? తండ్రీ.

ధృత — వత్స! దుర్యోధన! ఏ మిది? మును పెప్పుడు నిట్లు కావే! మాతోఁ గూడఁ బలుక వేమి?

గాంధా—కుమారా! నీవే మాతో మాట లాడకపోయిన, నిఁక దుశ్శాసనుఁడును మర్షణుఁడును దక్కినకొడుకులు నిప్పుడు మాట లాడుదురా యన్నా?
(రోదనముచేయుచున్నది.)

దుర్యో—ఉ. తమ్ములచావు చూచితిని దత్ప్రతికారము సేయ లేక; నే
నమ్మరో! నీకు నయ్యకును నాఱనిదుఃఖము దెచ్చినాను; స్వ
చ్ఛ మ్మగుచున్నయీభరతసంతతి మాపఁగఁ బుట్టుపాతకిన్;
నమ్ముఁడి మీకు నేను సుతనాశుఁడఁ గాని సుతుండఁ గాఁ జుడీ.

గాంధా—బిడ్డా! ఏల యిట్లు పరిదేవనంబు చేసెదవు? నీ వయిన నీయంధుల కిద్దఱకును దారిఁ జూపుటకుఁ జిరంజీవి వయి బ్రదుకుము. నాకు రాజ్యముతో నేమి? వైరముతో నేమి? (రోదనముచేయుచున్నది.)

దుర్యో— తే. గీ. అమ్మరో! యిట్టివెడమాట లాడఁ దగునె?
పుట్టినది రాచపుట్టువు పొగతె దేల?
సుతశతము చావు మాయుట చూడ నెంత
కఠినురాలవొ ఖలు నన్నుఁ గావఁ దలఁతు. 3.

ఇది నిశ్చయముగాఁ బుత్రశోకమువలనివికారము.

సంజ—మహారాజా! చేఁద నూతఁ బడినఁ ద్రాడు కూడ నక్కడఁ బాఱ వేయఁ గూడ దనులోకోక్తి యబద్ధమాయేమి?

దుర్యో—ఈయుక్తి చాల దోయి. ఉపక్రియమాణము లేనియప్పు డుప కరణముతో నేమి ప్రయోజనము? (రోదనముచేయుచున్నాఁడు.)

ధృత—(దుర్యోధనునిఁ గౌఁగిలించుకొని) అబ్బాయీ! ఊఱడిల్లుము. మిక్కిలి దీనుల మయినతలిదండ్రులను మ మ్మూఱడింపుము.

దుర్యో—తండ్రీ! ఇప్పుడు మి మ్మూఱడించుట దుష్కరము; కాని—

ఆ. వె. కుంతి నిప్పు డేను కొడుకులు నచ్చిన
దానిఁగా నొనర్తుఁ దథ్యముగను;
మీరు దానితోఁ గుమారులకొఱ కేడ్చి,
యూఱడించుకొనెద రొకరి నొకరు. 4.

గాంధా—బిడ్డా! నీ వొక్కఁడ వయిన బ్రతికిన నంతె చాలును; నే నెవరిని గూర్చి శోకింతును? కొడుకా! ఇది యుద్ధమునకు సమయము గాదు. శాంతిం

వును. ఇదిగో! దోసిలి పట్టి బతిమాలుకొనుచున్నాను. సమరవ్యాపారము విడిచి పెట్టుము. నామాటలు పెడచెవిని బెట్టకు తండ్రీ!

ధృత—వత్సా! ఎల్లచుట్టములును జచ్చిపోయి దుఃఖించుచున్న మీయమ్మ మాటను నామాటను విను. తండ్రీ! చూడు.

ఉ. ఏరిబలాన దాయలను నెంచవు లే రల ద్రోణభీష్ము లా
తీరునఁ గర్ణపుత్రుని వధించిన క్రీడికి జంకు లోకముల్;
వైరి వధించె నూఱుగురు వత్సల; నీవె మిగుల్ ప్రతిజ్ఞకుఁ;
బోరిఁక మాను తండ్రి! మముఁ బ్రోవుము కన్నులు లేనిదీనులఁ. 98

దుర్యో—యుద్ధము మాని నేను జేయునది యేమి?

గాంధా—పుత్రకా! మీతండ్రిగారును విదురుఁడును జెప్పినట్లు చేయుము.

సంజ—రాజా! ఇది సత్యము.

దుర్యో—సంజయా! ఇంకను నుపదేశింపఁ దగినయంశ మున్నదా?

సంజ—రాజా! జయము గోరువారికిఁ బ్రాణ మున్నంతవఱకుఁ బ్రజ్ఞావంతు లుపదేశింప వలసినదే.

దుర్యో—(క్రోధముతో) అట్లయినఁ బ్రజ్ఞావంతుల రగుమీహితోపదేశ మేమో యిప్పుడు లెస్సగా విందము.

ధృత—కొడుకా! యుక్తముగాఁ బలికినయీసంజయునిమీఁదఁ గోపపడి యెద వేమి? నీవు శాంతించితివేని దానిని నేనే చెప్పెదను. విను.

దుర్యో—నాయనా! సెల విమ్ము.

ధృత—వత్సా! పెక్కుమాట లేల? ఇప్పుడు యుధిష్ఠిరునకుఁ గోరిన పణంబు నిచ్చి సంధి చేసికొనుము.

దుర్యో—తండ్రీ! పుత్రులయందలి ప్రేమవలనిభయమునం జేసియుంబయును, బాలిశత్వమునం జేసి సంజయుండును నట్లు పలికినఁ బలికిరి గాక, మీకుఁ గూడ నిది యేమి వెఱ్ఱి? కాకపోయినఁ బుత్రశోకజ్వర మెంతకుఁ జాలదు. నాయనా! నూఱుగురు తమ్ములతో నిండియున్నప్పుడు, నాఁ డన్నివిధంబుల సామవాక్యముల చేతఁ గృష్ణుండు నన్ను బతిమాలుకొనిన నిరాకరించి, యిప్పుడు భీష్ముండును ద్రోణుండును దమ్ములును సకలరాజచక్రంబును బేరుమాయుట చూచి, కేవల మీతుచ్ఛశరీరముమీఁదియ పేక్షచేత, నుదాత్తపురుషలజ్జాకరంబును నసుఖావహంబును నయినపాండవులతోడిసంధికి, దుర్యోధనుఁ డెట్లు లంగీకరించును? ఇంక నొకటి చెప్పెద. నయకోవిదుఁడా! సంజయా!

ఆ. వె. హీనులయినరిపులతో నెట్లు రాజులు
సంధి చేసికొంద్రు చక్కఁ జెపుమ;
నేను భ్రాతృశతము లేనివాఁడను గద!
పాండుసుతులు కొఱంత పడనివారు. ౬.

ధృత—వత్సా! ఇట్టియవస్థయందయినను నాప్రార్థనమును ధర్మరాజ స్వీకరింపఁ డిది నిశ్చయము. విశేషించి యిది యంతయు దైవవశమున జరిగినదిగానే యతఁడు తలంచుకొనును.

దుర్యో—ఎందుచేత!

ధృత—ఇదిగో! విను. తనతమ్ములలో నొక్కనికేని కీడు మూఁడినఁ, దాను ప్రాణములఁ బాయువాఁడుగా యుధిష్ఠిరుఁడు శపథముఁ జేసినాఁడు, అందుచేత యుద్ధమునం దెల్లప్పుడు నొక్కతీరున సాగి రాదు గావునఁ, దమ్ములదెస నేవేళ నేమి పుట్టునో యనుభయంబున నీ కనుకూల మయిన తెఱంగుననే యతఁడు సంధి సేయుట కిచ్చగించును.

సంజ—ఇది యథార్థము.

గాంధా—బిడ్డా! యుక్తాయుక్తముగా నున్న మీతండ్రిగారిమాట దాఁటక నడచుకొనుము.

దుర్యో—నాయనా! అమ్మా! సంజయా!

చ. అనుజుఁ డొకండు చచ్చినను నాతఁడు చావఁ బ్రతిజ్ఞ పట్టె; నా
యనుజులు నూర్వురుం దెగిన, నక్కట! ప్రాణముఁ బాయనైతి; నే
నని మొన దుస్ససేనుహృదయంబున నెత్తురు ద్రావుభీము, నా
పెనుగద నుగ్గు సేయ కటు బేలనె సంధిని జేసికొంటకుఁ? ౭.

గాంధా—హా! దుశ్శాసనకుమార! హా! దుర్మర్షణ! హా! వికర్ణ! ఆహా! వీరశతమును గన్నగాంధారి! దుఃఖశతము నేగాని సుతశతమును గన లేదా? అయ్యో! మందభాగ్యురాల నయిననాయిట్టియాపద లోకమునందుఁ గన్నదా? విన్నదా? (అందఱు రోదనము చేయుచున్నారు)

సంజ—(కన్నీరు దుడుచుకొని) నాయనా! అమ్మా! మహారాజునకు దుఃఖశాంతి చేయుటకయి మీ రిక్కడకి వచ్చితిరి. మీరు మిక్కిలి మీరు కూడ నధైర్యపడియెద రేమి? ఊఱడిల్లుఁడు.

ధృత—కుమారా! మనయదృష్టము లిట్లుండెను. నీవు వైరులయెడల రోషమును విడిచి పెట్టవయితివి. నీబ్రతుకునే యాధారము చేసికొని యిట్లు

వాక్కుచున్న మీయమ్మకును నాకును మఱి యెవరు దిక్కు? ఎట్లు బ్రదుకుదుము?

దుర్యో—నాయనా! వినుండు.

ఆ. వె. విరివిసిరుల ననుభవించి, యనేక రా
జన్యమకుటదీప్తచరణు లగుచు;
సుతులు సూర్యు రరుల సోలించి వ్రాలిరి;
బ్రతుకుఁ డీరు నగరుపగిదిఁ; దండ్రి! తా.

ఱిందుదెఱంగయిన నాకు రాచపాడి తప్పుట సంభవించును గదా!

(తెరలోపలఁ పెద్దకలకలము)

గాంధా—(విని భయముతో) సంజయా! ఏమిది? హాహాకారములోఁ దూర్యధ్వను లెగయుచున్నవి!

సంజ—అమ్మా! మీవంటిభీరుజనమున కిది నిలువ వలసినచోటు గాదు.

ధృత—వత్సా! సంజయ! ఈహాహాకార మంతే కంతకు నెక్కువ యయి భయము పుట్టించుచున్నది. అది యేమో తెలిసికొనుము. దీని కేదో గొప్పకారణ ముండక పోదు.

దుర్యో—తండ్రీ! అనుగ్రహింపుము. మనయెడల దైవము పరాఙ్ముఖ మయ్యెను గదా! మరల నేదేని మహోపద్రవము చెవిని బడక మునుపే, నాకు యుద్ధమునకుఁ బోవ ననుజ్ఞ యిండు.

గాంధా—బిడ్డా! మందభాగ్యురాల నయిననన్ను ముహూర్తమాత్ర మూఱడింపవోయి తండ్రీ!

ధృత—అబ్బాయీ! నీవు యుద్ధమునందే కృతనిశ్చయుఁడ వయితివేని; శత్రువులను రహస్యముగాఁ గడతేర్చు నుపాయ మాలోచింపుము.

దుర్యో—

ఉ. ఏఁ గన సానుబంధువుల నెల్ల వధించినవారిఁ, జాటుగా
బాగె వధింప? యుద్ధమున వైరులు మెచ్చనిచంపు చంపకో?
గాంధా—బిడ్డా! నీ వేకాకి వయితివి గదా! ఎవ్వరు నీకుఁ దోడుపడువారు?
దుర్యో—ఈగతి నేన నీసుతుల నెక్కటిఁ జంపనె? వైరు లెంత? య
వ్వా! గను మిప్పుడే జగ మపాండవ మౌ; నీకుఁ దోడు దైవమే.

(తెరలోఁ గలకలానంతరమున)

ఓహో! యోధులార! ఇప్పుడు జరిగినమహాయుద్ధమును గౌరవేశ్వరునకు విన్న

వింపుఁడు. అప్రియము వినఁ జాలకున్నఁ దప్పి పోవునా? ఇప్పుడు రాలాసముచిత

ముగా నేమి ప్రతివిధానము చేసికో వలసి యుండునో?

మ. మునికోల న్విడి, యర్జునాంకపుశరంబుల్ స్వాంగముం గాఁడ, వ
చ్చినజాడన్ రథ మీఁదఁ జూచుకొంచుఁ జనఁ దేజీల్, మెల్ల శల్యుండు, లో
చన బాష్పంబులె కర్ణహార్త ప్రజకున్ స్పష్టంబుగాఁ దెల్పఁ, జొ
చ్చె నిదే శూన్యరథంబుతో శిబిరమున్, జంకిల్లఁగాఁ గౌరవుల్. ౧౦.

దుర్యో—(భయముతో) సూతుఁడా! పిడుగువలె వినఁబడుచున్న యీ

నుడు వెవఁడు వలెకెనో తెలిసికో వలయును. ఓరీ! యెవఁడురా అక్కడ?

(తత్తఅపాటుతో సూతుఁడు ప్రవేశించుచున్నాఁడు.)

సూతు—హా! చచ్చితిఁగద! (భూమిమీఁదఁబడుచున్నాఁడు.)

దుర్యో—చెప్పు చెప్పు.

సూతు—దేవా! మఱి యే మున్నది.

ఆ. వె. అలమనోరథంబునట్లు శూన్యం బగు
నినతనూజురథము నెక్కి వచ్చి,
శల్యభూపమునను శల్యుండు చొరఁబడి,
జనము నెల్ల మూర్ఛ మునుఁగఁ జేసె. ౧౧.

దుర్యో—హా! వయస్య! కర్ణ! (మూర్ఛిల్లుచున్నాఁడు.)

గాంధా—బిడ్డా! ఊఱడిల్లు మూఱడిల్లుము.

సంజ—ఊరడిల్లు మూరడిల్లు మహారాజ!

ధృత—అయ్యో! ఎంతకష్ట మెంతకష్టము!

క. ఆలమున ద్రోణభీష్ములు
గూలుటనే ప్రాపు దక్కెఁ గురుసైన్యంబుల్;
మే లయినసఖుఁడు కర్ణుఁడు
నీలీలను నిహతుఁడయ్యె; నిఁక నెట్లో కో. ౧౨.

కుమారా! ఊఱడిల్లు మూఱడిల్లుము. ఓమాయదైవమా!

ఉ. కన్నులు లేవు; పుత్రశతకం బనిఁ జచ్చె; నగాధశోకవా
రాన్నిధి నింతితో డుతఁ గరంబు మునింగితి; నయ్యయో! యిఁ కే
మున్నది? బందుగుల్ చెలులు నొజ్జలు నాదిగ శూన్య మైరి నీ
వన్నగడన్; సుయోధను నిపట్టున నేఁ గనుఁ నాన పీడితిన్. ౧౩.

వత్సా! దుర్యోధన! దీనురా లయినమీయమ్మ నూఱడింపుము.

దుర్యో—(మూర్ఛ దెలిసి)

తే. గీ. కర్ణుఁడా! నీకు నామీఁదఁ గలుగుప్రేమ
పలుకఁ బోరలంగ, నింపుగఁ బలుక వేమి?
పాయ నెన్నఁడు; నీ కెగ్గు సేయ; నైన,
మిత్రు విడిచితె వృషసేనుమీఁదిప్రేమ? ౧౪.

(మరలమూర్ఛిల్లుచున్నాఁడు.)

అందఱు—(ఊఱడించుచున్నారు.)

దుర్యో—(ఊఱడిల్లి)

తే. గీ. అకట! నాప్రాణములకంటె నధికుఁ డయిన
యంగరా జీల్లు టాలించి, ప్రాణములను
విడువ నందుకె కడు సిగ్గుపడుచు నుంటి;
నింక నే నూఱడిల్లుట యెట్లు తండ్రి? ౧౫.

సంజయు—

తే. గీ. వగవ వలసిన వగవ, నే బాలుఁ డైన
దుస్ససేనునివధకు, బంధువులమృతికి;
నాకు సత్యుపకార మొనర్చినట్టి
కర్ణుకుల మెల్ల, మాపిలిఁ గాన వగతు. ౧౬.

గాంధా—బిడ్డా! క్షణమాత్రము కంటఁ దడి వెట్టకుము.

ధృత—కుమారా! నీ వెక్కి-మూఱు కన్నీరు దుడుచుకొనుము.

దుర్యో—తే. గీ. నానిమిత్తము తనదుప్రాణములు విడిచె,
నెంతొ లెంతలచేతను నీడఁబోక;
యట్టికర్ణునికొఱకు, నే ననద నగుచు
నశ్రుజలమును విడువ, న న్నాఁగఁ దగునె? ౧౭.

సూతుఁడా! నే నెన్నఁగుఁ దలఁచుకొనినదియు, నాకులమున కంతకమయినదియు, నగునీఘోరకర్మ మెవఁడు చేసెనో?

సూతు—దేవా! జను లీలాగునఁ జెప్పుకొనుచున్నారు.

"ఆ. వె. తేరికల్లొకింత ధారుణిఁ గ్రుంగ, రా
ధేయుఁ డెత్తికొనెడి కెలుపిలోన,

మానబలంబు రూపు మాపినయర్జును
నలుఁగు లతనియనుజులు లపహరించె. ౧౮.

దుర్యో—క. అలకర్ణుమోముచందురుఁ
దలఁచిన, శోకాబ్ధి పొంగుఁ దత్క్షణ మది, నా
యలుక యనుతీవ్రబడబా
నలశిఖలను, మరల శోషణంబును జెందున్. ౧౯.

తండ్రీ! అమ్మా! మీ రూఱడిల్లుఁడు

ఆ. వె. శోకమునను బుట్టి, చుఱచుఱ నిప్పుడు నా
యుల్ల మేర్చుచుంట కోర్వఁ జాల;
సమవిపత్తులందు శంక మీ కేల? నా
కాలమునకుఁ బోవ నాన తిండు. ౨౦.

ధృత—(దుర్యోధనునిఁ గౌఁగిలించుకొని,)

ఆ. వె. సాహసంబులందు శంక నాకు నిజంబె;
తల్లడిల్లు గుండె తలఁపఁ భీము;
మానశౌండ! నీకు మాయ గిట్టదు; కూట
సమర మరుల దెట్లు చత్తు నేను? ౨౧.

గాంధా—బిడ్డా! నూఱుగురుబిడ్డల మంటఁ గలిపిన యాభీమునితోనే మరల నిప్పుడు యుద్ధము సేయఁ జూచుచున్నావా?

దుర్యో—అమ్మా! భీమునిమాట యటుండనీ.

ఆ. వె. నామనోరథంబు, నామేనిగందంపుఁ
జర్చ, నాదుకనులచందమామ,
దల్లి! నీకుమారుఁ, దండ్రి! నినయశిష్యుఁ,
గర్ణుఁ జంపినట్టిఖలు వధింతు. ౨౨.

సూతుఁడా! ఇంక నిప్పు డాలస్య మెందుకు? నారథమును సన్నద్ధముచేసి తీసికొని రా. నీవును బాండవులకు భయపడితివేని నిలిచి పో. గదామాత్రసహాయుఁడ నయి, నే నొక్కడన యుద్ధరంగమునకుఁ బోయెదను.

సూతు—దేవ! నీవన్యథా తలంపకుము. ఇదిగో! నేను వచ్చుచున్నాను.

(నిష్క్రమించుచున్నాఁడు.)

ధృత—నాయనా! దుర్యోధన! మమ్ము ముందు బెట్టుటకే నీవు నిశ్చయించుకొంటివేని, యున్న పాటివీరులలో సేనానిఁగా నెవ్వని నయిన నభిషేకింపుము.

దుర్యో—అభిషిక్తుఁ డయి యున్నాఁడే.

గాంధా—బిడ్డా! హతాశురాలిని నన్ను మరల సావలంబననుగాఁ జేయఁ గలిగినయతఁ డెవ్వఁడో చెప్పుము.

ధృత—అబ్బాయీ! శల్యుఁడో? అశ్వత్థామయో?

సంజ—క. కూలఁగ భీష్ముఁడు, ద్రోణుఁడు
కాలము సేయంగఁ, గెడయఁ గర్ణుండును, భూ
పాలా! బలవతి యాశ, యిఁ
కాలములో శల్యుఁ డోర్చు నప్పాండవులన్. ౧౩.

దుర్యో—నాయనా! శల్యుఁ డెందుకు? అశ్వత్థామ యెందుకు?

ఆ. వె. కర్ణుఁ గౌఁగిలింపఁ గలిగెదునో, పార్థు
జీవములు హరింపఁ జేకుఱెదునో;
కాల్వ లగుచుఁ దొరఁగుకన్నీటిచే, నభి
షేచనంబు నాకె చేసికొంటి. ౧౪.

(తెరలోఁ గలకలధ్వని చేసి) ఓహో! కౌరవబలప్రధానయోధులార! మమ్ముఁ జూచి భయపడి యిట్టిటు పాఱిపోయెద రేమి? దుర్యోధనుఁ డెక్కడ నున్నాఁడో చెప్పుఁడు. (అందఱు నదరిపడి యాలకించుచుండఁగా సూతుఁడు తత్తఱపాటుతోఁ బ్రవేశించుచున్నాఁడు.)

సూతు—దేవా!

తే. గీ. ఇరువు రొక్కరథం బెక్కి, యిందు నందు
నిన్ను నడుగుచు వచ్చుచు నున్నవారు;

అందఱు—ఎవ రెవరు?

సూతు—కర్ణుప్రాణంబుఁ బాపినఘాతుకుండు,
నుగ్రవృకకర్ముఁ డయిన వృకోదరుండు. ౧౫.

గాంధా—(భయముతో) బిడ్డా! ఇందుకుఁ జేయునది యేమి?

దుర్యో—అమ్మా! ఇదిగో! గద నాదగ్గఱనే యున్నదిగద!

గాంధా—హా! అదృష్టహీనురాలను నేను జచ్చితినిరా బిడ్డా!

దుర్యో—అమ్మా! నీ విప్పుడు దైన్యపడకు. సంజయ! సంజయ! నాముఖమును బోఁగొట్టు చెలికాండ్రు వచ్చినారు. ఈతల్లిదండ్రులను రథ మెక్కించుకొని పోయి, శిబిరమునఁ బ్రవేశపెట్టుము.

ధృత—నాయనా! నీరిభావ మేమో తెలిసికొనియెద; క్షణమాత్రము నిలువ నిమ్ము.

దుర్యో—ఈ తెలిసికొనుట కేమి? తండ్రీ! పొండి.

ధృత & గాంధా—(కొంచెము నడచి కూరుచున్నారు.)

[తరువాత రథారూఢు లయినభీమార్జునులు ప్రవేశించుచున్నారు.]

భీము—ఓదుర్యోధనపరిజనులార! మీరు తొట్రుపాటుతో వెలవెలఁ బోవుచుఁ దిరిగెద రేల? మావలన వెఱవకుఁడు.

సీ. కపటంపుజూదంబు కల్పించినఖలుండు, లక్కయిల్లు గాల్చిన మొక్కలీఁడు,
పాంచాలికొప్పును బైఁట దూల్చినగాలి, యట్టిట్టు గాని మహాభిమాని,
బానిసీలుగఁ బాండుసూనులఁ గొనుపాపి, దుశ్శాసనప్రభృతులకు రాజు,
తులువ తొనూగ్గరుతోఁ బుట్టువులయున్న, యంగరాజునకును బ్రాణసఖుఁడు,
నగుమహారాజుగారు మీయధిపు లిప్డు
ఎందుఁ గొలు వున్నవారొ మా కెఱుఁగఁ జెప్పుఁడ;
మేము పగచేత రా లేదు; మిన్న కతని
వదనమును జూచి పోవంగ వచ్చినాము. ౨౬.

ధృత—సంజయ! ఈక్రూరుని యెత్తిపొడుపు మహాదారుణముగా నున్నది గదా!

సంజ—తండ్రీ! వా రీపట్ల కే పనిచేత మిగులు లేకుండఁ దమయప్రియ మంతయుఁ దీర్చుకొన్నారు. ఇప్పుడు మాటలచేత మనసు మరలఁ జేయుచున్నారు.

దుర్యో—సూతుఁడా! నే నీయిద్దఱయొద్దఁ గూరుచున్నా నని చెప్పు.

సూతు—చిత్తము (పోయి) ఓభీమార్జునులారా! మహారా జిదిగో నాయనగారితోడను నమ్మగారితోడను, నీమఱ్ఱిచెట్టునీడను గూరుచున్నాఁడు.

అర్జు—అన్నయ్యా? పుత్రశోకపీడితు లయినతల్లిదండ్రులను మనదర్శనముచేత మఱింత యడలఁ బెట్టుట బాగుండదు. పోవుద మనుగ్రహింపుము.

భీము—మూఢుఁడా! సదాచారము దాటఁ గూడునా? తల్లిదండ్రులు వందనీయు లన్నమాట నీచెవి నెప్పుడు బడ లేదా యేమి? (దగ్గఱకుఁబోయి)

సంజయ! మా తాపితలకు మా నమస్కారము దెలుపుము. కా దందు. మేమే తెలిపెదము. (తేరు డిగినారు)

భీము—తమ్ముఁడా! నామకర్తములను దెలుపుకొనుచు గురులకు నమస్కరింప వలయును జుమీ!

అర్జు—(దగ్గఱఁబోయి) నాయనా! అమ్మా!

చ. అరులను నందఱం గెలుచు నంచును మీసుతు లేని నమ్మిరో,
గరువముచేత నెవ్వఁడు జగం బఖిలంబు తృణీకరించెరో,
దురమున నట్టికర్ణుపనఁ దూల్చినపాండవమధ్యముండు, మీ
యుసువురు తల్లిదండ్రులకిదే ప్రణమిల్లెను భక్తిశోదుతన్. ౨౮.

భీము—తే. గీ. కురుకుమారుల నెల్ల నుగ్గుగ నొనర్చి,
దుస్ససేనుని ఱొమ్ము నెత్తుటను బలిసి,
యిఁక సుయోధనుతొడలు ఛేదింప నున్న
భీముఁ డిదె మ్రొక్కుచున్నాఁడు పితల కిపుడు. ౨౯.

ధృత—దురాత్మా! వృకోదరా! శత్రువుల కపకారముఁ జేసినవాఁడవు నీవు మాత్రమే కావురా. క్షత్రకులంబు పుట్టిన దాదిగా వీరులు సమరమున జయాపజయంబులఁ బొందుచునే యున్నారు. ఎందు కీప్రతాపోక్తులచేత మమ్మడలఁ బెట్టెదవు?

భీము—తండ్రీ! కోపపడకు.

ఉ. పాండవపత్నిఁ గృష్ణను భవత్సభ కీడిచి తెచ్చి, యామెయు
ద్దండరుషాగ్ని మ్రగ్గె మిడుతల్ బలె గాఢ్గణ మంటెఁ గాని, నా
దండితనంబు మెప్పునకు దర్పముచేతను జెప్పఁ; దండ్రీ! నీ
వుండవె పుత్రపౌత్రులు మహాయుద్ధతిఁ జేసెడి వెల్లఁ జూచుచున్.

దుర్యో—ఓరోరి మరుత్తనయ! ఏమిరా యిది? నింద్యమయిన నీకర్మమును వృద్ధరాజునొద్దఁ బొగడుకొనుచున్నావు?

మహాస్రగ్ధర. పసరంబుల్ నీకు నీ కవ్వతికిఁ గవలకున్, భార్య యామ్యాతదాసిన్,
బొసఁగన్ రారాజ నౌనామదులఁ గొని సభన్ ముందలం బట్టి నారీ
మసదృగ్గ్వారంబునం దాహాతు లగునపు లేయప్రియుల్ చెప్పరా; నీ
పసఁ జూతున్, భూరిబాహాబలధనమదదుర్వారు నన్ గెల్వు మాజిన్. ౩౦.

ఆ! దురాత్మ! ఇదిగో! నీవు లేవురా. (క్రోధమునఁ జంపఁ బోవుచున్నాఁడు.)

ధృత—(పట్టుకొని కూరుచుండఁ బెట్టుచున్నాఁడు.)

భీము—(క్రోధము నభినయించుచున్నాఁడు.)

అర్జు—అన్నయ్యా! ఇప్పుడు క్రోధమున కేమి కారణము?

తే. గీ. చెడ్డపనుల నప్రియం బేమి సేయ లేక,
వీఁడు మాటలఁ జేయుచున్నాఁడు సుమ్మి;
యైనతమ్ములు నూర్గురు నడవిఁ గలిసి,
దుఃఖమునఁ బ్రేలుకొనువీనితోడి దేమి? ౩౧.

భీమ—ఓరోరి భరతకులకలంక!

తే. గీ. ఇప్పుడే పట్టి వధియించి, యేను దుస్స
సేనునొద్దకు నినుఁ బంప లేనె తులన,
మద్గదాకోటినిర్భిన్నమానయుష్మ
దస్థిశబ్దంబు విని గురు లడల రేని? 3౨.

మఱియు నోరిమూఢా!

ఉ. ఆఁడుది వ్రాలె నిపు నెగు లశ్రుజలంబులఁ దీర్చుకొంట, నై
దోడునురంబు వ్రచ్చుతఱి, దూఱముగా నిలుచుండి చూచుటన్,
బాడునృపుండ వీ వుసుఱు పాయవు, మీకుల మన్నతమ్ములేఁ
దూఁడుల కేనుఁ గైనపటుదోర్బలభీముఁడు భీముఁ డల్గినన్. 33.

దుర్యో—దురాత్మా! భరతకులాధమ! ద్యూతదాస! పాండవపశువా! నీ
వలె నేను వ్యర్థప్రలాపములను వచియింపఁ జాలనురా. మఱేమన్న—

తే. గీ. నాగదాదండమునను భిన్నంబు లైన
ఱొమ్మునెమ్ములు వెలభూషణమ్ము లగుచు;
యుద్ధమునఁ బెద్దనిద్దుర నొఱగు నిన్ను
నిపుడె నీసోదరులు చూచి యేడ్వఁ గలరు. ౩౪.

భీము—(నవ్వి) అటు లయిన నీవిషయమున మే మశ్రద్ధతో నుండ రాదు.
ఇదిగో! విను నాప్రతిజ్ఞ.

మహాస్రగ్ధర. బెడిదం బౌ కేలుదోయిన్ బిఱబిఱను గదం బిట్టుగాఁ ద్రిప్పి యూరుల్
పొడిగా నిన్మోది, పాదంబును దల నిడుదుం బ్రొద్దుటం, జూడ ఱేఁడుల్;
కడిమిం ద్వన్ముఖ్యులం జక్కాడఁచి గలదసృక్చందనం బానఖాగ్రం
బొడలన్నేఁ బూసికొం చభ్యుదయభయదభూషోజ్జ్వలస్ఫూర్తి నొందున్. 3౫

(తెరలో) ఓహో! భీమార్జునులారా! ఇదిగో! నిహతాశేషవిపక్షచక్రుండును, నాక్రాంతపరశురామాభిరామయశోవిశాలుండును, ప్రతాపసంతాపితదిఙ్మండల స్థాపితస్వజనుండును, నజాతశత్రుండును, నగు దేవర యుధిష్ఠిరమహారాజుగా రిట్టులాజ్ఞాపించుచున్నారు.

ఇద్దఱు—మహారాజుగా రేమని యాజ్ఞాపించుచున్నారు?

[మరలఁ దెరలో]

చ. అనిఁ దెగువారియంగముల కాపు లొనరిగుఁడి యగ్నిసంస్కృతుల్;
కనుఁగవనీళ్ళతోడ నుదకంబును బంధుల కిందు బాంధవుల్;
కనుఁడి హతప్రజాటవిని జ్ఞాతులకంకవిఖండితాంగముల్;
గొనకొని పోద్దుతో రిపులుఁ గ్రుంకిరి; సైన్యములన్ మరల్పుఁడీ.

ఇద్దఱు—మహారాజునాజ్ఞ నెఱవేఱుఁ గాక- (నిష్క్రమించుచున్నారు.)

(తెరలో) ఓరోరిగాండీవాకర్షణబాహుశాలీ! అర్జునా! అర్జునా! ఇప్పు డెటఁ బోయెదవురా.

కవిరాజవిరాజితము. విడిచితి నీవటరు న్నిముఁ గెల్చెదువి ల్లిది, కర్ణుని పైపగచే;
నడవినిఁ బోలె విశాలరణంబునఁ బ్రౌఢపరాక్రమ మయ్యెను మీ
కడిదము పీడినమద్గురుమూర్ధము నంటుట నెంచుచు వచ్చితి; ని
ప్పుడు ద్రుపదాన్వయఘస్మరుఁ డొగురుపుత్రుఁడు త్రుంపఁడె పాండవులన్?

ధృత—(విని సంతోషముతో) అబ్బాయీ! దుర్యోధన! ద్రోణవధపరిభవోద్దీపితక్రోధానలుండును, దండిక్రంబును బరాక్రమవంతుండును, శివాంశసంభూతుండును, సమరసమానుండును నగునశ్వత్థామ యిదిగో! వచ్చుచున్నాఁడు; నీ వీపీరున నెదురు వోయి సంభావింపుము.

గాంధా—కుమారా! ఈమహాభాగున కెదురు పొమ్ము.

దుర్యో—నాయనా! అమ్మా! కర్ణునిచావు గోరినయీవృథాయాదవ శస్త్రబలభరునితో నేమి ప్రయోజనము?

ధృత—కొడుకా! ఈసమయములో నిటువంటిపరాక్రమవంతులకు వెగటుగా మాటలాడఁ గూడదు.

[అశ్వత్థామ ప్రవేశించుచున్నాఁడు.]

అశ్వ—జయతుజయతు కౌరవేశ్వరః.

దుర్యో—(లేచి) గురుపుత్ర! ఇటు కూరుచుండుము. (కూరుచుండఁ బెట్టుకొనుచున్నాఁడు.)

అశ్వ—రాజా! కౌరవేశ్వర!

తే.గీ. కర్ణముల కింపుగాఁ బల్కి, కర్ణుఁ డాజి
యందుఁ జేసినపని, తెల్ల మయ్యెఁ గాదె?
ద్రౌణి యిప్పు డధిజ్యశరాసుఁ డగుచు
వచ్చె; నీవైరులను దాఁకు? వగవ కింక. ౩౮.

దుర్యో—(అసూయతో) ఆచార్యపుత్ర!

ఆ.వె. అంగరాజు చచ్చినంతట గద నీవు
యుద్ధ మొనరఁ జేయ నుండినావు;
నేను జచ్చువఱకు నీవు ప్రతీక్షింపు;
కర్ణునకును నాకుఁ గలదె వేఱు? ౩౯.

అశ్వ—ఏమి? ఇప్పటికిని గర్ణునియందుఁ బక్షపాతమును, మాయెడలఁ దిరస్కారమునా? రాజా! కౌరవేశ్వర! తథాస్తు. (నిష్క్రమించెను.)

ధృత—కుఱ్ఱా! నీ కిది యేమి వెఱ్ఱి? ఈసమయములో నంతమహాభాగుఁ డయినయశ్వత్థామకు, నీవు ప్రుల్లవిఱుపుమాటలచేత మనసు విఱుగఁ జేసితివి.

దుర్యో—ఇతని కేమి యప్రియము? నే నసత్యము పలికినాఁడనా? ఇది నాకుఁ గ్రోధస్థానము గా దేమి? చూడుఁ.

చ. ధనువులు పూనురాజులకుఁ దల్ప నశక్యపుఁబేర్మివాని, నీ
కొనరినభాగ్యదోషమున యుద్ధమునం దెగినట్టివాని, నిం
దన మొనరించె, నాయెదుర, నాప్రియమిత్రుని, నంగరాజు; న
ర్జునునకు ద్రోణిపుత్రునకుఁ, జూడ విశేష మదేమొ చెప్పుమా. ౪౦.

ధృత—నాయనా! ని న్ననవలసిన దేమి? భరతకులమున కిది యవసానసమయము. గాంధారీ! మందభాగ్యుఁడను నే నిప్పు డేమి చేయుదును? (ఆలోచించి) కానీ. సంజయా! భారద్వాజుఁ డయినయశ్వత్థామతో నాపలుకులుగా నిట్లు పలుకుము.

చ. పడవుగ వీనితోఁ గుడుచు స్తన్యము నేమఱినాఁడవయ్య? నీ
వెడలను బాఱఁక, నావలువయుఁ బఱ దన్నోను నీదుబాల్యమం

దుడుగనిభ్రాతృదుఃఖముననో, చిరమైత్రినో, వ్యత్యయంబుగా
నుడివినవీని చో, గురుతనూభవ! పెంపకుమయ్య క్రోధముల్. ౪౧.

సంజ—చిత్తము. (లేచుచున్నాఁడు.)

ధృత—మఱియు నిట్లని కూడ వచియింపుము.

చ. అనృతము వించు నీజనకుఁ డట్టులు శస్త్రము నుజ్జగించుటల్,
గనుఁగొన నంతవానికిని గల్గినతాదృశ మానవజ్ఞ యుల్,
దనయుఁడ వైననీదుబలదర్పములుం, దలపోసితే, సుయో
ధనుపలు కెంతువా? ప్రతివిధానము సేయుదు గాక ద్రోణజా! ౪౨.

సంజ—చిత్తము. (నిష్క్రమించుచున్నాఁడు.)

దుర్యో—సూతుఁడా! మాయుద్ధరథమును సన్నద్ధము సేయుము.

సూతు—చిత్తము దేవా! (నిష్క్రమించుచున్నాఁడు.)

ధృత—గాంధారి! మన మీలాగున మద్రాధిపతి యయినశల్యునివిడి దికిం బోవుదము. అబ్బాయీ! నీవు నిట్లు చేయుము. (చెవిలో) ఈలా గీలాగు (అందఱు నిష్క్రమించుచున్నారు.)

గద్యము. ఇది శ్రీపరమేశ్వరవరప్రసాదలబ్ధసరసకవితాధురంధర వడ్డాది పాఢువంశక్షీరనీరాకరరాకాసుధాకరాచ్చనామాత్యపౌత్ర హరితసగోత్ర పవిత్రగుణకదంబలక్ష్మాంబాగర్భశుక్తిముక్తాఫల సూరపరాజప్రధానతనూభవ విబుధవిధేయ సుబ్బరాయనామధేయాంధ్రీకృత వేణీసంహార నాటకంబునందుఁ బంచమాంకము.

శ్రీరస్తు.

శ్రీపరమాత్మనే నమః.

వేణీసంహారనాటకము.

షష్ఠాంకము.

[తరువాత నాసనస్థుఁ డయి ధర్మరాజును, ద్రౌపదియుఁ, జేటియుఁ, బురుషుఁడును బ్రవేశించుచున్నారు.]

యుధిష్ఠిరుఁడు—(విచారముతో నిట్టూర్పు విడిచి)

ఉ. ఎట్టెటొ భీష్మసాగరము నీదియు, ద్రోణమహాగ్ని నార్చియున్,
గట్టిఁడికర్ణపన్నగముఁ గాసిలఁ జేసియు, శల్యుఁ గూల్చియున్,
గట్ట! యొకింత తక్కువగఁ గాంచుజయంబున, మాకు నెల్ల ని
ప్పట్టున, భీముసాహసపుఁబల్కున జీవితశంక పుట్టెఁగా!

ద్రౌపది—(కన్నీళ్లతో) మహారాజా! పాంచాలిచేత నని యెందు కనరు?

యుధి—ద్రౌపదీ! నాచేతనే సుమీ! (పురుషునిఁ జూచి) బుధక!

పురు—దేవా! ఆజ్ఞాపింపుఁడు.

యుధి—నీవు పోయి సహదేవునితో నిట్లు చెప్పుము. భీమసేనుండు క్రోధావేశంబున "నే నీదినంబునఁ దప్పక సుయోధనుని వధించెదను; లేకున్న నేను జచ్చెద" నని చేసినదారుణప్రతిజ్ఞను దెలిసికొని, మహాభిమాని యయిన దుర్యోధనుఁడు మాయ మయ్యెను. కావున వానిజాడ నెఱింగి వచ్చుటకు, మిక్కిలి నిపుణ మయినబుద్ధి గలిగినట్టియు, నయ్యయికందువుల నెఱింగినట్టియు, భక్తివిశ్వాసములు గలిగినట్టియు సచివులు, తప్పటలతోడఁ జాటించుచు, శమంతపంచకమునఁ జరింప వలయును; దుర్యోధనుజాడఁ దెలిసి వచ్చినవారికి, ధనము మొదలుగాఁ గలపసదనంబు లీయఁబడు నని, స్పష్టముగాఁ దెలుప వలయును.

మఱియు—

సీ. నీళ్ళజాడలు దీయ నేర్చుజాలరు లూబినేలలం దిసుకల నెమక వలయు;
నల్లిబిల్లిగఁ దీగ లల్లుకొంత ఱెల్లుగుంగొల్లలు పొదలఁ గన్గొనఁగ వలయు;

నిజపరచరణాంక నిపుణులౌ నెఱుకులు వ్యాఘ్రాటవులయందు నరయవలయు;
తంత్రదక్షులైన మేల్ప్రణిధులు జడచారివేసాల మునులట్ల వెదుక వలయు;

పురు—దేవా! చిత్తము.

యుధి—మఱియు నిట్లని కూడఁ జెప్పుము.

తే.గీ. అలుకుచు రహస్యమున మాట లాడువారి,
సుప్తులను, రోగులను గూడఁ, జూడ వలయుఁ;
బులుఁగులయెలుంగు, మృగములకలఁత, రాచ
గుఱ్ఱములనడుగులు, నడవిలో నెఱుఁగ వలయు. —౨.

పురు—చిత్తము దేవా! (నిష్క్రమించి మరల వచ్చి సంతోషముతో) దేవా! పాంచాలకుఁడు వచ్చినాఁడు.

యుధి—శీఘ్రముగాఁ దీసికొని రా.

పురు—(నిష్క్రమించి పాంచాలకునితో మరల వచ్చి) ఇదిగో! రాజుగారు; సన్నిధికిం బొమ్ము.

పాంచా—(సమీపించి) దేవా! జయముజయము. దేవరకును దేవేరికిని బ్రియము దెలుప వచ్చితిని.

యుధి—భద్ర! పాంచాలక! దురాత్ముఁ డయినయాకౌరవాధముని జాడ, యేమయినఁ దెలిసినదా యేమి?

పాంచా—దేవా! జాడమాత్రమే గాదు; దేవీకేశాంబరాకర్షణమహాపాతకహేతుభూతుం డగునాదురాత్ముఁడే తెలిసికోఁబడెను.

యుధి—(సంతోషముతోఁ బాంచాలకునిఁ గౌఁగిలించుకొని) భద్ర! మేలు మేలు! ప్రియ మెఱింగించితివి. మఱి కంటి కగపడినాఁడా?

పాంచా—దేవా! యుద్ధమున కగపడినాఁడా యనుండు.

ద్రౌప—(భయముతో)ఏమి నానాథుఁడు సమరగోచరుఁడై యున్నాఁడా?

యుధి—(సంశయముతో) నిజముగా మాతమ్ముఁడు యుద్ధములోనే యున్నాఁడా?

పాంచా—మహారాజుగారితో నేను మఱియొకలాగు మనవి చేసికొందునా?

యుధి—తే.గీ. కారణము లేకయే మది కలఁతపడుచు,
నూరక వివేకహీనత నొందుచుండె;

గదను ధరియించుభీమువిక్రమ మెఱిఁగియు,
సందియముఁ బొందుచున్నాను జయమునందు. ౯.

(ద్రౌపదివంకఁ జూచి యామెమోమునుండి కన్నీళ్ళు దుడిచి వేయుచు). ఓసుక్షత్రియురాలా!

చ. గురువులు బంధువుల్ నృపులకోట్లు గనన్, మనకైననాఁటి దు
ష్పరిభవ ముత్తరింప నిరుపద్రుతు లున్నవి; యెవ్వి యన్న, సుం
దరి! మన మైన నందఱముఁ,దప్పక ప్రాణము పాయఁగా వలెన్;
గురుకులపాంసనుం డయిన, గొబ్బునఁ జావ వలెన్ రణంబునన్. ౧౦.

అయినను సందేహ మెందుకు?

తే.గీ. ప్రతిన చెడు నేమొ యని, భయపడుచు నున్న
యమ్మహావీరుచే నిశ్చయముగఁ జచ్చు,
నిండుఁగొలువున నీతలవెంట్రుకలను
బట్టి, ని న్నీడిపించినపాపపశువు. ౧౧.

పాంచాలకా! చెప్పుచెప్పు. ఆదురాత్ముఁ డెట్లు లగపడెను? ఇపుఁడెక్కడ నేమి జరుగుచున్నది?

పాంచా—దేవా! దేవీ! చిత్తగింపుఁడు. దేవరవారిచేత నట్లు మద్రేశుం డయినశల్యుండు దెగుటయు, శకునిశలభంబు సహదేవానలంబునం బడి ప్రమగ్గు టయుఁ, దక్కినకౌరవాదిపాటిజోదులు, తమదళవాయిచావును జనములయాక్రంద నమును జూచి, రణరంగమునకుఁ దొలంగి పోవుటయు, మనసైన్యంబులు శత్రు పరాజయంబు గాంచి పొంగుచు, విచిత్రపరాక్రమంబున ధృష్టద్యుమ్నాధిష్ఠితం బు లయి యుండుటయుఁ, గృపకృతవర్మాశ్వత్థామలు విచ్చుమొగ్గవుటయు నా లోకించి, దురాత్ముఁ డక్కౌరవాధముఁడు బెంగగొని, భీమసేనునిదారుణప్రతిజ్ఞ కు నడలి యెక్కడనో యడఁగి పోయెను.

యుధి—ఛీ! యేమి పని చేసెను? తరువాతఁదరువాత?

ద్రౌప—ముందుసంగతి చెప్పు.

పాంచా—దేవా! దేవీ! అవధరింపుఁడు. తరువాత భీమార్జును లిద్దఱును, వాసుదేవాధిష్ఠితం బయినరథం బెక్కి, శమంతపంచక మంతటను వెదకిరి; గాని వానిజాడ కొంచెమయినను దెలియ రాదయ్యెను. పిమ్మట మాబోఁటిభృత్యు

లం ద్వైవమును దలంచి శోకించుచుండిరి. అర్జునుండు మన్నారని వేఁడినిట్టూర్పులు పుచ్చుచుండె. వర్షకాలమున సంధకారబంధుర మగురాత్రివేళఁ, దళతళ మని యెడుమెఱుంగుల తెఱంగున వెలింగెడుపింగళేక్షణంబుల, భీమసేనుండు నిజగదా దండంబును బ్రజ్వలింపం జేయుచుండె. భగవంతుఁడయినకృష్ణుండు విధిచెయ్వుల దూఱుచుండె. అట్టిసమయంబున నొకానొకపురుషుండు, తనచేత మాంసభార మును బట్టుకొని, క్రొత్తగాఁ జంపినమృగము నెత్తుటం జొత్తిల్లినకాళ్ళతోడను, గట్టుఁబట్టతోడను, బరుగుపరుగున వగర్చుకొనుచు భీమసేనునిసన్నిధికి వచ్చి, నిట్టూర్పులసందడిని నగమునగము విననఁబడియెడునక్షరములచేత నూహింపఁ దగి నమాటలతో, నిట్లు విన్నవించెను. దేవా! ఈచేరువ నొకమహాహ్రదంబుతీరం బున, మడుఁగులో దిగినయడుగులజాడలు రెండు గనంబడుచున్నవి. అం దొకటి నీళ్ళనుండి వెడలి వచ్చినట్లున్నది. రెండవది యట్లు గాదు. మీఁద దేవరచిత్త ము. అనుటయు మే మందఱముఁ దొందరగా బయలుదేఱి, యామడువుఁ జూపు టకై యప్పురుషుని ముందుంచుకొని పోయితిమి. అనంతర మా రెండవపదపద్ధతి దుర్యోధనుని దగుట నిరూపించి భగవంతుండు కృష్ణుం డిట్లనియె. ఓవృకోదర! దుర్యోధనుఁడు జలస్తంభవిద్య నెఱుంగును గదా. దానం జేసి నిశ్చయముగా నీరు జడ్డించి, వాఁ డీమడువున దాఁగి యున్నవాఁడు, అనిన నబ్బలానుజునిమాట విని యుబ్బి, దిక్కు లెల్లం బూరటిల్ల, మొసళ్ళు మొద లయినజలజంతువులు తల్లడిల్ల, మడువంతయుఁ గలఁగి పోవ, భీమసేనుండు భీకరంబుగాఁ బెద్దబొబ్బ పెట్టి యిట్లనియె. ఓరోరివృథాప్రఖ్యాపితాలీకపౌరుషాభిమానీ! పాంచాలరాజ తనయాకేశాంబరాకర్షణమహాపాతకీ! ధార్తరాష్ట్రాపసదా!

చ. పొడమితి విందువంశమునఁ; బూనితి విప్పటికి న్మహాగదన్;
విడువక దుస్ససేనునిలివెచ్చని నెత్తురు ద్రావుశత్రు నన్
గడు నిరసించి తట్లు మధుకైటభవైరిని ధిక్కరించి తి
ప్పుడు పసరంబ! పంకమున మున్గి యడంగితి నాకు జంకుచున్. ౬.

మఱియునోరిమానధనా! కౌరవాధమా!

ఉ. కౌరవనిష్కుటంబు లొగిఁ గాంతులు చచ్చి, విముక్తకేశవి
స్తారము లొంట, నాకతన ద్రౌపదిక్రోధమహానలంబు చ
ల్లారెను; దుస్ససేనుహృదయంబున నెత్తురు ద్రావఁ జూచి, యీ
మారుతి నేమి చేసి తిది మానము చంపుకొనంగ వేళయే? ౭.

ద్రౌప—నాథా! నీవు మరల వచ్చి నాకంటఁ బడితి వేని నాకోపము తీఱినట్లే.

యుధి— ద్రౌపదీ! యీసమయమున నమంగళములను నోట రానీయఁ గూడదు. భద్ర! తరువాతఁదరువాత?

పాంచా—దేవా! తరువాత నివ్విధంబం బలుకుచు, వృకోదరుండు వీర్య క్రోధోద్ధతుం డయి, భీషణగదాదండంబును బిఱంబిఱం ద్రిప్పుచు, నువ్వెత్తుగ లోన నుఱికి, యుల్లంఘితతీరంబును, నుత్పన్నసలినంబు, నున్మూర్ఛితగ్రాహంబును, నుద్భ్రాంతసమస్తశకుంతంబును నయి, యమ్మహాహ్రదంబంతట నడిగుండములు పడునట్లు భయంకరముగా నీ రంతయుఁ గలిపి వేసెను.

యుధి—భద్ర! అట్లయినను వెలువడ లేదు గదా?

పాంచా—దేవా! యెట్లు వెలువడకుండును?

చ. వెలుచ భుజంబులం జఱచి, భీముఁడు పెన్నదువ్వం గలంచినన్
బలుఁదఱిగొండకవ్వమునఁ బాల్కడలి న్మును గాలకూటముం
బలె, నొకమూలనుండి కురుపాంసనుఁ డుత్కటకోపపావకో
జ్జ్వలితమవిస్ఫులింగముల, సత్వరుఁడై వెడలెన్ హ్రదంబునన్. 6.

యుధి—సుక్షత్రియా! మేలుమేలు!

ద్రౌప—యుద్ధమునకు వచ్చినాఁడా లేదా?

పాంచా—అట్లు లాజలాశయంబునుండి పయికి లేచి, యురుఁగరంబులఁ బెనుగదను బిఱబిఱం ద్రిప్పుచు, దుర్యోధనుం డిట్లనియె. వృకోదరా! నీభయంబున నేను దాఁగితి నని సమర్థించుకొనుచున్నావా? మూఢుఁడా! పాండుపుత్రుల ను జంపకుండఁ బరులకంటం బడుటకు సిగ్గుపడుచు, బడలిక దీర్చుకొనుటకుఁ బాతాళమునకుఁ బోయి యుంటిని. అను చుండునంతలోఁ, గృష్ణార్జును లిద్దఱు నుం బోయి, నీళ్ళలో గదాయుద్ధము సేయఁగూడ దని, భీమదుర్యోధనుల నొడ్డునకుఁ దీసికొని వచ్చిరి.

అప్పుడు కౌరవనాథుండు గూరుచుండి, తనచేతిగదను గ్రిందఁ బెట్టి, చచ్చి పోయిననూఱుగురుతమ్ములయు, వాజివారణవీరభటులయుఁ, గళేబరంబులను, గాకులును గ్రద్దలును రాపులుఁగులును నక్కలును గుక్కలును బీకికొని తినుచుండుటచేత బీభత్సంబైనదియు, దుర్యోధనబలంబు పేరు మాసినదియు, మనవీరులసింహనాదమ్ములకతమ్మున నిమ్మడిగా మొరసెడురణతూర్యములచేత సం

కుల మెఱుఁగనదియు, దనచుట్టములం దొక్కఁడుఁ డయిన లేనిదియుఁ, బగవారి బంధువులతో నిండి యున్నదియు, నగు కౌరవయుద్ధరంగంబును దేటి పాఱఁ జూచి, యూరారా జున్నరని వేఁడినిట్టూర్పులు పుచ్చుచుండె.

యుధి—తరువాతఁ దరువాత ?

పాంచా—దేవా! అయ్యవసరంబున వృకోదరుం డిట్లనియె. ఓయి కౌరవ రాజా! బంధుజనమును గూర్చి దైన్యపడుటచే నేమి ప్రయోజనము? పాండవులు సమర్థులు, నే నసహాయుఁడ నని, విషాదంబు నొందకుము.

తే.గీ. నీవు యుద్ధంబు సేయ, మా యేవురందు
నిచ్చ వచ్చినవానిని నేఱుకొనుము;
కవచము ధరించి, వలయు కైదువులు గొంచు,
సలుపు మాతనితో రణోత్సవము నేఁడు. ౯.

అనుపలుకు లాలించి యాకురురాజు, కొంచెము గన్నీటితోఁ గూడుకొనినచూపును భీమార్జునులమీఁద నిలిపి యిట్లనియె.

ఆ.వె. కర్ణు, దుస్ససేనుఁ, గడ తేర్చినట్టిమీ
యిరువురును, సమాను లిపుడు నాకు;
నప్రియుండ వయిన, నతిసాహసుండ వౌ
నీవ, ప్రియతముండ వెంచ ననికి. ౧౦.

అని లేచి పరస్పరక్రోధాక్షేపపరుషవాక్యలహాప్రసారితఘోరసంగ్రాములై భీమదుర్యోధనులు, నిజభుజాదండంబుల విచిత్రగదాపరిఘంబులు శోభిల్ల, మండలప్రచారంబుల విహరించుటకు నారంభించిరి. అంత నేనును భగవంతుం డయినచక్రాయుధునిచే దేవరయొద్దకుఁ బంపఁబడితి . మహానుభావుం డయిన దేవకీనందనుండు మీతో నిట్లు మనవి చేయుమనియె. భీమసేనుండు పర్యాపితప్రతిజ్ఞుం డగుటయు, దుర్యోధనుండు విచ్చుమొగ్గగుటయుఁ జూడ, మాకు మిక్కిలి విషాదంబు గలిగినది. ఇంక నిప్పుడో, భీమసేనునిచేత సుయోధనుండు చిక్కినాఁడు గావున, నిష్కంటకం బయినయీభూతలం బంతయు నీ వేలుకొమ్ము. అభ్యుదయోచితంబు లగునవరతమంగళసమారంభంబులు సమకట్టింపుము. సందేహము వలదు.

మ. తగ నింపన్వలె రత్నకుంభములు త్వద్రాజ్యాభిషేకార్థమై;
మిగులం బండువు సేయఁగా వలెను బేర్మిం ద్రౌపదీవేణికిన్;

జగతిం దక్షత్రతరుచ్ఛిదాపరశుభాస్వత్పాణి యారాముడుం,
మొగిం గ్రుద్ధుం డగుభీముడుం, సమరముం బూనంగ జం కేటికిం ?

ద్వారి—త్రిభువనాధినాథుం డగుదేవుం డిట్టు లానతిచ్చుచుండ, మరి యొకలాగేల జరుగును ?

పాంచా—ఇది కేవల మయ్యసురాంతకునియాశీర్వచనము కాదు. ఆదేశమే.

యుధి—భగవంతుం డగునమ్మహాత్మునిసందేశమున కెవ్వఁడు సంశయించును? ఎవఁడురా అక్కడ ?

[కంచుకి ప్రవేశించుచున్నాఁడు.]

కంచు—దేవా ! ఆజ్ఞాపింపుఁడు.

యుధి—దేవకీనందనుం డయిన దేవుని ప్రసాదంబున, భీమునివిజయమంగళాశంసార్థంబుగాం, దదుచితసమారంభముల సమకట్ట వలయును.

కంచు—చిత్తము దేవా ! (ఉత్సాహముతో నడచి) ఓహో ! సంవిధాతృపురస్సరు లగునంతఃపురద్వారికులారా! యథాప్రధానంబుగా మీ రందఱు వినుండు. భుజబలపరిక్షేపోత్తీర్ణ కౌరవపరిభవసాగరుండును, నిర్వ్యాఖ్యదుర్ధరప్రతిజ్ఞాభరుండును, సుయోధనానుజశతోద్ధూనసప్రభంజనుండును, ప్రభంజనతనయుండును, బలవంతుండును, దుశ్శాసనోరుస్థలవిదళనసరసింహుండును, దుర్యోధనోరుస్తంభభంగవినిశ్చితవిజయుండును నగువృకోదరునికి, విజయమంగళంబుల సమకట్టవలయు నని, స్నేహపక్షపాతిమానసంబున నిదిగో! దేవర యుధిష్ఠిరమహారాజుగా రాజ్ఞాపించుచున్నారు.

(ఆకాశమందు)—ఏ మంటిరి? అంతట నధికతరముగా సమకట్టియున్నామే. నీవు చూడవా యేమి యనుచున్నారా ?

కంచు—నాయనలారా! మేలుమేలు! చెప్పకయే మేలు చేయుట మనోగతం బయినస్వామిభక్తిని వెల్లడించును గదా!

యుధి—ఓయిజయంధర!

కంచు—దేవా! ఆజ్ఞాపింపుఁడు.

యుధి—నీవు పోయి, మాకు మేలువార్త దెచ్చినయీపాంచాలకునిం బసదనంబులం బరితోషపెట్టుము.

కంచు—చిత్తము దేవా ! (పాంచాలకునితో నిష్క్రమించుచున్నాఁడు.)

ద్రౌప—మహారాజా! హృదయేశుఁ డయినభీమసేనుఁడు మరల నద్దురాత్మునితోడ "మా యేవురయందు నిచ్చ వచ్చినవానిని నేఱుకొను"మని యెందు నిమిత్త మనెను? ఒకవేళ వాఁడు మాద్రీసుతు లిద్దఱిలో నొకనిఁ గోరుకొని, యాతనితోఁ సమరంబు సేయఁ బూనిన, మహోపద్రవంబు సంభవిల్లును గదా!

యుధి—ద్రౌపదీ! ఆజరాసంధపరిపంథితాత్పర్య మిది; సకలబంధువులును, వీరభటులును జచ్చిపోయి, పదునొకం డక్షౌహిణులసేనలకుఁ, గృపకృతవర్మాశ్వత్థామలు మువ్వురు మాత్రమే మిగిలిరి; కావున, దుర్యోధనుం డిప్పుడు బంధురహితుండును, శరీరమాత్రవిభవుండును నయి, యున్నవాఁడు. అందుచేత నొకవేళ, నభిమానమును వదలిపెట్టి వీఁ డస్త్రసన్యాసము పుచ్చుకొనినను, దపోవనము ప్రవేశించినను, బితృముఖంబున సంధిని గోరినను, సకలరిపులను జయింతునని పూనినతనప్రతిజ్ఞ నెఱవేఱకుండు నని యెంచి, వానికిఁ గొంచె మాసపుట్ట, నట్లు వచియించెను. పాండవు లయిదుగురలో, నొకనితోడ నయిన యుద్ధము సేయుటకు, దుర్యోధనుఁడు చాలఁడు సుమీ. అయినను వృకోదరునకే వీనితోడ గదాయుద్ధము కావలయు నని నేను దలంచుచున్నాను. ఓసుక్షత్రియురాలా! చూడు.

మ. అలుకన్ బెన్గదఁ బూనుభీమునికి సత్యం బీడెవం డాజిలోఁ;
బలరామోపముఁ డాసుయోధనుఁ డనిన్, బ్రాంచద్గదాకౌశలిన్;
గలుగున్ భద్రము ధార్తరాష్ట్రనలినీగంధేభుఁ డౌకుజ్జిరున్;
దలఁతున్ భీమునికే సుయోధనునితోఁ; దర్కింప నే నొండ్లకున్.

(తెరలో) ఓహో! దప్పి గొంటిని దప్పిగొంటిని. కొంచెము నీళ్ళను నీడయు నిచ్చి నన్ను సంభావింప వలయును.

యుధి—(విని) ఓరీ! యెవఁడురా అక్కడ?

[కంచుకి ప్రవేశించుచున్నాఁడు.]

కంచు—దేవా! ఆజ్ఞాపింపుఁడు.

యుధి—అ దేమో తెలిసికొని రా.

కంచు—చిత్తము దేవా! (నిష్క్రమించి మరలఁ బ్రవేశించు)

కంచు—దేవా! వడగొట్టి యొకయతిథి వచ్చి యున్నాఁడు.

యుధి—శీఘ్రముగాఁ దీసికొని రా.

కంచు—చి తము దేవా! (నిష్క్రమించుచున్నాఁడు.)

[తరువాత మునివేషధారి యయినచార్వాకుఁ డనెడు రాక్షసుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

రాక్ష—(తనలో) నేను దుర్యోధనునిమిత్రుఁడ నయినందునఁ, బాండవుల నెట్లయిన వంచింప వలయును. (ప్రకాశముగా) దప్పిగొంటిని దప్పిగొంటిని. కొంచెము నీళ్ళను నీడయు నిచ్చి నన్ను సంభావింప వలయును. (రాజును జేరుచున్నాఁడు.) (అందఱు లేచి నిలువఁబడుచున్నారు.)

యుధి—మునీంద్రా! నమస్కరించుచున్నాను.

రాక్ష—ఇది సముదాచారమునకు వేళ గాదు. కొంచెము జల మిచ్చి నన్ను సంభావింపుము.

యుధి—మునీంద్రా! మీ రీయాసనమునఁ గూరుచుండుఁడు.

రాక్ష—(కూరుచుండి) మీరు కూడ మీమీస్థలములఁ గూరుచుండుఁడు.

యుధి—ఓరీ! యెవఁడురాఅక్కడ?

[బంగారుగిండి చేతఁ బట్టుకొని కంచుకి ప్రవేశించుచున్నాఁడు.]

కంచు—దేవా! ఇదిగోఁ! జల్లనిశిశిరమగుోదకముచేతఁ బూర్ణ మయిన భృంగారము. ఇది దాహము పుచ్చుకొనుటకుఁ బంచపాత్రము.

యుధి—మునీంద్రా! నీరువట్టును దీర్చుకొండి.

రాక్ష—(కాళ్ళు గడుగుకొని యాలోచించి) ఓహో! నీవు క్షత్రియుని లాగున నున్నావు;

యుధి—దేవరవారు చక్కగా నెఱింగితిరి; నేను క్షత్రియుఁడనే.

రాక్ష—ప్రతిదినము నూరక పోరాడుచు, స్వజనవినాశము చేసికొనెడు మీనీళ్లు మొద లగునవి, పరిగ్రహింపఁ గూడదు. కాని. ఈనీడచేతను, సరస్వతీనదిలోనితరంగములను స్పృశించి వీతెంచెడుచల్లగాలిచేతను, నేను శ్రమము దీర్చుకొనియెదను.

ద్రౌప—బుద్ధిమతికా! విసనకఱ్ఱతో మహర్షికి విసరవే.

చేటి—(అట్లు చేయుచున్నది.)

రాక్ష—పూజ్యురాలా! మాయెడల నిట్టియుపచారము లనుచితములు గదా!

యుధి—మునీంద్రా! మీ కేందుచేత నింతయలసట గలిగినది?

రాక్ష—ఓయీ! వటుజనసులభ మయినవేడుకచేతఁ, బూజ్యు లయినక్షత్రియోత్తములద్వంద్వయుద్ధమును జూచుటకయి, శమంతపంచకమునఁ దిరుగు

చుండి, యర్జునసుయోధనుల కగుగదాయుద్ధము నవలోకించి, బలవత్తర మయి నయాశరదాతపతైక్ష్ణ్యంబున కోర్వ లేక, యుద్ధము ముగియ కుండనే చక్క-వచ్చితిని.

అందఱు—(విషాదమును బొందుచున్నారు.)

కంచు—మునీంద్రా! ఆలాగు కాదు. భీమసుయోధనుల కని చెప్పుడు?

రాక్ష—(అసూయతో) ఆ! సంగతి తెలియనివాఁడవు, నన్నెట్టు లాక్షేపించెదవు?

యుధి—మునీంద్రా! చెప్పుండి చెప్పుండి.

రాక్ష—క్షణమాత్రము విశ్రమించి నీ కంతయుఁ జెప్పెదను; కాని యీ ముసలివానికిఁ జెప్పను.

యుధి—చెప్పుండి. ఏమి? అర్జునసుయోధనులకే?

రాక్ష—అర్జునసుయోధనులకగుగదాయుద్ధమని నేనీవఱకే చెప్పియుంటిని.

యుధి—భీమసుయోధనులకుఁ గాదా?

రాక్ష—అది యంతకు మునుపే జరిగి పోయినది.

[యుధిష్ఠిరుఁడును, ద్రౌపదియు మూర్ఛిల్లుచున్నారు.]

కంచు—(నీళ్ళు చల్లి) దేవా! దేవీ! ఊఱడిల్లుఁడు.

చేటి—దేవీ! ఊఱడిల్లు మూఱడిల్లుము.

ఇద్దఱు—(తెలివిని బొందుచున్నారు.)

యుధి—మునీంద్రా! ఏమి చెప్పితివి? భీమసుయోధనులకు గదాయుద్ధమంతకు మునుపే జరిగి పోయిన దేమి?

ద్రౌప—స్వామీ! ఏమో చెప్పుండి. అంతకు మునుపే జరిగి పోయినదా?

రాక్ష—కంచుకీ! వీ రిద్దఱు నెవరు?

కంచు—బ్రాహ్మణోత్తమా! ఈయన యుధిష్ఠిరమహారాజు. ఈమె ద్రౌపదీదేవి.

రాక్ష—హా! ఘాతుకుఁడ నయిన నేను దారుణ మయినసంగతి నుపక్రమించితిని గదా!

ద్రౌప—హా! ప్రాణేశ్వరా! భీమసేన! (మూర్ఛిల్లుచున్నది.)

కంచు—ఇప్పుడు చెప్పిన తే మున్నది?

చేటి—దేవీ! ఊఱడిల్లు మూఱడిల్లుము.

యుధి—(కన్నీళ్ళతో) బ్రాహ్మణోత్తమా!

తే.గీ. పదము సందిగ్ధముగ నుంటఁబట్టి, యిట్లు
తీవ్రదుఃఖంబుఁ బొందు యుధిష్ఠిరుండు;
భీమునిశ్చితవార్తను వినినపిదపఁ,
బ్రాణములఁ బాసి సౌఖ్యంబు పడఁగలండు. ౧౩.

రాక్ష—(సంతోషముతోఁ దనలో) ఇదే నాప్రయత్నమును. (ప్రకాశముగా) ఆలాగయిన, నవశ్యము చెప్ప వలసినసంగతులను, సంగ్రహముగాఁ జెప్పెదను. బంధువ్యసనమును విస్తరించి చెప్పి, మఱింతచింత గలిగింపఁ గూడదు.

యుధి—(కన్నీరొలుకుచుండ)

తే.గీ. ప్రణతి గావింతు నరగఁ జెప్పంగదయ్య,
సంగ్రహంబుగనో సవిస్తరముగానొ;
యనుజుఁడెస నేమి మూఁడెనో వినుట కేను,
సావధానత నుంటి, వాచంయమీంద్ర ! ౧౪.

రాక్ష—రాజా! వినుము.

చ. కరము గదాధ్వనుల్ నిగుడఁ, గౌరవభీములు పోరుచోటికిన్,

ద్రౌప—(హఠాత్తుగా లేచి) తరువాతఁ దరువాత ?

రాక్ష—(తనలో) వీరిద్దఱకు మరలఁ దెలివి యన్నది రాకుండుటకు నే నేమి చేయుదును ? (ప్రకాశముగా)

నరగ బలుండు రా, నతనిసన్నిధిఁ జేరిరి చాల నేపనం
తర మతిశిష్యవత్సలతఁ, దద్బలరాముఁడు సంజ్ఞ సేయ, న
క్కురుపతి, దానికి లెంకేఁగి, కూల్చె వృకోదరు, నొక్కపెట్టునన్.

యుధి—హా! తమ్ముఁడా! వృకోదరా! (మూర్ఛిల్లుచున్నాఁడు.)

ద్రౌప—హా! ప్రాణేశ్వరా! హా! భీమసేన! నాకుఁ గలిగినపరాభవమును సహింప లేక, నీజీవమును విడిచి పెట్టితివా? నాథా! హా! జటాసురబకహిడింబకిమ్మీరకీచకజరాసంధనిషూదన! హా! సౌగంధికాహరణచాటుకార! హా! పలుక వేమి? ప్రాణేశ్వరా! (మూర్ఛిల్లుచున్నది)

కంచు—(కన్నీళ్ళతో) హా! భీమసేనకుమార! హా! ధార్తరాష్ట్రకులకమలినీప్రాలేయవర్ష! మహారాజా! ఊఱడిల్లుము. బుద్ధిమతికా! దేవిగారి నూఱడింపవే, మునీంద్రా! మీరు కూడ మహారాజుగారి నూఱడింపుఁడు.

రాక్ష—(తనలో) ఆ! ప్రాణత్యాగము చేయ నూఱడించెదను. (ప్రకాశముగా) ఓయిభీమాగ్రజ! ఇంకను జెప్ప వలసినసంగతి యున్నది. ఒక్కక్షణ మూఱడిల్లుము.

యుధి—(మూర్ఛ దేఱి) మునీంద్రా! ఇంకను జెప్ప వలసిన దున్నదా?

రాక్ష—అట్టు లానుశ్రుతియుండు నిహతుం డై, వీరసులభం బైనపుణ్యగతిం బొందిన, భ్రాతృవధను జూచుటచేతఁ బొరలి పొరలి వచ్చు దుఃఖంబునఁ గన్నీరు కాలువ లై పాఱ, నర్జునుండు, గాండీవంబు విడిచి పెట్టి, క్రొన్నెత్తుటం జొత్తిల్లి యున్న భీమునిగదను, బిగిసికొని పోయినయతనిచేతినుండి బలవంతముగా నూడఁ దీసికొని, తన్నుఁ గృష్ణుండు సంధి సేయం దలంచి వారించుచున్నను, భ్రామితగదాఘంకారమూర్ఛితగంభీరవచనస్వనుం డై, చిఱునవ్వుతోఁ గౌరవేశ్వరుండు రా రమ్మని పిలుచు చుంటం జేసి, నీమూఁడవసోదరుఁడు వెనుకదీయక, యాతనితోడ యుద్ధంబున కుపక్రమించెను. అప్పుడు మిక్కిలి లాఘవంబు గలిగినగూసుయోధనునిగదాఘాతంబున, వివ్వచ్చుఁడు చచ్చిన కా నిశ్చయించి, బలరాముం డర్జునపక్షపాతి యయినకృష్ణుని, బలవంతముగాఁ దనరథ మెక్కించుకొని, ద్వారకానగరంబునకుఁ గొంపోయెను.

యుధి—మేలు మే లర్జునా! గాండీవమును విడిచి పెట్టుటచేత, వెంటనే నీవు, భీమునిమార్గమును బొందఁ గలవు. ఇఁక నే నేయుపాయమునను, బ్రాణత్యాగమహోత్సవము చేసికొనఁ గలను?

ద్రౌప—హా! నాథా! భ్రాతృవత్సల! గదాయుద్ధమున నేర్పు చాలనినీతమ్ముఁడు, నీచేతిలోనిగదను బలవంతముగాఁ బుచ్చుకొని, పగవానికభిముఖముగాఁ బోవు చుండ, నీ వుపేక్షించుట యుక్త మగునా? (మూర్ఛిల్లుచున్నది.)

రాక్ష—తరువాత నేను——

యుధి—సరే. మునీంద్రా! అటుపయిని వినుట యెందుకు? హా! భీమసేన! హా! జతుగృహసముద్రతరణయానపాత్ర! హా! కిమ్మీరహిడింబాసురజరాసంధజయమల్ల! హా! కీచకసుయోధనానుజకదళీమదకుంజర! హా! ద్యూతపణ్రవణాయి! హా! మామకశరీరస్థితిపరిఖేదశంకానిషూదన! హా! మదాజ్ఞాసంపాదక! హా! కౌరవవనదావానల!

ఉ. సుంతయు సిగ్గు లే కకటులు జూదరి నై నపు డీవు భక్తిమై
దంతిసహస్రసత్త్వుఁడవు దాసుఁడ వైతివిగా! కృశించి; నీ

కింతకు నిప్పు డెక్కు డగునాపదఁ జేసితివయ్య! తమ్ముఁడా!
యెంతయు దిక్కుమాలి విలపించెదున న్నెడఁబాసి తయ్యయో!

ద్రౌప—(మూర్ఛ దెలిసి లేచి) మహారాజా! ఏ మయినది?

యుధి—ద్రౌపదీ! ఏ మే మున్నది?

మ. బకకిమ్మీరహిడింబసూదనుఁడు దృప్యత్కీచకప్రాణఘా
తుకుఁడు, న్మాగధగంధసింధురభిదాదుర్వారనిర్ఘాతుఁడున్,
బ్రకటస్ఫారగదోగ్రదీర్ఘభుజుఁడు, న్నాతమ్ముఁడు, న్నీదునా
యకుఁ డాదుర్జయుఁ డర్జునాగ్రజుఁడు, కష్టా! యస్తమించెం గదా! ౧౭.

ద్రౌప—(ఆకాశమునఁ జూపు నిలిపి) ప్రాణేశ్వరా! నీవు స్వయముగా నాకురులను ముడుతు నంటివి. వీరుఁ డయినక్షత్రియునకుఁ బ్రతిన దప్పుట యుక్తము గాదు; కావున నిదిగో! నేను వచ్చుచున్నా నుండుము. (వెండియు మూర్ఛిల్లుచున్నది.)

యుధి—(ఆకాశమువంకఁ జూచి) అమ్మా! కుంతీ! విన్నావు గదా నీపుత్రునిసమాచారము! అనద నయి విలపించుచున్నన న్నొంటరిగా విడిచిపెట్టి, తా నెక్కడకో పోయినాఁడు, తండ్రీ! జరాసంధశత్రూ! నీ కింతలోనే నూరేండ్లు నిండుటకు, నీయందు లోకు లేమి వైపరీత్యము నాలోకించిరి? వారు గాదు. నేనే యనేకములు పొడ గాంచితిని.

చ. నృపు లరిగాఁపు లౌ వసుధ యెల్లను నా కిడి సిగ్గు గొంట, నే
గపటపుజూదపుంబణముగా నిడ, నల్గక యొప్పుకొంట, నే
నెవ్వఁడు సుఖింప, నవ్విరటునింటను వంటలవాఁడ వౌట, తే
టపఱిచె, నీకు నాయు వకటా! కడు నల్ప మటంచుఁ, దమ్ముఁడా! ౧౮.

మునీంద్రా! ఏ మన్నారు?

చ. కరము గదాధ్వనుల్ నిగుడఁ గౌరవభీములు పోరుచోటికిన్,
నరగ బలుండు రా, నతనిసన్నిధిఁ బోరిరి చాలసేపు, నం
తర మతిశిష్యవత్సలతఁ దప్పలరాముఁడు సంజ్ఞఁ జేయ, న
క్కురుపతి దానికి లెఱిఁగి, కూల్చె వృకోదరు నొక్కపెట్టునన్. ౧౯.

రాక్ష—అవును. అది యాలాగే.

యుధి—ఛీ! నాయదృష్టము. (ఆకాశమువంకఁ జూచి) భగవానుఁడా! కామపాల! కృష్ణాగ్రజా! సుభద్రాభ్రాతః!

మ. ఎద మేనత్తకుమారు లర్కప్రియము నీ కేదీ? నృపన్యాయమా
యది? నాతమ్మునితోడ నీయనుజు నెయ్యం బైన నూహింపవై
తిది యేమీ? ప్రియశిష్యు లిద్దఱును, నీ కీపక్షపాతంబు గా
డను; మాచో దయమాలి తేమనను? గట్టా! నేను నిర్భాగ్యుఁడన్

(ద్రౌపదిని జేరి) ఓ పాంచాలీ! లేలెమ్ము. మన మిరువురమును సమాన దుఃఖము గలవారమే. నీవు మాటిమాటికి మూర్ఛిల్లుచు, మీఁదుమిక్కిలి నన్నేల దహించెదవు.

ద్రౌప—(మూర్ఛ దెలిసి) దుశ్శాసనుఁడు పట్టి యీడ్చుటచేత విడి పోయిననా కేశపాశమును, దుర్యోధనరక్తమునఁ దడిసినచేతులతో, నానాథుఁడు ముడువ వలయును. చేటీ! బుద్ధిమతికా! నీయెదుటనే గదా నాథుఁడు ప్రతిజ్ఞ చేసెను? నాకు వేణీమహోత్సవంబు నారంభింప వలసిన దని దేవకీనందనుండును సందేశము పంపెను గదా? కావున నుత్ఫుల్లకుసుమదామంబులం గొని తెచ్చి, నావేణి నలంకరింపుము. భగవంతుం డగునప్పురుషోత్తమునివచనప్రకార మాచరింపవే. ఆయనయాలోచన కల్ల గాఁగూడదుగదా! అయ్యో! శోకజ్వరంబున నే నిట్లు పలవరించెద నేల? ఇంకను గడుదూర మరుగనిప్రాణనాయకు నే యనుగమించెదను. మహారాజా! నాకుఁ గాష్ఠములం బేర్చి, చితిని బ్రజ్వలింపం జేయుఁడు. మీరును క్షత్రధర్మ మనుసరించి, నాథునిజీవిత మపహరించినశత్రువున కభిముఖు లయి పొండి.

యుధి—పాంచాలి బాగుగఁ జెప్పినది. కంచుకి! దుఃఖమున మఱుఁగుచున్న యీద్రౌపదికిం జితిని బేర్చి యీరాటం బుడుపుము. నాకును సజ్యం బయిన విల్లు దీసికొని రమ్ము. అయినను విల్లేమిటికి?

తే.గీ. భ్రాతృవాత్సల్యమున గాండివంబు విడిచి,
యతని నెత్తుటఁ దడిసినయరుణగదను
గొనుచు నర్జునుఁ డరిగెఁ; గావునను నాకు
నదియు మే లింకఁ జాలు జయాభిలాష. ౨౧.

రాక్ష—రాజా! నీచిత్తంబు రిపుజయవిముఖం బయినయెడల, నెక్కడనేని యొక్కెడఁ బ్రాణపరిత్యాగము చేసికొనుము. వృథాగ నక్కడకుం బోవ నేల?

కంచు—(రోషముతో) ఛీ! మునిజనము పలుకఁ గూడనిరాక్షసార్హవచనము వచించితివి.

రాక్ష—(తనలో) నన్ను వీఁడు తెలిసికొనెనా యేమి చెప్పుమా? (ప్రకాశముగా) ఓకంచుకీ! ఇదిగో నిటు విను. ఇప్పు డచట నర్జునసుయోధనులకు గదాయుద్ధము జరుగుచున్నది గదా! గదాయుద్ధమున వారిరువుర భుజసారమును గూడ నే నెఱుంగుదును. కావున నీవటకే దుఃఖపడుచున్న యీరాజర్షికి, మరల నేమిదుర్వార్త వినవలసివచ్చునో యని, యట్లు పలికితిని.

యుధి—(కన్నీరు విడుచుచు) మునీంద్రా! మేలుమేలు? నాకు హితము నెఱింగించితిరి.

కంచు—మహారాజా! దేవసమాను లగుదేవరవారు శోకాంధు లయి ప్రాకృతజనునివలె క్షాత్రధర్మమును బరిత్యజింతురా?

యుధి—అయ్యా! జయంధర!

తే.గీ. ధనదహరిపురదర్శితోద్గాఢశౌర్య
పరిఘపీవరభుజభీమపార్థు లిపుడు,
పుడమిఁ బడి యుండ, వారి నుక్కడఁచి చెంత
శాత్రవుఁడు నిల్వఁ, జూడ నాశక్య మగునె? ౨౦.

ఓపాంచాలరాజపుత్రీ! నాదుర్నయంబునఁ గదా నీ కీదుర్దశ సంప్రాప్త మయినది. కానీ. ఎంతవేగముగా నగ్ని ప్రజ్వలించిన, నంతవేగముగా మనబంధుజనమును గలిసికోఁగలము.

ద్రౌప—అయ్యా! చిదుగులం బేర్పుము. ఏ మిది? మహారాజుగారివచనము నొక్కఁడైనను జేయ కున్నాఁడు! హా! ప్రాణేశ్వరా! నీవు లేకుండుటను జేసి, యిప్పుడు మహారాజు, పరిజనులచేతఁ గూడఁ దిరస్కృతిని బొందుచున్నాఁడు.

రాక్ష—భరతవంశమునకో డంగ్రడ కిట్లుపత్యనుసరణము శ్లాఘనీయమే గదా!

యుధి—మునీంద్రా! మామాట నొకఁడును వినిపించుకొన కున్నాఁడు. మీ రయిన నింధనప్రదానమున మమ్ముఁ గటాక్షింపుఁడు.

రాక్ష—రాజా! ఇది మునిజనవిరుద్ధము. (తనలో) నామనోరథములు పూర్ణముగా ఫలించినవి; కావున వీరికిఁ గనఁబడ కుండ నిక్కడ నే యుండి, చిదుగులప్రోవును బ్రజ్వలింపఁ జేసెదను. (ప్రకాశముగా) రాజా! ఇట్టిచో మేము నిలుచుటకు శక్తులము గాము. (నిష్క్రమించుచున్నాఁడు.)

యుధి—ద్రౌపదీ! మనమాట యెవ్వఁడును విన కున్నాఁడు. కానీ. నేనే స్వయముగా దారుసంచయమును బ్రోవు చేసి చితి నంటించెదను.

ద్రౌప—త్వరపడు త్వరపడు మహారాజ!

[తెరలోపలఁ గలకలము.]

ద్రౌప—(భయముతో విని) మహారాజ! ఇది యొకానొక తేజోబలదర్పితుని నిర్ఘోషమువలె వినఁబడుచున్నది. మరల నేదో యప్రియము వినవలసి వచ్చును. అందుకే మన మాలస్యము చేయుచున్నాము.

యుధి—ఆలస్యము లేదు. లెమ్ము. (అందఱును నడచుచున్నారు.)

యుధి—ఓపాంచాలీ! అమ్మగారికిని, నీసవతులకును, జెప్పవలసిన దేమో చెప్పి, నీపరిజనమును బంపివేయుము.

ద్రౌప—మహారాజా! బకహిడింబకిమ్మీరజరాసంధజయమల్లుఁ డయిన మీమధ్యమపుత్రుఁడు హతాశురాల నయిననాయందలి ప్రేమచేతఁ బరలోకమున కేగినాఁ డని యత్తగారికి సందేశ మంపెదను.

యుధి—కల్యాణీ! బుద్ధిమతికా! అమ్మగారితో నాపలుకులుగా నిట్లుపలుకుమ్ము.

ఆ. వె. అంటుకొన్నలక్కయింట, బిడ్డలు నీవు
బైటఁ బడితి రెవనిబాహుశక్తి,
నట్టియురుబలాఢ్యుఁ డైననీప్రియపుత్రు
చావు, నోరుఁడు చెప్పఁ జాలునమ్మ? ౨౩.

ఓయిజయంధర! నీవును సహదేపునొద్దకుం బోయి, పూజ్యునిఁ బాండుకులబృహస్పతిని వైమాత్రేయు నాతనిం గాంచి, సకలకురుకులకమలాకరదావానలుం డగుయుధిష్ఠిరుండు పరలోకంబునకుం బోవుచుండి, యనుకూలు నాశంసనీయు నతిప్రాజ్ఞు నాపత్సంపత్సమానధీరు ననుఁగుఁదమ్ముని నిన్ను బిగ్గఁ గౌఁగిలించుకొని, శిరము మూర్కొని, యిట్లు ప్రార్థించెనని చెప్పుము.

ఉ. ఏండ్లకుఁ జిన్న వయ్యు, నిజ మీవు సముండవు నాకుఁ దెల్వి; జ్యే
ష్ఠుండను నేను సోదరతఁ; జూడ గురుండవు నీవు బుద్ధి; న
ట్లుండుటఁ జేసి, మాళిఁ గరయుగ్మముఁ జేరిచి వేఁడుకొందు నిన్,
గొండిక! నీవు నాయెడలఁ గూర్మి; విడుర్పుము నీళ్ళు దండ్రికిన్. ౨౪.

మఱియు బాల్యంబున నాచేతఁ బెంపఁబడ్డవాఁడు, నిరతాభిమాని, మేషసమానహృదయసాహసుండు, నకులుండును, నామాటమీఁద నిలువఁ దగినవాఁడు గావున, నాతనితోఁ గూడ నాపలుకులుగా నిట్లు పలుకుము. వత్సా! నీవు మామార్గ మనుసరింపఁ దగినవాఁడవు గావు సుమీ.

మ. మము నీయన్నల సిద్ధులన్ మఱచి పోవమ్మా తెల్పితిన్ ; బాంధవం
శము క్షీణించుచు, నశ్రుగర్భజల మిమ్మా ; నీవు దాయాదగే
హమునం దైనను, యాదవాన్వయమునం దైన, న్మహారణ్యమ
ధ్యమునం దైన వసించి, ప్రోచుకొనవయ్యా నీయొడల్ తమ్ముఁడా!"

జయంధర! నాతోడే సుమీ. ఈసమాచారము నీవు శీఘ్రముగాఁ బోయి చెప్ప వలయును.

ద్రౌప—చేటి! బుద్ధిమతికా! నీవు ప్రియసఖి యయినసుభద్రయొద్దకుఁ బోయి, నాపలుకులుగా నిట్లు పల్కుము. "చెల్లెలా! మనకోడ లయినయుత్తరకు నిప్పుడు నాలుగవమాసము ; కావున మనకులమును నిలువఁబెట్టఁ దగినదానిగర్భమును, నీవు బహుజాగ్రత్తతోఁ గాపాడ వలయును. పరలోకమునకుఁ బోయిన మేనమామలకును, మాకును గూడ, నెప్పుడయిన నీళ్ళచుక్కలు విడిచి పెట్టుట కాధార మగు" నని.

యుధి—(కన్నీళ్ళతో) హా! ఎంతకష్ట మెంతకష్టము!

ఉ. వావిరిఁ గొమ్మలన్ దెసలఁ బ్రాఁకి, మహీతల మావరించియున్,
లావుగ ప్రాను గట్టి, విపులం బగుపాదున నున్నవృక్షమే,
దైవవశంబునం గరము దగ్ధము గాఁగను, దానిమొక్కయం
దీవడియాస నొందె దిది యిచ్చును నీడ యటంచుఁ గోమలీ! ౨౬.

(కంచుకిని జూచి) అయ్యో! జయంధర! నామీఁద నొట్టుఁ బెట్టుకొన్నను నీవు వెళ్ళకున్నావు గదా!

కంచు—(రోదనము చేయుచు) హా! దేవా! పాండురాజా! నీకుమారు లయినయుధిష్ఠిరభీమార్జుననకులసహదేవుల కెంతదారుణ మయినయవస్థ సంభవించెను! హా! కుంతీదేవీ! భోజరాజభవనపతాక!

ఉ. అన్న సుతుండు నీకు, హరి కన్న, కిరీటికి బావ, కౌరవా
భ్యున్నతకంజకుంజరవృకోదరునొజ్జ, హలాయుధుం డయో!
యెన్నక యీజగంబునకు నెల్లను జల్లనినీడ నిచ్చునీ
కన్నకుమారు లన్నబలుగాన దహించెను, మత్తో వెఱ్ఱియో. ౨౭.

(రోదనము చేయుచు నిష్క్రమించుచున్నాఁడు.)

యుధి—జయంధర! జయంధర!

[కంచుకి ప్రవేశించుచున్నాఁడు.]

కంచు—దేవా! ఆజ్ఞాపింపుఁడు.

యుధి—మీయదృష్టములు చూడ నీపాటివిగా నున్నవి; అయినను మరల నొకమాట చెప్పఁగోరుచున్నాను. ఒకవేళ మాతమ్ముఁ డర్జునుఁడే జయించెనేని, నీ వాతనితో నాపలుకులుగా నిట్లు పలుకుము.

చ. అరయఁగ నాదుతమ్ముమృతి కాబలరాముఁడె హేతువైన, నీ
పరమహితుండు కృష్ణునకుఁ బార్థుఁడ! యన్న గదా యతండు! తీ
వరపడఁ బోకుమీ యతనిపట్టున; నాపయిప్రేమ వీడు; ని
ష్కరుణపుశస్త్రము న్వరలఁ గైకొన కేగు మరణ్యసీమకున్. ౨౮.

కంచు—చిత్తము. దేవా! (నిష్క్రమించుచున్నాఁడు.)

యుధి—(అగ్నిని జూచి సంతోషముతో) ఓహో! నావంటిదుఃఖము గలజనులను, ప్రజ్వలించుచున్నతనశిఖలనియెడుహస్తములచేతఁ బిలుచుచు, భగవానుఁ డయినహుతాశనుఁడు, చక్కఁగ వెలుఁగుచున్నవాఁడు. కావున నాశరీర మిఁక నీయన కింధనముగా సమర్పించుకొనెదను.

ద్రౌప—హా! హా! రాజా! నాథునికి నాయం దధికప్రేమ గావున, ముందుగా నేను బోయెదను. ప్రసాదింపుఁడు.

యుధి—అట్లయిన నీమహోత్సవ మిరువురమును గలిసియే యనుభవింతము.

చేటి—ఓహో! లోకపాలురార! మీరయిన నడ్డుపడి వీరిని రక్షింపుఁడు. ఈయన చంద్రవంశపురాజర్షి, రాజసూయాధ్వరంబున హుతవహునిఁ దృప్తిఁ బొందించినరాజశ్రేష్ఠుఁడు, ఖాండవవనసంతర్పితహుతాశనుం డగునర్జునునకు జ్యేష్ఠభ్రాత, ప్రసిద్ధనామధేయుఁడు, యుధిష్ఠిరమహారాజు. ఈదేవి పాంచాలరాజకులదేవత, యజ్ఞవేదిమధ్యసముద్భవ, యాజ్ఞసేని. ఇట్టివీ రిద్దఱును నిష్కరుణుఁ డయినయీకాలానలునకుఁ దమశరీరములను గట్టెపుడుకలనుగాఁ జేయుచున్నారు; అయ్యో! రక్షింపుఁడు రక్షింపుఁడు. (వారిముందఱఁ బడి) దేవా! దేవీ! ఏమి చేసెదరు?

యుధి—ఓసీ! బుద్ధిమతికా! ప్రాణసమానుఁ డయినతమ్ముఁడును, ప్రాణనాథుఁడును, బోయి నప్పుడు చేయఁ దగిన దేమో యది చేసెదము. కల్యాణీ! లెమ్ము లెమ్ము. ఉదకమును దీసికొని రమ్ము.

చేటి—దేవా! చిత్తము (నిష్క్రమించి మరలఁ బ్రవేశించి) జయము జయము మహారాజా! ఇదిగో! జలపూర్ణ మయినభృంగారము.

యుధి—పాంచాలీ! నీవును నీయందుఁ బక్షపాతము గలభీమునికిని బ్రియుఁ డయినయర్జునునికిని, శీఘ్రముగా నుదకక్రియ నాచరింపుము.

ద్రౌప—మహారాజా! మీ రే యట్లు గావింపుఁడు. నే నగ్నిహోత్రమునఁ బ్రవేశించెదను.

యుధి—లోకాచార మతిక్రమింప రాదు గదా! బుద్ధిమతికా! ఉదక మిటు తే.

చేటి—(అట్లుచేయుచున్నది.)

యుధి—(పాదప్రక్షాళనముచేసికొని యాచమించి ప్రాచీనావీతి యై దేవభాషతో) ఏషతావత్సలిలాంజలి ర్గాంగేయాయ భీష్మాయ గురవే ప్రపితామహాయ శాంతనవాయ; అయ మపి పితామహాయ విచిత్రవీర్యాయ. (కంట నీరు పెట్టుకొని) తండ్రీ! ఇప్పుడు నీవంతు వచ్చినది. (మరల దేవభాషతో) అయ మపి తత్రభవతే స్వర్గస్థాయ గురవే సుగృహీతనామ్నే పిత్రే పాండవే.

ఆ. వె. తర్పణములు మీకుఁ దండ్రి! యింతటనుండి
యేను విడువ సంభవింప దెప్పుడుఁ;
గాన నిప్పు డేను గన్నీళ్ళతో నిచ్చు
సలిల మంబతోడఁ గలిసి క్రోలు. ౨౯

ఆ. వె. తండ్రి! జలజనయన! తమ్ముఁడా! భీమన్న!
యీజలంబు మనకు నిద్దఱకును;
దప్పిగొనిన నీవు త్రాగకుమీ ముందు;
నేను నిదిగో! క్షణములోనె వత్తు. ౩౦.

ఏమి నావెఱ్ఱి! యుద్ధములోఁ జచ్చుటచేత నుత్తమక్షత్రియులలోకమును బొంది యున్న నాతమ్ముని, నే నీవిధమునఁ బ్రాణత్యాగముఁ జేసికొని, చూడఁ గలనా? చూడ లేను తమ్ముఁడా! భీమసేన!

చ. కుడిచితి వీవు నేఁ గుడుచుకొన్నయనంతర-మమ్మచన్ను; ప్రే
ముడిఁ గొనవైతి వన్నరసముల్ మును నేఁ గొన కుండ నెన్నఁడున్;
నడిపితి వన్న యిట్లె సవనంబులయందును సోమపాన, మి
ప్పుడు తగునా నివాపజలముల్ మును ద్రావఁగ నీవు తమ్ముఁడా? ౩౧.

ద్రౌపదీ! పూజ్యుఁ డయినభీమునికి దోసెఁడునీళ్ళు విడిచి పెట్టుము.

ద్రౌప — చేటీ! బుద్ధిమతికా! ఉదక మిటు తే.

చేటి — (అట్లు చేయుచున్నది.)

ద్రౌప — (సమీపించి, దోసిట నిండనీళ్ళు పోసికొని) ఈనీళ్ళెవరికొఱకు విడిచి పెట్టుదును?

యుధి — ఆ. వె. కన్నతల్లి యిపుడు గాంధారితోడ స
మానదుఃఖురాలిఁ గా నొనర్చి,
స్వర్గమునకు నెవఁడు చనియెనో ముందుగా,
వానికొఱకు విడువ వలయు నెలఁది! 3౨.

ద్రౌప — ప్రాణేశ్వరా! స్వర్గస్థుఁడ వయిననీకుఁ బరిజనోపనీత మిది పాపోదక మయ్యెడును.

యుధి — ఓయర్జునాగ్రజ!

తే.గీ. ప్రతిన నెఱవేర్చుకొనకయే పరమగతికి,
బోయితివి గాన, దమ్ముఁడా! పొలఁతి నీకుఁ
దల విరియఁ బోసికొని జలాంజలి నొసంగుఁ,
గొలుకులను వేఁడికన్నీళు లొలుకు చుండ. 3౩.

ద్రౌప — లేలెండు మహారాజ! ఈపాటికి మీసోదరుఁడు చాల దూరము పోవును గదా!

యుధి — (కుడికన్నదరుట సూచించి) పాంచాలీ! భీమునిఁ ద్వరగఁ గలిసికొనియెద వని శకునములు నాకు జెప్పుచున్నవి. కాని. శీఘ్రముగా నగ్నిని సమీపింతము.

ద్రౌప — ఆహా! భగవానుఁడు హుతాశనుఁ డెంతచక్కఁగా వెలుఁగుచున్నాఁడు!

[తెరలోఁ బెద్దకలకలము]

[తత్తఱపాటుతోఁ గంచుకి ప్రవేశించుచున్నాఁడు.]

కంచు — రక్షింపురక్షింపుమహారాజ! ఇదిగో! దురాత్ముఁ డయినదుర్యోధనుఁడు, నెత్తుటితో స్నానము చేసి, రక్తాంబరుండును, రక్తాభిషేకభీషణగదాపాణియు నయి, యుద్ధతకాలదండుం డగుయముండునుం బోలెఁ, బూజ్యురా లయిన పాంచాలి నిందు నందు వెదకుచు, నీలాగుననే వచ్చుచున్నాఁడు.

యుధి — హా! దైవమా! నీనిర్ణయము జరుగుచున్నది, హా! గాండీవధన్వీ!

(మూర్ఛిల్లుచున్నాఁడు.)

ద్రౌప—హా! పాణ్డవేశ్వరా! మామకస్వయంవరస్వయంగ్రాహకుటుంబీ! ధనంజయ! నీప్రియసోదరునిఁ గలసికొని మహారాజును నన్నును విడిచి పెట్టితివి గదా నాథా! (మూర్ఛిల్లుచున్నది.)

కంచు—దేవా! ఊఱడిల్లు మూఱడిల్లుము.

యుధి—(మూర్ఛదేఱి) హా! వత్స! హా! సవ్యసాచీ! హా! క్రుద్ధత్రిలోచనాంగనిష్పేషసాహసదృశమల్ల! హా! నివాతకవచోద్ధరణ నిష్కంటకీకృతామరలోక! హా! బదర్యాశ్రమమునిద్వితీయతాపస! హా! ద్రోణాచార్యప్రియశిష్య! హా! అస్త్రశిక్షాబలపరితోషితగాంగేయ! హా! రాధేయకులకమలినీప్రాలేయసారశరనిచయ! హా! గంధర్వనిర్వాసితసుయోధన! హా! పాండవకులకమలినీ రాజహంస!

తే.గీ. అనుఁగుఁదల్లికి మ్రొక్కక, వినయమునను
కౌఁగిలించుక నాయాజ్ఞఁ గాంచకుండ,
నీస్వయంవరవధువు నీక్షింపకుండ,
దవ్వుఁ బయనంబు వోనేల? తమ్ముగుఱ్ఱ! 38.(మూర్ఛిల్లుచున్నాఁడు)

కంచు—అయ్యయ్యో! ఎంతకష్టము! దురాత్ముఁడగు దుర్యోధనుఁడు పిచ్చలవిడి నీలాగే వచ్చుచున్నాఁడు;

యుధి—అయినచో సర్వథా యిప్పుడిదే కాలోచిత మయినప్రతీకారము బుద్ధిమతికా! పూజ్యురాలగు నీపాంచాలిని జతియొద్దకుఁ దీసికొని పో. నేను నీమె ననుసరించెదను.

చేటి—అయ్యో! రక్షింపుఁడు రక్షింపుఁడు.

కంచు—కల్యాణీ! నీ మొఱ్ఱ నకులసహదేవులకా? దేవిగారియన్న యగు ధృష్టద్యుమ్నునకా? ఇపుడు వారికంటె మఱిరక్షకు లెవ్వరు? మహారాజునవస్థ యీలాగురిడెను. అయినభీమార్జును లిద్దఱు నస్తమించిరి.

[తెరలోఁ గలకలానంతరము.]

ఓహో! శమంతపంచకసంచారులార! రుధిరాస్వాదమత్తయక్షరాక్షసపిశాచభూతబేతాళకంకగృధ్రజంబుకోలూకవాయస భూయిష్ఠావశిష్టవీరయోధులార! నన్నుఁ జూచి యడలి పోకుఁడు. ద్రౌపది యెక్కడ నున్నదో చెప్పుఁడు. ఇదిగో! నావాలుఁగంటి కానవాలు చెప్పుచున్నాను వినుండు.

చ. కురువృకచేతితోఁ జఱచుకొంచు సుయోధనుఁ డోరఁ జూడ, నం
బర మొలువంబడెన్; మఱియుఁ బల్వురలోపల మన్ననేనుఁ దు
ర్ధరతను బట్టి యీడ్చుటను, దొయ్యలి ముంగురు లన్ని ద్రెస్సె; నీ
వరుసఁ బరాభవంపడిన పైదలి, యెక్కడ నుండుఁ జెప్పుఁడీ, ౩౭.

కంచు—ఓ దేవీ! యాజ్ఞసేని! నీ విప్పుడు గూడ ననాథ వయి కురుకుల కలంకునిచేతఁ బరాభవము నొందుచున్నావు గదా!

యుధి—(దిగ్గున లేచి) పాంచాలీ! జడియకు జడియకు. నాకు సజ్యం బయిన ధనువు దెప్పింపుము. దురాత్మా! దుర్యోధనహతక! రా. రా. నా బాణవర్షమున నీగదాకౌశలసంభూతభుజబలపరాగ మణఁచి వేసెదను. ఓరి కురుకులాంగార!

తే.గీ. అలజరాసంధుఁ జంపినయట్టితమ్ము,
హరకిరాతుని గెలిచినయట్టితమ్ముఁ
దలఁచి, నీలాగు ఱాయి నై నిలువ నైన,
నిన్ను వధియింప నైనను, నేర నేను. ౩౮.

[తరువాత గదాపాణియు రక్తసిక్తాంగుఁడు నగుభీమసేనుఁడు
ప్రవేశించుచున్నాఁడు.]

భీము—(వడిగా నడచుచు) ఓహోహో! శమంతపంచకసంచారు లయిన సైనికులారా! ఏ మీతల్లడము?

శా. ఏ రక్షస్సును గాను, భూతమును గా నేలా మృతేభాశ్వవి
స్తారాంగంబులక్రింద దాఁగ? హతశేషక్ష్మాపులారా! ద్విష
చ్ఛారీరక్షతజాభిషిక్తతనుఁడన్, సంలంఘితోరుప్రతి
జ్ఞారత్నాకరుఁ డైనక్షత్రియుఁడ నే; శంకింప మీ కేటికిన్? ౩౯,

కంచు—దేవీ! పాండుస్నుషా! లెమ్ము లెమ్ము. ఇప్పుడు హఠాత్తుగాఁ జిచ్చుఱుకుటయే శ్రేయంబు.

ద్రౌప—(వెంటనే లేచి) నే నిప్పుడు గూడఁ జితిని సమీపింప కుందునా? (చితి కభిముఖి యయి యున్నది.)

యుధి—ఎవఁడురా అక్కడ? అమ్ములపొదియును విల్లును దీసికొని రా. ఏమిది?

పరిజనుఁ డెవ్వఁడును లేఁడయ్యెను? పోనీ. బాహుయుద్ధముచేతనే యీదురాత్ముని గట్టిగ నాసందిటను బట్టి, మండుచున్నయీయగ్ని హోత్రమునఁ బడ వేసెదను.

[నడుము గట్టుచున్నాఁడు.]

కంచు — దేవీ! దుశ్శాసనాకర్షితంబు లయి, కన్నుల కడ్డు పడుచున్న శిరోరుహములను, నీవే యిప్పుడు ముడుచుకొనుము. ప్రతీకారమునెడ నాస యింక వదలి పోయెను గదా! వేవేగఁ జితియొద్దకుఁ బో వలయును.

యుధి — వలదువలదు. దుర్యోధనహంతకుఁడు చావకుండ, నీతలవెండ్రు కలు ముడువఁ గూడదు.

భీము — పాంచాలీ! నేను జీవించి యుండఁగా, దుశ్శాసనుఁడు చిక్కు పఱిచినశిరోరుహములను, నీచేతులతో ముడుచుకో రాదు. ఉండు. నేను ముడిచెదను.

ద్రౌప — (భయపడి పరుగెత్తుచున్నది.)

భీము — నిలునిలు. భీరురాలా! ఇప్పు డెందుఁ బోయెదవు?

(కేశపాశమును బట్టుకొనఁ దలఁచుచున్నాఁడు.)

యుధి — (సత్వరముగ లేచి భీముని సందిటం బట్టి) దురాత్మా! భీమార్జునవైరి! దుర్యోధనహంతక! ఇప్పుడు నీ వెందుఁ బోయెదవురా?

ఉ. చిన్నతనంబునుండియును జేసితి వెగ్గులు మాకుఁ; బ్రత్యహం
బు న్నిజబాహుదర్పమునఁ బొంగెదు; చంపితి రాజపుత్రులన్;
బన్నుగ నస్మదీయభుజపంజరమందును జిక్కినావురా
చెన్నఁటి! యింక నీతరమె జీవముతో నడు గైనఁ బోవఁగన్? 35.

భీము — అహో! నన్ను దుర్యోధనుఁ డనుకొని కాఁబోలు, నీమహా రాజు నాయెముకలు చూర్ణ మగునట్లు, నిర్దయముగాఁ గౌఁగిలించుకొను చున్నాఁడు. అన్నయ్యా! అనుగ్రహింపుఁ డనుగ్రహింపుఁడు.

కంచు — (పోల్చి చూచి సంతోషముతో) ఏమీ భీమసేనకుమారుఁడా? నాయనా! అదృష్టవశమున బ్రతికి వచ్చితివి. మహారాజ! ఇతఁ డాయుష్మంతు డగుమనభీమసేనుఁడు సుండీ. దుర్యోధనరక్తముచేత నొడలును బట్టలును, దడిసి యెఱ్ఱపడుటచేత, రూపుమాఱి పోల్పరాఁ డయ్యెను. ఇంకను శంకింప వలదు.

చేటి—(ద్రౌపదిని గౌఁగిలించుకొని) దేవి! ఇదిగోఁ! దనప్రతిజ్ఞను నెఱవేర్చుకొని వచ్చి, నీప్రాణనాథుఁడు నీకు వేణీసంహారమహోత్సవము సేయఁ గోరి, నీకొఱకు వెదకుచున్నాఁడు.

ద్రౌప—చేటీ! నన్నుఁ గల్లమాటలతో నూఱడించెదవా?

యుధి—జయంధర! నిజమే గద? వీఁడు నావైరి యయినదుర్యోధన హాతకుఁడు గాఁడు గద?

భీము—దేవా! అజాతశత్రూ! భీమార్జునాగ్రజ! ఇంకను దుర్యోధన హాతకుఁ డెక్కడ? నాచేతఁ బాండుకులపరిభావి యయినయాదురాత్ముని—

లయగ్రాహి. కాయ మిలఁ గూలెను నపాయమును బొంది; మయిఁ
బూయఁబడెఁ జందనముచాయ రుధిరంబుల్;
దోయధిచతుష్క పరిఖాయతధరాజయర
మాయువతి నిల్చె భవదీయభుజపీఠిన్;
దోయములు సైనికనికాయములు నాది మహా
నీయసమరాగ్ని శలభాయితము లయ్యెన్;
కాయనిన పే రొకటియే యిపుడు దక్క మిగు
లేయదియు లే దరి కమేయమహిమాఢ్యా! కెగా.

యుధి—(భీమునిఁ జూచుచుఁ గన్నీళ్ళు దుడుచుకొనుచున్నాఁడు.)

భీము—(కాళ్ళమీఁదఁ బడి) అన్నయ్యా! జయము జయము.

యుధి—తమ్ముఁడా! బాష్పజలపూరితలోచనుండ నయి, నీముఖచంద్రునిఁ జూడలేక పోయితిని. అర్జునునితోఁ గూడ నీవు జీవించి యున్నావా? చెప్పుము.

భీము—నిహతాశేషశత్రుపక్షు లయి దేవరవారు సుఖించి యుండఁగా, భీమార్జునుల కేమి కొఱఁత?

యుధి—(మరలఁ బ్రేమతో గాఢాలింగనము చేసికొని)

చ. అరివధ యుండని ష్టటు, రయంబున ముం దిది చెప్పుమా, బకా
సురుఁ గడతేర్చినట్టిప్రియసోదరుఁ డైనవృకోదరుండవే?

భీము—అవు నన్నయ్యా! నేనే.

యుధి—కరమును నోలలాడితివి గా! మును మాగధుపీనవక్షమున్
సరసునఁ జల్లు లాడుచును సంభరితక్షతజాంబుమండలిన్. ౪౦.

భీము—అవు నన్నయ్యా! మీ రొక్కక్షణము నన్ను విడిచి పెట్టుఁడు.

యుధి—ఇంకను నవశిష్ట మేమి?

భీమ—అన్నయ్యా! గొప్పయవశిష్టమే యున్నది. ఇదిగో! దుర్యోధన దుశ్శాసనులరక్తముచేతఁ దడిసినయీచేతులతోడ, దుశ్శాసనాకృష్టము లగు పాంచాలికురులను ముడిచి వచ్చెదను.

యుధి—అటు లయిన శీఘ్రముగా నరుగుము. దీనురా లయినద్రౌపది వేణీసంహారమాహాత్మ్య మనుభవించుఁ గాక.

భీము—పూజ్యురాలా! ద్రౌపదీ! అదృష్టవశంబున రిపుకులక్షయం బయ్యెఁ గావున, నీవింక సుఖం బుండుము.

ద్రౌప—(సమీపించి) నాథా! జయ మవుఁగాక! జయ మవుఁగాక!
(భయముచే వెనుకఁ దీయుచున్నది.)

భీము—రాజపుత్రీ! నన్నుఁ జూచి భయపడియెద వేమి? ఇదిగో నిది—

ఉ. ఏనృపశుండు రాజసభ నీడ్చెనో ముందలఁ బట్టి నిన్ను, నా
హీనునిశోణితంబు; స్పృశియింపుము చేతుల నంటెఁ ద్రాగుచోఁ;
జానరో! కౌరవేశుక్షతజం బిది; మద్గదఁ జూర్ణితోరువుం
గా నొనరించి, మై నలఁదఁ గంటిఁ, బరాభవవహ్ని యాఱఁగన్. ౪౩.

బుద్ధిమతికా! పాండవదార నవహసించినభానుమతి యిప్పు డెక్కడ నున్నదే? కానీ, వేదిసంభవురాలా! యాజ్ఞసేనీ!

ద్రౌప—ప్రాణేశ్వరా! ఆజ్ఞాపింపుము.

భీము—నాఁడు నేననుయీమాట తలంపునకు వచ్చినదా?

"చ. బిఱబిఱఁ ద్రిప్పుకొంచు గద, బిట్టు సుయోధను గిట్టి, పెందొడల్
విఱుగఁగఁ గొట్టి, చేతులను వెచ్చనినెత్తుట నద్ది, నీకురుల్

మెఱుఁగిడి, భీమసేనుఁడవలీలను జిక్కఁడలించి కూర్చెముల్;
గొఱఁకొఱ యేల? దేవి! యిదిగో! ముదమందెను చూడు నీమదిన్."

(ఈపూర్వోక్తపద్యమును జదువుచున్నాఁడు.)

ద్రౌప—ప్రాణేశ్వరా! తలఁపునకే కాదు, అనుభవమునకును వచ్చినది.

భీము—(ఆమెవేణిని ముడుచుచు) దేవీ! దుశ్శాసనవిలులితం బయి, ధార్తరాష్ట్రకాలరాత్రి యయిననీవేణి, నింక నీవు ముడుచుకొనుము.

ద్రౌప—నాథా! ఈవ్యాపారము నా కీవడిలో నలవాటు దప్పెను. ఇంక భవదీయప్రసాదంబున మరల నేర్చుకోవలెను.

చేటి—(వేణిని ముడుచుచున్నది.)

మహాస్రగ్ధర. కురునాథుల్ క్రుద్ధచిత్తుల్ గురుభుజబలులౌ కుంతిపుత్రుల్, నృపాంతః
పురముల్ నిర్ముక్తకేశంబులుగ నలుప యన్మోక్షమే మూల మౌఁ, ద
ద్వరకృష్ణావేణి, క్రోధోద్ధతయమనఖముల్, ధార్తరాష్ట్రాంతకంబుల్,
బరిబద్ధం బయ్యెఁ; జావుల్ ప్రజల కుడిగెడున్; స్వస్తియౌ తేండ్ల కెల్లన్.

యుధి—దేవీ! ఇదిగో! అంతరిక్షసంచారు లగుసిద్ధజనంబులు నీవేణీసంహారమహోత్సవంబునకు సంతసించుచున్నారు.

[తరువాతఁ గృష్ణార్జునులు ప్రవేశించుచున్నారు.]

ఇద్దఱును—(సమీపించుచున్నారు.)

కృష్ణు—విజయతాం నిహతసకలారాతిమండల స్సానుజః పాండవకులచంద్రమా మహారాజో యుధిష్ఠిరః.

అర్జు—విజయతా మార్యః.

యుధి—(చూచి) ఓహో! భగవంతుఁడు పుండరీకాక్షుఁడును జిరంజీవి యర్జునుఁడు నా? (కృష్ణుని) దేవా! నమస్కరించుచున్నాను. (అర్జునుని) తమ్ముఁడా! ఇటు రా. నన్ను గట్టిగాఁ గౌఁగిలించుకో.

అర్జు—(నమస్కరించుచున్నాఁడు.)

యుధి—(కృష్ణునితో) దేవా! భగవంతుండును బురాణపురుషుండును

నగు శ్రీమన్నారాయణుండు స్వయముగా మంగళములను గోరువానికి విజయము గాక మఱి యేమి యగును?

చ. గురుమహదాదివృత్తి నొనగూడినరూపమువాని, సృష్టిసం
భరణవినాశహేతు వగువానినిఁ, బుట్టువు లేనివాని, ని
ర్జరుని, నచింత్యునిం, గుణవిరాజితు, నిన్నుఁ దలంచు నంతనే,
నరులకు దుఃఖముల్ చెదరు నా, గనువారికిఁ జెప్ప నేటికిన్? ౪౩.

(అర్జునుఁ గౌఁగిలించుకొని) వత్సా! నన్నుఁ గౌఁగిలించుకో

అర్జు—(కౌఁగిలించుకొనుచున్నాఁడు.)

కృష్ణు—ఇదిగో! మహాత్ము లయినవ్యాసవాల్మీకిజామదగ్న్యజాబాలిప్రభృతిమహర్షులు, కల్పితాశేషమంగళసమారంభు లయి వచ్చి యున్నారు. మఱియు నకులసహదేవధృష్టద్యుమ్నసాత్యకిప్రముఖసేనానాయకులును, స్కంధోత్తంభితతీర్థవారికలశు లయి, మీయభిషేకమును గోరుచున్నవారు. నేనును జార్వాకుఁడు మిమ్ము వంచించుట వ్యాసమహర్షి వలనఁ దెలిసికొని, యతిత్వరితముగ నర్జునునితో భవత్సకాశమునకుఁ జనుదెంచితిని.

యుధి—ఏమీ? మమ్ముఁ జార్వాకుఁడు మోసపుచ్చెనా? (కోపముతో) దుర్యోధనసఖుఁడు వాఁ డెక్కడ నున్నాఁడు? ఆరాక్షసాధముఁడు నాచిత్తము చాల నుత్తలపఱిచెను.

కృష్ణు—ఆదురాత్ముఁడు నకులునిచేతఁ జిక్కినాఁడు. మహారాజా! నీ కింతకంటెఁ గోరఁ దగినది యేమున్నదో చెప్పుము.

యుధి—భగవంతుఁ డగుదేవర ప్రసన్నత నొందిన, నీయరాని దేమి గలదు. మానవమాత్రుఁ డనుబుద్ధితో నీతోఁ గ్రీడ లాడుచుంటిని. నా కింతకంటెఁ గోరఁ దగిన దేమున్నది? దేవా! చూడుము.

ఉ. చెక్కు చెమర్ప దేవరకుఁ; జెండితి మొంటనివారిఁ; గృష్ణయున్
దక్కెను నాదుదుర్నయమునం బడి దాఁటెఁ బరాభవాంబుధిన్;
మక్కువ మాట లాడెద ననంత! కృతార్థుఁడఁ గానె నేను? ని
న్నక్కఱతోడఁ గోర, నిఁక నన్యము లుండున టయ్య కోరికల్? ౪౪.

అయినను దేవా? నీవు ప్రసన్నుండ వయితివి గాన నిట్లగుంగాక.

మానిని. లోకులు దీనత లేక శతాబ్దములుం బ్రదుక న్వలె సౌఖ్యమునన్;
బ్రాకటతాపకభక్తియు సద్వ్యయభంగి లభింప వలె; న్నృహరీ!
లోకహితుండును, బండితబాంధవుఁడున్, గుణభూరివివేకుఁడు, న
స్తోకశుభంకరుఁ డౌచును రాజు, వసుంధర నెమ్మది నేల వలెన్.

కృష్ణు—తథాస్తు. (అందఱు నిష్క్రమించుచున్నారు.)

గద్యము. ఇది శ్రీపరమేశ్వరవరప్రసాదలబ్ధసరసకవితాధురంధర వడ్డాది
సాధుయశఃక్షీరనీరాకరరాకాసుధాకర రాచ్చనామాత్యపౌత్ర హరి
తసగోత్ర పవిత్రగుణకదంబలక్ష్మాంబాగర్భశుక్తిముక్తాఫల
సూరపరాజప్రధానతనూభవ విబుధవిధేయ సుబ్బ
రాయనామధేయాంధ్రీకృత వేణీసంహార
నాటకంబునందుఁ సర్వంబును
షష్ఠాంకము.

సంపూర్ణము.